శుక్రవారం
28-11-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 67
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad,Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్ర లో
మ్యాగజైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్
మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి: 94405 73343

వందే మాతరం, జై హిందీ నినాదాలొద్దు

▸ ఎంపీలకు రాజ్యసభ సెక్రటేరియట్ నోటిఫికేషన్ ▸ కాంగ్రెస్, తృణమూల్ అభ్యంతరం

న్యూఢిల్లీ: జై హింద్ నినాదం ప్రతి భారతీయుడికి గర్వకారణం. వందేమాతరానిది ప్రత్యేక స్థానం. స్వాతంత్ర్య ఉద్యమానికి ఊపిరి పోసి... ప్రతి యోధుడికి స్ఫూర్తినిచ్చిన ఈ నినాదాలను పార్లమెంటులో నిషేధిస్తూ రాజ్యసభ సెక్రటేరియట్ నోటిఫికేషన్ ఇవ్వడం దుమారం రేపింది. నాడు బ్రిటిష్‌వారు ఈ నినాదాలను చట్టసభల్లో నిషేధిస్తే... ఇప్పుడు బీజేపీ అదే పని చేసిందని కాంగ్రెస్, తృణమూల్ సహా ప్రతిపక్ష పార్టీలు విమర్శించాయి. జైహింద్, వందేమాతరం నినాదాలపై అభ్యంతరం ఎందుకంటూ నిలదీశాయి. సభ హుందాతనాన్ని కాపాడటం కోసం నినాదాలు, విమర్శలు నిషేధిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజ్యసభ సెక్రటేరియట్ వివరణ ఇచ్చింది. కానీ దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలకమైన ఈ నినాదాలపై నిషేధం విధించడం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదని

- మిగతా 2 లో

జనవరి 18న సీపీఐ శత వసంతాల సభ

పంచాయతీ ఎన్నికల రీత్యా తేదీలో మార్పు: కూనంనేని



విశాలాంధ్ర-హైదరాబాద్: సీపీఐ శత వార్షికోత్సవాల ముగింపును పురస్కరించుకొని డిసెంబర్ 26న ఖమ్మంలో లక్షలాదిమందితో నిర్వహించ తలపెట్టిన భారీ బహిరంగ సభ 2026 జనవరి18కి వాయిదా పడింది. సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ అధ్యక్షతన గురువారం జరిగిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల దృష్ట్యా బహిరంగసభను జనవరి 18కి వాయిదా వేశామని, ఈ సభకు దేశ నలు మూలల నుండి ఐదు లక్షలకు పైగా కమ్యూనిస్టు శ్రేణులు హాజరవుతారని కూనంనేని తెలిపారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా పార్టీ అధ్వర్యంలో జాతాలు, వివిధ కార్యక్రమాలు రూపొందించుకున్నట్లు తెలిపారు.

పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో అవగాహన

గ్రామ పంచాయతీ ఎన్నికలలో రాష్ట్రంలో సాధ్యమైన మేరకు కాంగ్రెస్, సీపీఐ అవగాహన కుదుర్చుకొని పోటీ

- మిగతా 2 లో

షేక్ హసీనాకు 21 ఏళ్ల శిక్ష

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా(78)కు మూడు అవినీతి కేసుల్లో 21 ఏళ్ల శిక్ష విధిస్తూ ఢాకా కోర్టు గురువారం తీర్పునిచ్చింది. ఆమె ఇద్దరు బిడ్డలకు ఐదేళ్ల చొప్పున శిక్ష , లక్ష రూపాయల జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో నెల రోజులు అదనంగా జైల్లో ఉండాల్సి వస్తుందని తీర్పు పేర్కొంది. రాజధాని సమీపంలోని పుర్బాచల్‌లో ప్రభుత్వ హౌసింగ్ ప్రాజెక్టు పరిధి ప్లాట్ల కేటాయింపులో అవినీతికి పాల్పడినట్లు తేలడంతో హసీనా కుమారుడు సజీబ్ వజేద్ జాయ్, కుమార్తె సైమా వజేద్ పుతుల్‌కు

- మిగతా 2 లో

బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదమే లక్ష్యం

తొమ్మిదో షెడ్యూల్లో సవరణ జరగాలి

పార్లమెంటులో పోరాడండి

రాష్ట్ర ఎంపీలకు డిప్యూటీ సీఎం భట్టి దిశానిర్దేశం

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ ఎంపీలతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. గురువారం ప్రజాభవన్‌లో రాష్ట్ర పార్లమెంట్ సభ్యులతో కలిసి ఆయన కీలక సమావేశం నిర్వహించారు. పార్లమెంట్‌లో ప్రస్తావించాల్సిన అంశాలు, వ్యూహంపై డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా చర్చించారు. 12 శాఖలకు సంబంధించిన 47 అంశాలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ భేటీకి కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, కడియం కావ్య తదితరులు, బీజేపీ ఎంపీలు రఘునందన్ రావు, నగేష్, సీఎస్ రామకృష్ణ రావు తదితరులు హాజరయ్యారు. డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఎంపీల సమావేశం ఏర్పాటు చేశామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. బీసీలకు సంబంధించిన 42శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం తొమ్మిదవ షెడ్యూల్లో సవరణ జరగాలి. ఈ అంశంపై పార్లమెంటు సమావేశాల్లో ప్రత్యేకంగా చర్చకు తీసుకురావాలన్నారు. నిర్దేశిత ఫార్మాట్ లో వాయిదా తీర్మానం లేదా ప్రశ్నోత్తరాల గంటలో చర్చకు తీసుకురావలని పేర్కొన్నారు. అన్ని పార్టీల ఎంపీలు ప్రధానమంత్రిని కలిసి వినతి పత్రం సమర్పించాలని, ప్రధానమంత్రి సమయం ఇస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన

- మిగతా 2 లో

అవగాహనతో ముందుకెళ్దాం

▸ పంచాయతీ ఎన్నికల్లో పరస్పర పోటీని నివారిద్దాం

▸ సీపీఐ, సీపీఎం నిర్ణయం

విశాలాంధ్ర-హైదరాబాద్: గ్రామపంచాయతీ ఎన్నికలలో సీపీఐ, సీపీఎం పరస్పర అవగాహనతో బరిలోకి దిగనున్నాయి. హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో గురువారం జరిగిన సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుల సమావేశంలో ఈ మేరకు రెండు పార్టీలు నిర్ణయానికొచ్చాయి. దీని ప్రకారం ఏ స్థానంలోనూ రెండు పార్టీల అభ్యర్థులు పరస్పరం పోటీకి దిగబోరు. సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, సీపీఐ సీనియర్ నాయకులు చాడ వెంకటరెడ్డి, సయ్యద్ అజీజ్ పాషా, రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, ఈటీ నరసింహ, సీపీఎం రాష్ట్ర నాయకులు ఎస్.వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, జి.నాగయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, వీఎస్ బోస్ పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా సర్పంచ్, వార్డు సభ్యులకు సంబంధించి రెండు పార్టీలు పరస్పర అవగాహనతో వ్యవహరించాలని, ఒకరిపై ఒకరు పోటీ చేయకూడదని నిర్ణయించారు. ఈ మేరకు రెండు పార్టీలు ఉమ్మడి ప్రకటన విడుదల

- మిగతా 2 లో

జర్మనీ ప్రతినిధులతో భట్టి విక్రమార్క భేటీ

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రజా భవన్‌లో జర్మనీ ప్రతినిధులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ దేశాల రాజకీయ పార్టీలను ఒకచోట చేర్చి పురోగమన ఆలోచనా దిశలో నడిపించే మీ కృషిని తామెంతో అభినందిస్తున్నామని జర్మన్ డెలిగేట్లను ఉద్దేశించి అన్నారు. అభివృద్ధిచెందిన దేశాల్లోనూ, అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనూ రైట్‌వింగ్ భావజాల వ్యాప్తి వల్ల ప్రమాదం పొంచి ఉందని చెప్పారు. స్వేచ్ఛ-న్యాయం- ఐక్యత సిద్ధాంతాలతో నడిచే సోషియల్

- మిగతా 2 లో

5లోగా కోర్టుకు రావాలి

హైడ్రా కమిషనర్‌కు హైకోర్టు అల్టిమేటం

విశాలాంధ్ర-హైదరాబాద్: హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. బతుకమ్మకుంట వివాదంలో డిసెంబర్ 5వ తేదీ లోపు కోర్టు ఎదుట స్వయంగా హాజరు కావాలని రంగనాథ్‌ను ఆదేశించింది. లేకుంటే నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తామని హెచ్చరించింది. బతుకమ్మకుంట బతుకమ్మకుంటలోని ప్రైవేట్ స్థలంపై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ ప్రైవేట్ స్థలంలో ఎటువంటి మార్పులు చేర్పులు చేయవద్దంటూ ఈ ఏడాది జూన్12వ తేదీన కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ

- మిగతా 2 లో

ఓటీటీలలో ఆధార్ ద్వారా వయస్సు ధృవీకరణ: సుప్రీం

న్యూఢిల్లీ: ప్రస్తుతం ఓటీటీలు విరివిగా అందుబాటులోకి వచ్చాయి. పెద్దా, చిన్నా తేడా లేకుండా అందరూ ఇళ్లలో కూర్చుని ఓటీటీల్లో సినిమాలు, వెబ్ సిరీస్‌లు చూస్తున్నారు. అయితే సాధారణ సినిమాలు, షోలతో పోల్చుకుంటే ఓటీటీల్లో అశ్లీల కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. చిన్న పిల్లలు, కుటుంబ సభ్యులతో వాటిని చూడడం ఇబ్బంది కరం. ఈ విషయంలో సుప్రీంకోర్టు తాజాగా స్పందించింది. ఓటీటీల్లో అశ్లీల కంటెంట్‌ను యాక్సెస్ చేయడానికి ఆధార్ ద్వారా వయస్సు ధృవీకరణను అమలు చేయవచ్చని సుప్రీంకోర్టు గురువారం సూచించింది. భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తి జోయ్‌మల్యా బాగ్చి నేతృత్వంలోని ధర్మాసనం అశ్లీల కంటెంట్ విషయంలో కొన్ని సూచనలు చేసింది. 'పుస్తకం, పెయింటింగ్ మొదలైన వాటిలో అశ్లీలత ఉండవచ్చు. ఆ విషయాన్ని ముందుగానే చెబుతారు. కానీ, మీరు ఫోన్ ఆన్ చేసిన వెంటనే మీరు కోరుకోనిది, అశ్లీలమైనది ఏదైనా వస్తే... అప్పుడు ఏమి చేయాలి' అని ధర్మాసనం ప్రశ్నించింది. ఓటీటీ షోల ప్రారంభంలో సాధారణ హెచ్చరికలు ఉన్నప్పటికీ, అదనపు చర్యగా వయస్సు ధృవీకరణ కూడా చేయవచ్చని సీజేఐ సూర్యకాంత్ పేర్కొన్నారు. హాస్యనటుడు సమయ్ రైనా యూట్యూబ్ షో 'ఇండియాస్ గాట్ టాలెంట్'లో సెక్స్ గురించి చేసిన వ్యాఖ్యలకు సంబంధించి దాఖలైన కొన్ని పిటిషన్లను కోర్టు విచారించింది. ఆన్‌లైన్ కంటెంట్‌ను నియంత్రించాల్సిన అవసరాన్ని సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది. ఏది అనుమతించవచ్చో, ఏది

- మిగతా 2 లో

యువశక్తి నైపుణ్యానికి 'స్కైరూట్' ప్రతీక

▸ ప్రధాని మోదీ

▸ హైదరాబాద్‌లో అతిపెద్ద రాకెట్ తయారీ ఫ్యాక్టరీ ప్రారంభం

విశాలాంధ్ర-హైదరాబాద్: శంషాబాద్‌లో ఏర్పాటు చేసిన భారతదేశంలోని అతిపెద్ద స్కైరూట్ ఇన్ఫినిటీ క్యాంపస్(ప్రైవేట్ రాకెట్ ఫ్యాక్టరీ)ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం దేశంలోనే తొలి ప్రైవేట్ కమర్షియల్ రాకెట్ విక్రమ్-1ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రధాని మోదీ... స్కైరూట్ క్యాంపస్ ప్రారంభోత్సవం యువత శక్తికి నిదర్శనం అని అన్నారు. గ్లోబల్ శాటిలైట్ వ్యవస్థలో భారత్ లీడర్ గా మారనుందన్నారు. స్కైరూట్ లాంచింగ్ తో యువతో నమ్మకం పెరుగుతుందన్నారు. అంతరిక్ష రంగంలో ఇదో మైలు రాయి అని తెలిపారు. భారత్ అంతరిక్ష రంగంలో మరిన్న ఘనతలు సాధిస్తుందన్నారు. భారతీయ స్పేస్ సెక్టార్లో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చామన్నారు మోదీ. సైకిల్ పై

- మిగతా 2 లో



దూసుకొస్తున్న 'దిత్వా'

▸ రేపటి నుంచి దక్షిణ కోస్తా, సీమ జిల్లాల్లో వర్షాలు

▸ అధికార యంత్రాంగం అప్రమత్తం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వరుస తుపాన్లు రాష్ట్రాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. శీతాకాల మొచ్చినా వర్షాలు వీడడం లేదు. ముఖ్యంగా అకాల వర్షాలు, తుపాన్లు రైతాంగానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మొంథా తుపాను నష్టం నుంచి ఇంకా కోలుకోకముందే మరో తుపాను ముంచుకొస్తోంది. నైరుతి బంగాళాఖాతం ఆనుకుని ఉన్న శ్రీలంక తీరంలో ఏర్పడిన వాయు గుండం బలపడి తుపానుగా మారింది. దీనికి దిత్వాగా పేరుపెట్టారు. గడిచిన 6 గంటల్లో 15 కి.మీ వేగంతో కదిలిన తుపాను ప్రస్తుతం ట్రింకోమలీ (శ్రీలంక)కి 200 కి.మీ, పుదుచ్చేరికి 610 కి.మీ, చెన్నైకి ఆగ్నేయంగా 700 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని ఈదురు గాలులు.. భారీ వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. రానున్న 48 గంటల్లో వాయుగుండం నైరుతి బంగాళా ఖాతం తమిళనాడు

- మిగతా 2 లో

దుష్ప్రచారం ఆపండి

ఇండస్ట్రియల్ ల్యాండ్ పాలసీలో అవినీతికి తావు లేదు

ప్రభుత్వానికి రాబడి వచ్చే అవకాశాలు పుష్కలం

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రభుత్వం ఏ మంచి పని చేసినా... ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా ప్రతిపక్ష పార్టీలు రాద్ధాంతం చేస్తూ బురద చల్లేందుకు ప్రయత్నిస్తున్నాయని రాష్ట్ర నీటి పారుద, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గాంధీభవన్ లో గురువారం మంత్రులతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజాసమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. అనేక ఫిర్యాదులపై ఆయన అధికారులతో మాట్లాడారు. అనంతరం గాంధీ భవన్ లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ... ఇండస్ట్రియల్ ల్యాండ్ పాలసీపై అసత్య ప్రచారం చేస్తున్నారని, హైదరాబాద్ నగరాన్ని కాలుష్యరహితం చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ఈ పాలసీలో ఎలాంటి అవినీతికి ఆస్కారమే లేదని, అత్యంత పారదర్శక విధానం అని చెప్పారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులకు మేం తెచ్చిన పాలసీ అర్థం కాలేదని... వారు పాలసీని పూర్తిగా అర్థం చేసుకుంటే బాగుంటుందన్నారు. ప్రతిపక్షాలు కావాలనే ప్రభుత్వంపై బురద చల్లుతున్నాయని, అవినీతి జరగలేదని వారికి కూడా తెలిసినప్పటికీ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులతో ప్రజల్లో స్పందన వస్తుండడంతో తట్టుకోలేక ఇలా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహితంగా మార్చేందుకు పరిశ్రమలను ఓఆర్ ఆర్ బయటకి పంపాలన్న డిమాండ్ ఎప్పటినుండో ఉందన్నారు. ఇది మేం కొత్తగా తెచ్చిన పాలసీ కాదు, గతంలో కూడా ఈ పాలసీ ఉందని తెలిపారు. తామే కొత్తగా పాలసీ తెచ్చినట్లు ప్రతిపక్ష పార్టీలు గొడవ చేస్తున్నాయని

- మిగతా 2 లో

కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్‌లకు నోటిఫికేషన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో మూడు జిల్లాలతోపాటు ఐదు రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేయాలని చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు సంబంధించిన నోటిఫికేషన్లను ప్రభుత్వం గురువారం జారీ చేసింది. కొత్తగా మూడు జిల్లాల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు మంగళవారం ఆమోదం తెలిపారు. మార్కాపురం, మదనపల్లి, రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీంతో రాష్ట్రంలో జిల్లాల సంఖ్య 26 నుంచి 29కి పెరిగింది. కొత్తగా ఐదు రెవెన్యూ డివిజన్లు, ఒక మండలం ఏర్పాటు చేయాలని చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. అనకాపల్లి

- మిగతా 2 లో

ఇదీ లోకం!

రాజ్యాంగ దినోత్సవంలో ఎన్నో చెపుతాం అవన్నీ నిజమనుకుంటే ఎలా? నేను చెప్పిందే రాజ్యాంగం!

సెస్సు, టోల్‌తో ప్రజల జేబులకు చిల్లు

▸ రహదారుల పేరిట కూటమి సర్కారు భారం

▸ ఆర్టీసీ భూముల ప్రైవేట్‌కు ధారాదత్తమా?

▸ ఓడ రేవుల కార్గో, రిజిస్ట్రేషన్ చార్జీలతో వడ్డన

▸ ప్రభుత్వ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలి

▸ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో 1500 కిలోమీటర్ల రహదారుల అభివృద్ధి, పునర్నిర్మాణం కోసం ప్రజల జేబులకు చిల్లులు పెట్టి, జనంపై తీవ్ర భారాలు మోపేలా సెస్సులు వేసి, టోల్ గేట్లు ఏర్పాటు చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను తక్షణమే వెనక్కి తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వచ్చే 19 ఏళ్ల వ్యవధిలో రూ.22,826 కోట్లు ఖర్చు అంచనాతో, ఏపీలోని 1,500 కిలోమీటర్ల మేర రహదారులను అభివృద్ధి చేసేందుకు హైబ్రిడ్ పద్ధతిలో పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసిందని తెలిపారు. ఈ రహదారుల నిర్మాణం పూర్తి చేసి మూడేళ్లలో అందుబాటులోకి తీసుకువస్తామని ప్రభుత్వం చెబుతోందని వివరించారు. ఈ ప్రాజెక్టులో తొలి ఏడాది 600 కిలోమీటర్లు, రెండో ఏడాది 600 కిలోమీటర్లు, మూడో ఏడాది 300 కిలోమీటర్ల చొప్పున రహదారులను

- మిగతా 2 లో

అమరావతికి 'ఆర్థిక' కళ

రాజధానికి జాతీయ, ప్రైవేటు బ్యాంకులు

రూ.1,328 కోట్ల పెట్టుబడులు... 6,541 ఉద్యోగాలు

నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా శంకుస్థాపన

విశాలాంధ్ర-సచివాలయం: రాజధాని అంటేనే పాలనా సౌలభ్యం కోసం ఏర్పాటు చేసే కేంద్రం. అన్ని రకాల కార్యాలయాలు ఒక చోటే అందుబాటులోకి వస్తే పాలన మరింత సరళతరంగా అందుతుంది. రాజధాని అమరావతిలో ఆర్థిక కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా తీర్చిదిద్దే కార్యాచరణలో భాగంగా శుక్రవారం రాజధానిలోని సీఆర్డీఏ కార్యాలయం వద్ద 15 బ్యాంకుల ప్రధాన కార్యాలయాలకు శంకుస్థాపన జరగనుంది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమక్షంలో బ్యాంకుల కార్యాలయాల నిర్మాణ పనులకు

- మిగతా 2 లో

ప్రకృతి విలయం

- ముంచెత్తిన వర్షాలు, వరదలు
- విరిగిపడ్డ కొండచరియలు
- శ్రీలంకలో 31 మంది... ఇండోనేషియాలో 49 మంది మృతి
- సుమత్రా దీవుల్లో 6.6 తీవ్రతో భూకంపం

కొలంబో/జకార్త: ప్రకృతి విలయం కొనసాగుతోంది. నిత్యం ప్రపంచ దేశాలు విపత్తులను ఎదుర్కొంటున్నాయి. తాజాగా వర్షాలు, వరదలతో శ్రీలంక, ఇండోనేసియా అతలాకుతలమయ్యాయి. శ్రీలంకలో గురువారం కొండచరియలు విరిగిపడి 31 మంది చనిపోయారు. ఇండోనేసియాలోని సుమత్రా దీవుల్లో మెరుపు వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో 49 మంది ప్రాణాలు కోల్పోయారు. 67 మంది జాడ లేరు. అదే విధంగా ఉదయం 11.56 గంటలకు 6.6 తీవ్రతతో భూకంపం సంభవించింది. సుమత్రా దీవిని వణించింది. సునామీ ముప్పు లేదని సునామీ హెచ్చరికల కేంద్రం పేర్కొంది. భూమికి 10కిమీల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. కాగా, వర్షాలు, మెరుపు వరదలతో నదులు ఉప్పొంగి ప్రవహించగా, శిథిలాల కింద నుంచి మృతదేహాలను వెలికితీశారు. ఉత్తర సుమత్రా, దాని చుట్టుపక్కల ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. రెండు వేలకుపైగా ఇళ్లు నీట మునిగాయి. ఐదు వేల మందికి ప్రభుత్వ పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్నారు. దక్షిణ తపనులీ జిల్లాలో 17 మృతదేహాలు లభ్యం కాగా, సిబోగ్గా నగరంలో ఎనిమిది మృతదేహాలను వెలికి తీసినట్లు పోలీసు అధికారి ఫెర్రీ వలింటుకన్ పేర్కొన్నారు. సెంట్రల్ తపనులీలో కొండ చరియలు విరిగిపడి కొన్ని ఇళ్లు శిథిలం కాగా నలుగురితో కూడిన కుటుంబం సజీవ సమాధి అయింది. అదే విధంగా శ్రీలంకను ప్రతికూల వాతావరణ పరిస్థితులు తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి. గత 11 రోజుల్లో దాదాపు నాలుగు వేల మంది ప్రభావితమయ్యారు. కొండచరియలు విరిగిపడి సెంట్రల్ హిల్ జిల్లాల్లో తాజాగా 18 మంది మరణించినట్లు శ్రీలంక విపత్తుల నిర్వహణ కేంద్రం వెల్లడించింది. ఓ బస్సు కుంబుక్కన వద్ద వరద నీటిలో చిక్కుకుపోగా అత్యవసర బృందాలు రంగంలోకి దిగి 33 మంది ప్రయాణికులను కాపాడారు. మరో 14 మంది ఆచూకీ లేదరని, 10 మందికి గాయాలయ్యాయని అధికారులు తెలిపారు. అధ్యక్షుడు దిస్సానాయకే ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తున్నారు. 25 జిల్లాలో 17 జిల్లాలలో పరిస్థితి క్షీణించినట్లు అధికారులు వెల్లడించారు. సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం రాగల 12 గంటల్లో వాయుగుండంగా మారుతోందని, దీని ప్రభావంతో 200 మిల్లీమీటర్ల మేర భారీ వర్షాలు నమోదు కావచ్చని వాతావరణ శాఖ హెచ్చరించింది.

వాషింగ్టన్‌లో కాల్పులు... ఉగ్రవాద చర్య: ట్రంప్

అఫ్గాన్ల ఇమ్మిగ్రేషన్ దరఖాస్తుల రద్దు

వాషింగ్టన్: అమెరికాలో శ్వేతసౌధం సమీపంలో కాల్పులు జరిగాయి. ఈ ఘటనను ఉగ్రవాద చర్యగా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. మాజీ అధ్యక్షుడు జో బైడెన్‌ను నిందిస్తూ పరోక్ష వ్యాఖ్యలు చేశారు. 'ఇది మానవత్వానికి వ్యతిరేకంగా జరిగిన దాడి. తీవ్రంగా ఖండిస్తున్నాం. నిందితుడు అత్యంత ప్రమాదకర అఫ్గానిస్థాన్‌కు చెందినవాడు. జో బైడెన్ హయాంలో అమెరికా వచ్చాడు. అప్పుడు వచ్చిన అఫ్గాన్లు అందరినీ విచారించాలి' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. శరణార్థులు తమ మనుగడకే ప్రమాదకరమని ప్రకటించారు. వాషింగ్టన్‌లో మరో 500 మంది నేషనల్ గార్డ్ దళాలను మోహరించాలని ఆదేశాలిచ్చారు. కాల్పులు జరిపిన వ్యక్తిని అఫ్గాన్‌కు చెందిన రెహమానుల్లా లఖన్‌వాల్‌గా లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గుర్తించారు. అతడు 2021లో అఫ్గాన్‌లకు ఇచ్చిన ప్రత్యేక వీసాపై అమెరికాకు వచ్చినట్లు తెలిపారు. గాయపడిన అతనిని ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. ఈ దాడి అతని ఒక్కడి పనేనని తేల్చారు. ఇదిలావుంటే, అఫ్గాన్ శరణార్థులందరిపై ట్రంప్ అనుమానం కత్తి వేలాడదీసిన క్రమంలో అఫ్గాన్ల ఇమిగ్రేషన్ దరఖాస్తులను తక్షణమే నిలివేస్తూ యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ ఆదేశాలిచ్చింది. తమ దేశం, పౌరుల భద్రతకు తొలి ప్రాధాన్యతిస్తామని, అఫ్గాన్ల దరఖాస్తులను ఇప్పటికిప్పుడే నిలిపివేస్తున్నామని ప్రకటించింది.

వందే మాతరం, జై హింద్ నినాదాలొద్దు

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిపక్షాలు దుయ్యబట్టాయి. దేశానికి స్వాతంత్ర్యం కోసం ఏ త్యాగం చేయని బీజేపీకి వీటి విలువ ఏం తెలుస్తుందని కాంగ్రెస్ ఎద్దేవా చేసింది. జై హింద్, వందేమాతరం స్వాతంత్ర్య పోరాట నినాదాలని, వాటిని సభలో ఎందుకు చేయకూడదని తృణమూల్ కాంగ్రెస్ నిలదీసింది. జై హింద్ నినాదం నేతాజీ ఇచ్చారని టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ గుర్తుచేశారు. ఈ నినాదాలను వ్యతిరేకిస్తే పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. స్వాతంత్ర్య పోరాటానికి ఆధారమైన ఈ నినాదాలను ఎలా మర్చిపోతాం? బెంగాల్ గుర్తింపును తుడిచిపెట్టే ప్రయత్నమా? అంటూ బెంగాల్ సీఎం మండిపడ్డారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనతే స్పందిస్తూ నాడు బ్రిటిష్‌వాళ్లకు ఈ నినాదాలు గిట్టలేదు... ఇప్పుడు బీజేపీకీ ఇవి ఇబ్బందికరంగా మారాయా అని ప్రశ్నించారు. స్వాతంత్ర్య పోరాటంలో ప్రాచుర్యం పొందిన రెండు నినాదాలు ఇవ్వడానికి ఇబ్బంది పడుతున్న వీరు... అసలు ఎలాంటి వారంటూ ఓ వీడియోలో నిందించారు. 'జై హింద్ అంటే హిందుస్థాన్ విజయమని అర్థం. భారత్ ఎప్పుడు విజేతగానే ఉండాలి. ఇది చాలా శక్తిమంతమైన నినాదం. ప్రతి భారతీయుడి గుండెలో ధ్వనిస్తుంది' అని శ్రీనతే అన్నారు. కాగా, ఇలాంటి ఆదేశాలు ఇవ్వడం మొదటిసారి జరగలేదని, యూపీఏ హయాంలోనూ 2005 నవంబరులో ఇలాంటి సర్క్యులర్ జారీ అయిందని రాజ్యసభ సెక్రటేరియట్ వర్గాలు పేర్కొన్నాయి. పార్లమెంటు మర్యాద, హుందాతనాన్ని కాపాడటం కోసం ఇది సరైన నిర్ణయమేనని సమర్థించుకున్నాయి.

జనవరి 18న సీపీఐ శత వసంతాల సభ

(మొదటిపేజీ తరువాయి)

చేయాలని, అదే సమయంలో సీపీఐ, సీపీఎం పరస్పర పోటీని నివారించాలని నిర్ణయించినట్లు కూనంనేని వెల్లడించారు. సీపీఐ శ్రేణులు గ్రామపంచాయతీ ఎన్నికలలో ఉత్సాహంగా పాల్గొని సాధ్యమైనన్ని ఎక్కువ సీట్లు గెలవాలని కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. హిడ్మా ఎన్‌కౌంటర్‌కు వ్యతిరేకంగా దిల్లీలో ఆందోళన జరిపిన విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం ఉపా చట్టం కింద కేసులు పెట్టడం దుర్మార్గ చర్య అని కూనంనేని ఖండించారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది హిడ్మా ఎన్‌కౌంటర్‌ను వ్యతిరేకించారని, ఇలాంటి నల్ల చట్టాలు ప్రయోగించి ఎంత మందిని జైల్లో పెడతారని కూనంనేని ప్రశ్నించారు. ఉపా చట్టం కింద విద్యార్థులపై పెట్టిన కేసుల్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఓటీటీలలో ఆధార్ ద్వారా వయస్సు ధృవీకరణ

(మొదటిపేజీ తరువాయి)

అనుమతించకూడదో నిర్ణయించడానికి స్వయంప్రతిపత్తి సంస్థ అవసరమని కూడా పేర్కొంది. సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేసే కంటెంట్‌పై ఎవరో ఒకరు జవాబుదారీగా ఉండాల్సిన అవసరం ఉందని అత్యున్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. వ్యక్తులు సొంతంగా ఛానళ్లు ప్రారంభించి... ఆ తర్వాత బాధ్యతారాహిత్యంగా ఉండటం వింతగా ఉందని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదిస్తూ 'ఇది కేవలం అశ్లీలతకు సంబంధించిన అంశమే కాదు. సామాజిక మాధ్యమాల్లో యూజర్లు జనరేట్ చేస్తోన్న కంటెంట్‌లోని లోపాలు ఎత్తిచూపుతోంది. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ అనేది ఓ అమూల్యమైన హక్కు. అయితే దాన్ని వక్రీకరించడం సరికాదు' అని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. 'దేశ వ్యతిరేక కంటెంట్ ఉన్నప్పుడు... క్రియేటర్ దానికి బాధ్యత వహిస్తారా? ఇలాంటి సందర్భాల్లో ప్రతిస్పందించేందుకు సమయం ఉండట్లేదు. అసభ్యకర కంటెంట్‌ను అప్‌లోడ్ చేసినప్పుడు అధికారులు చర్యలు తీసుకునేలోపే అది వైరల్‌గా మారుతుంది. లక్షల మంది దాన్ని వీక్షిస్తున్నారు. అలాంటప్పుడు దీన్ని ఎలా నియంత్రిస్తారు' అని ధర్మాసనం ప్రశ్నించింది.

సెస్సు, టోల్‌తో ప్రజల జేబులకు చిల్లు

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిపాదించింది. ఇందులో రూ.4 వేల కోట్ల వరకు ప్రభుత్వం భరించగా, మిగిలిన 60 శాతం రూ.7,761 కోట్ల ఖర్చును కాంట్రాక్టు సంస్థ భరిస్తూ, ఆ ఖర్చును ప్రభుత్వం ఏటా దశల వారీగా వడ్డీతో కలిపి 16 సంవత్సరాలలో చెల్లించేందుకు ప్రతిపాదనలు చేసిందని వివరించారు. 'హైబ్రిడ్' రహదారి ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు ప్రభుత్వం వెచ్చించే రూ.4 వేల కోట్ల నిధుల సమీకరణ కోసం ఆర్టీసీకి చెందిన భూములు, స్థిరాస్తులను లీజుకు ఇవ్వడంతో పాటు పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు ఒక రూపాయి చొప్పున సెస్సు విధించి ఏటా రూ.732 కోట్లు, ఖనిజాలు, గనుల నుంచి 10 శాతం సెస్సు వసూలు ద్వారా ఏటా రూ.441 కోట్లు, మోటార్ వెహికల్ ట్యాక్స్‌పై 10 శాతం సెస్సు ద్వారా ఏటా కనీసం 350 కోట్లు, ఓడ రేవులకు వచ్చే కార్గో పైన, రిజిస్ట్రేషన్ చార్జీలపై రోడ్డు సెస్సు విధించి తద్వారా ఈ ప్రాజెక్టుకు నిధులు రాబట్టేందుకు చూడడం దుర్మార్గమని విమర్శించారు. అంతేకాకుండా కాంట్రాక్టు సంస్థ రాష్ట్ర రహదారులపై టోల్‌గేట్లు ఏర్పాటు చేసి ఏటా సుమారు రూ.375 కోట్లకు పైగా టోల్ వసూలు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించనుందని తెలిపారు. గతంలో వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర రహదారులపై టోల్‌గేట్లు ఏర్పాటు చేసి టోల్ వసూలు చేయాలనే ప్రతిపాదనకు ప్రతిపక్ష పార్టీల నుంచి, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవగా ఆ ప్రభుత్వం వెనక్కి తగ్గిందని పేర్కొన్నారు. ఇదే ప్రతిపాదనను మరింత భారీ అంచనాతో ఇప్పుడు కూటమి ప్రభుత్వం మరోసారి తీసుకువస్తోందన్నారు. కేవలం 1500 కిలోమీటర్ల రహదారుల నిర్మాణం కోసం రూ.22 వేల కోట్లు వ్యయం చేయడం, ప్రజల నుంచి సెస్సు వసూలు, టోల్‌గేట్లు పెట్టడం వంటి ప్రతిపాదనలను ఈశ్వరయ్య తీవ్రంగా ఖండించారు. సీఎం చంద్రబాబు కార్పొరేట్, ప్రైవేటు శక్తులకు మేలు చేకూర్చేలా నేలవిడిచి సాముచేస్తూ వేల కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేసే చర్యలకు పాల్పడడం తగదన్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఇటీవలే రూ.82 వేల కోట్ల అంచనా వేసిన బనకచర్ల-పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అనుమతి రాకపోవడంతో వెనక్కి తగ్గిందని వివరించారు. పీపీపీ పద్ధతిలో వైద్య కళాశాలలను, పర్యాటక ఆస్తులను ప్రైవేటుకు అప్పగించేందుకు పావులు కదుపుతోందని పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రజలపై రూ.30 వేల కోట్లకు పైగా విద్యుత్ చార్జీల భారాలు మోపిన చంద్రబాబు సర్కార్ రహదారుల నిర్మాణం పేరుతో మరో రూ.22 వేల కోట్ల గుదిబండను మోపాలనుకోవడం సరికాదన్నారు. సీఎం చంద్రబాబుకు, కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్ర రహదారుల అభివృద్ధి కోసం చేపడుతున్న హైబ్రిడ్ ప్రాజెక్టు వలన ప్రజలపై భారం లేకుండా చూడాలన్నారు. సెస్సులు పెంచడం, టోల్‌గేట్లు ఏర్పాటు చేసి టోల్‌టాక్సులు విధించడం వంటి చర్యలను విరమించుకోవాలని కోరారు. ప్రభుత్వ, ప్రజా ఆస్తులను, భూములను ప్రభుత్వ ఆధీనంలో ప్రజోపయోగాల నిమిత్తం మాత్రమే వినియోగించాలేగాని లీజుల పేరుతో బడా పెట్టుబడి దారులకు అప్పనంగా అప్పగించాలన్న యోచనను ఉపసంహరించుకోవాలని ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ప్రజలపై భారాలు మోపడాన్ని విరమించుకోకపోతే ఉద్యమించక తప్పదని హెచ్చరించారు.

జర్మనీ ప్రతినిధులతో భట్టి విక్రమార్క భేటీ

(మూడోపేజీ తరువాయి)

డెమోక్రటిక్ పార్టీ స్వతంత్ర సంస్థలా పని చేస్తూ ప్రపంచంలోని వివిధ రాజకీయపార్టీలతో కలిసి ప్రోగ్రెసివ్ ఆలోచన ముందుకు తీసుకెళ్లడం అభినందనీయమన్నారు. లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రోగ్రెసివ్ భావజాల వ్యాప్తికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, మల్లు రవి, బలరామ్ నాయక్, సురేష్ షెట్కార్, జర్మనీకి చెందిన ఫ్రెడ్రిచ్ ఈబర్ట్ స్టిఫ్టింగ్ సంస్థకు చెందిన ప్రతినిధులు డాక్టర్ సబీనా, మిక్రో గ్యాంథర్, క్రిస్టోఫస్, మాండ్వి కులక్షేత్ర, అనురాగ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

5లోగా కోర్టుకు రావాలి

(మూడోపేజీ తరువాయి)

ఉత్తర్వులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఉల్లంఘించారంటూ ఎడ్ల సుధాకర్ రెడ్డి అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ ప్రైవేట్ స్థలంలో ఎటువంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. అంతేకాకుండా వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలంటూ రంగనాథ్‌ను ఆదేశించింది. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ జరిగింది. కానీ కోర్టుకు హైడ్రా కమిషనర్ హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో హైకోర్టు తాజా ఉత్తర్వులు జారీ చేసింది.

నేపాల్‌లో మళ్లీ జెన్‌జీ ఆందోళన

ఖాట్మండు: జెన్ జీ ఆందోళనలు నేపాల్‌లో ఆగడం లేదు. మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలి పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడి మహేశ్ బాస్నెట్‌కు వ్యతిరేకంగా తాజా ఆందోళన జరిగింది. ఈ క్రమంలో సీపీఎన్-యూఎంఎల్ కార్యకర్తలకు, జెన్‌జీ ఆందోళనకారులకు మధ్య ఘర్షణ చోటుచేసుకున్నది. కొందరు నిరసనకారులకు గాయాలయ్యాయి. ధంగధి విమానాశ్రయానికి బాస్నెట్ చేరుకున్న సమయంలో 'ఓలీ వర్గీయులు తిరిగి వెళ్లిపోండి' అంటూ జెన్‌జీ నినాదాలతో ఉద్రిక్తత నెలకొనగా, తాము వెంటనే జోక్యం చేసుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చామని పోలీసులు చెప్పారు. సెప్టెంబరు 8న జెన్ జీ ఆందోళనలు-హింస నేపథ్యంలో ఓలి ప్రభుత్వం గద్దె దిగాల్సి వచ్చింది. ఈనెల 19న బారా జిల్లాలో జెన్ జీ ఆందోళనలు జరిగిన విషయం విదితమే.

గీత దాటొద్దు: జపాన్‌కు చైనా హెచ్చరిక

బీజింగ్: తైవాన్ విషయంలో గీత దాటితే జపాన్ భారీ మూల్యాన్ని చెల్లించుకోవల్సి వస్తుందని చైనా హెచ్చరించింది. తైవాన్ తీరానికి 100 కిమీల దూరంలో ద్వీపంపై క్షిపణుల మోహరింపునకు జపాన్ యోచిస్తుండ టంతో చైనా రక్షణ శాఖ గురువారం ఈ విధంగా స్పందించింది. తైవాన్‌పై చైనా దాడి చేస్తే టోక్యో సైన్యం బదులిస్తుందని జపాన్ ప్రధాని సనే తకైచీ ఇటీవల వ్యాఖ్యానించారు. రెండు దేశాల మధ్య దౌత్య సంక్షోభం దృష్ట్యా ఈ పరిణామానికి ప్రాధాన్యత ఏర్పడింది. తైవాన్ కంటే అనేక రెట్లు అధికంగా చైనా రక్షణ వ్యయం ఉంటుందని తైవాన్ మెయిన్ ల్యాండ్ అఫైర్స్ కౌన్సిల్ అధికార ప్రతినిధి లియాంగ్ వెన్‌చీ అన్నారు. క్రాస్-స్ట్రెయిట్ శాంతికి చైనా ప్రాధాన్యత ఇస్తే ఈ డబ్బును మెయిల్‌ల్యాండ్ ఆర్థిక పరిస్థితులు, ప్రజల జీవితాలను మెరుగు పర్చడం కోసం వినియోగించుకోవచ్చు న్నారు. తైవాన్ చుట్టూ సముద్ర జలాల్లో, గగనతలంలో చైనా సైన్యం తిరుగుతూనే ఉంటుందని చెప్పారు.

అమరావతికి 'ఆర్థిక' కళ

(మొదటిపేజీ తరువాయి)

శంకుస్థాపన చేయనున్నారు. ఇప్పటివరకు అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన కార్యాలయాల నిర్మాణం జరుగుతోంది. మరోవైపు కొన్ని విద్యాసంస్థలతో పాటు ప్రైవేటు సంస్థలకు కేటాయించిన స్థలాల్లో నిర్మాణాలు ప్రారంభం అయ్యాయి. అయితే ఇవేకాకుండా ప్రభుత్వ ఆర్థిక కార్యకలాపాలకు సంబంధించిన సంస్థల నిర్మాణాలు మొదలయితే గానీ అమరావతికి కొత్త రూపు రాదు. రాష్ట్ర ప్రభుత్వం దాదాపు 44 ఎకరాలను బ్యాంకింగ్ కార్యాలయాలకు కేటాయించింది. మరో రెండు సంవత్సరాల్లో ఈ కార్యాలయాల నిర్మాణం పూర్తి కానుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి 2.0 పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రధాని మోదీ చేతుల మీదుగా మే నెలలో పనులను పునః ప్రారంభించిన తర్వాత నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. గతంలో సగం వరకు నిర్మించి మధ్యలో నిలిచిపోయిన పనులు అన్నీ పూర్తయ్యాయి. సీఆర్డీఏ పరిపాలనా భవనం ఇప్పటికే ప్రారంభమైంది. మరోవైపు హోటళ్లు, విద్యా సంస్థల నిర్మాణ పనులు కొనసాగుతు న్నాయి. రోడ్లు, గ్రావిటీ కెనాల్స్, డ్రైనేజీల నిర్మాణ పనులు విరామం లేకుండా చేపడు తున్నారు. ఈ నేపథ్యంలోనే అమరావతిలో 15 జాతీయ, ప్రైవేటు బ్యాంకుల రాష్ట్ర కార్యాలయాలు నిర్మాణ పనులు ప్రారంభించేందుకు సిద్ధమయ్యాయి. 2014-19 మధ్య కాలంలోనే 12 జాతీయ బ్యాంకులకు రాజధాని అమరావతిలో భూములు కేటాయిం చారు. అమరావతిలోని ఉద్దండరాయునిపాలెం వద్ద బ్యాంకులు అన్నింటికి పక్కపక్కనే భూములిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మూడు రాజధానుల ప్రతిపాదన చేయడంతో జాతీయ బ్యాంకులు కూడా భూములను స్వాధీనం చేసుకోలేకపోయాయి. ఇక గత ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బ్యాంకులతో సంప్రదింపులు మళ్లీ మొదలయ్యాయి. దీంతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా అమరావతి నిర్మాణంపై శ్రద్ధ తీసుకోవడంతో జాతీయ బ్యాంకుల యాజమాన్యాలు అన్నీ ఒకేసారి శంకుస్థాపనకు నిర్ణయించాయి. రాజధాని ప్రాంతంలో బ్యాంకులు అన్నీ ఒకేచోట నిర్మించనుండటం వల్ల ప్రజలకు సౌలభ్యంగా ఉంటుందని అంటున్నారు. రాజధాని అమరావతిని ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రంగా అభివృద్ధి చేసే 'ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్' బృహత్ ప్రణాళికలో భాగంగా సీఆర్డీఏ అధ్వర్యంలో ఇప్పటికే ఈ బ్యాంకులకు అవసరమైన భూముల కేటాయింపు పూర్తయింది. రాజధాని అమరావతిలోని ఉద్దండరాయునిపాలెం, వెలగపూడి, రాయపూడి, లింగాయపాలెంలో ఈ బ్యాంకుల ప్రధాన కార్యాలయాలు కొలువుదీరనున్నాయి. మొత్తంగా ఈ 15 బ్యాంకుల ద్వారా రూ.1,328 కోట్ల పెట్టుబడులు తద్వారా 6,541 ఉద్యోగాల కల్పన రాజధాని అమరావతిలో జరగనుంది. ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ రూ.256 కోట్లు పెట్టుబడులు... 1,000 ఉద్యోగాలు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.40 కోట్లు... 300 ఉద్యోగాలు, ఏపీ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ (ఆప్కాబ్) రూ.200 కోట్లు... 400 ఉద్యోగాలు, బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.40 కోట్లు... 200 ఉద్యోగాలు, కెనరా బ్యాంక్ రూ.50 కోట్లు... 300 ఉద్యోగాలు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.300 కోట్లు... 2,000 ఉద్యోగాలు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.50 కోట్లు... 160 ఉద్యోగాలు, బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.60 కోట్లు... 300 ఉద్యోగాలు ఇండియన్ బ్యాంక్ రూ.40 కోట్లు... 105 ఉద్యోగాలు, నాబార్డ్ (నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్) రూ.90 కోట్లు... 160 ఉద్యోగాలు, పంజాబ్ నేషనల్ బ్యాంక్ రూ.15 కోట్లు... 150 ఉద్యోగాలు, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ రూ.4 కోట్లు... 65 ఉద్యోగాలు, ఐడీబీఐ బ్యాంక్ రూ.50 కోట్లు... 215 ఉద్యోగాలు, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) రూ.22 కోట్లు... 1,036 ఉద్యోగాలు, న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్ రూ.93 కోట్లు... 150 ఉద్యోగాలు రానున్నాయి.

బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదమే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

దిల్లీకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం అని వివరించాలని సూచించారు. బీసీల రిజర్వేషన్ కు సంబంధించి రాష్ట్రంలో ఎపిక్ సర్వే జరిగిందని, ఎంపిరికల్ డేటా ఆధారంగా అసెంబ్లీలో బీసీల రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టగా పార్టీలకతీతంగా ఏకగ్రీవంగా ఆమోదించారని, బిల్లు గవర్నర్ నుంచి కేంద్రానికి వెళ్లి అక్కడ పెండింగ్ లో ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు అనుకూలంగా పార్లమెంట్ సభ్యులందరూ పార్టీలకు అతీతంగా ఒక బృందంగా ఏర్పడి ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులను విజ్ఞప్తులు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారన్నారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఎంపీలు అడిగిన సమాచారం నిమిషాల్లో లేదా గంటల్లో అందించేందుకు దిల్లీలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశామని, ఎంపీలు వినియోగించుకోవాలని తెలిపారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో ప్రభుత్వ శాఖలు ఏ విధంగా పూర్తి సంసిద్ధంగా ఉంటాయో పార్లమెంటు సమావేశాల సందర్భంగా ప్రభుత్వ యంత్రాంగం పూర్తి సంసిద్ధంగా ఉండి సమాచారం అందించేందుకు ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా రాష్ట్ర ఎంపీలు రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్లమెంట్ లో ప్రశ్నించడం, కేంద్ర మంత్రులకు విజ్ఞప్తులు ఇవ్వాలనుకుంటే విషయాన్ని వివరిస్తే చాలు నిర్దేశిత ఫార్మాట్లో సమాచారాన్ని, విజ్ఞాపన పత్రాలను దిల్లీలోని రాష్ట్ర అధికారులు ఎంపీలకు అందిస్తారని వివరించారు. నీటిపారుదల శాఖ, విద్యుత్ శాఖ, జీఎస్టీ తదితర విషయాలకు సంబంధించి కేంద్ర నుంచి రాష్ట్రానికి రావలసిన నిధులు, పథకాలకు సంబంధించి గతంలో లేఖలు రాశామని, ఆలేఖలు దిల్లీలోని ప్రత్యేక విభాగంలో ఎంపీలకు అందుబాటులో ఉంటాయని, వాటి ఆధారంగా ఎంపీలు ఫాలోఅప్ చేసే అవకాశం ఉంటుందన్నారు. డిసెంబర్ 9 నాటికి ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సాధించిన విజయాలు వివరించడంతో పాటు తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు నిర్మాణానికి సంబంధించి 2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ చేయబోతున్నామన్నారు. దేశంలో, ప్రపంచంలో ప్రముఖులను దిగ్గజ కంపెనీలను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. 2047 కల్లా మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యసాధనకు అవసరమైన వనరులు, ప్రణాళిక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వద్ద సిద్ధంగా ఉన్నాయన్నారు.. ఈ కార్యక్రమం విజయవంతానికి కమిటీలు వేస్తున్నామని, కేంద్ర మంత్రులను, ఎంపీలందరినీ ఆహ్వానించాలని భావిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న ఎంపీలు పేర్లు ఇస్తే కమిటీలు సభ్యులుగా నమోదు చేస్తామని, దేశంలో, ప్రపంచంలో ప్రముఖ వ్యక్తులు, సంస్థలతో ఎంపీలు ఎవరికైనా పరిచయం ఉంటే వివరాలు ఇవ్వాలని సూచించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం వారిని గ్లోబల్ సమ్మిట్ కు ఆహ్వానిస్తామన్నారు. సమావేశంలో కేంద్రానికి సంబంధించిన 12 శాఖల ద్వారా 47 అంశాలను గుర్తించామని, వీటితోపాటు సెమీ కండక్టర్లకు సంబంధించిన అంశం సమావేశంలో చర్చకు వచ్చిందన్నారు.

దూసుకొస్తున్న 'దిత్వా'

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంతాల్లో తీరం దాటుతుందని అంచనా వేస్తున్నారు. దక్షిణ కోస్తా, రాయల సీమ జిల్లాలపై దీని ప్రభావం ఉంటుందని, ఆయా ప్రాంతాల్లో వచ్చే 24 గంటల్లో ఈదురుగాలులు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ అధికారులు వెల్లడించారు. దిత్వా ప్రభావంతో ఈనెల 29 నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. దీంతో అధికారయంత్రాగం అప్రమత్తమైంది. శనివారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, ప్రకాశం, అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఆదివారం నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, యానాంతో పాటు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, బాపట్ల, నంద్యాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ ప్రభావంతో ఇప్పటికే తీరం వెంబడి గంటకు 55 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తుండగా, శుక్రవారం నుంచి గరిష్టంగా 70 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. సముద్రం అలజడిగా మారనున్న నేపథ్యంలో ఆదివారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని వాతావరణ శాఖ హెచ్చరించింది.

షేక్ హసీనాకు 21 ఏళ్ల శిక్ష

(మొదటిపేజీ తరువాయి)

ఢాకా ప్రత్యేక జడ్జి కోర్టు-5 జైలుశిక్ష విధించింది. న్యాయ పరిధిని అతిక్రమిస్తూ దరఖాస్తు లేకుండానే షేక్ హసీనాకు ఈ ప్లాటు కేటాయించినట్లు జడ్జి మహమ్మద్ అబ్దుల్ అల్ మమూన్ తెలిపారు. ఒక్కో కేసులో ఏడేళ్ల లెక్కన ఆమెకు 21 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. షేక్ హసీనా కుటుంబంతో పాటు గృహ శాఖ మాజీ సహాయ మంత్రి షరీఫ్ అహ్మద్ సహా మరో 20 మంది నిందితులుగా ఉండగా, ఒక్కరు మినహా అందరికీ శిక్షలు పడ్డాయి. బంగ్లాదేశ్ అవినీతి నిరోధక శాఖ జనవరి 12-14 తేదీల్లో ఆరు కేసులకు సంబంధించి మార్చి 10న చార్జిషీట్లు దాఖలు చేసింది. మూడు కేసుల్లో తాజాగా తీర్పు వెలువడింది. పది రోజుల కిందట హసీనాకు ఐసీటీ మరణశిక్ష విధించిన నేపథ్యంలో తాజా తీర్పు సందర్భంగా ఢాకా కోర్టు కాంపెక్స్‌లో అధికారులు భద్రతను కట్టుదిట్టం చేశారు.

రెవెన్యూ డివిజన్‌లకు నోటిఫికేషన్

(మొదటిపేజీ తరువాయి)

జిల్లాలో నక్కపల్లి, ప్రకాశం జిల్లాలో అద్దంకి, కొత్తగా ఏర్పాటయ్యే మదనపల్లి జిల్లాలో పీలేరు, నంద్యాల జిల్లాలో బనగానపల్లె, శ్రీసత్యసాయి జిల్లాలో మడకశిర రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. కర్నూలు జిల్లా ఆదోని మండలాన్ని విభజించి కొత్తగా పెద్దహరివనం మండలాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం నోటిఫికేషన్లు జారీ చేసింది.

యువశక్తి నైపుణ్యానికి 'స్కైరూట్' ప్రతీక

(మూడోపేజీ తరువాయి)

నుంచి రాకెట్ తీసుకెళ్లే స్థాయి నుంచి ప్రస్థానం మొదలైందన్నారు. ప్రపంచంలో చిన్న చిన్న శాటిలైట్లకు డిమాండ్ పెరిగిందన్నారు. రాబోయే కాలంలో శాటిలైట్ ఎకానమీ భారీగా పెరుగుతుందన్నారు. ప్రపంచంలోని కొన్నిదేశాల్లోనే అంతరిక్ష పరిజ్ఞానం ఉందన్నారు . భారత శాటిలైట్లు తక్కువ ఖర్చుతో నమ్మదగినవిగా ఉన్నాయని చెప్పారు. సృజనాత్మకత భారత్ లోని జన్ జీ యువత సొంతమని తెలిపారు. జన్ జీ అనుకున్నది సాధించేలా ప్రభుత్వం సహకరిస్తుందని వివరించారు. వ్యవసాయం, వాతావరణ అంచనాల్లో మరింత విజ్ఞానం సాధించాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. భారత అంతరిక్ష రంగంలో ఎన్నో సంస్కరణలు అమలు చేస్తున్నామన్నారు. కో-ఆపరేటివ్, ఎకో సిస్టమ్‌ను తీసుకువచ్చామన్నారు. అంతరిక్ష రంగంలో ఇస్తున్న మద్దతు వల్లే స్టార్టప్‌లు వస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు. ఇలా ప్రైవేటు రంగంలోనూ అంతరిక్ష సంస్థలు పుట్టుకొస్తున్నాయని చెప్పారు. భారత యువతరం స్పష్టమైన లక్ష్యాలతో ముందుకు సాగుతోందని చెప్పారు. 2047లో చేపట్టే మూన్ మిషన్, గగన్‌యాన్‌కు అందరం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

దుష్ప్రచారం ఆపండి

(మూడోపేజీ తరువాయి)

విమర్శించారు.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కూడా ఈ పాలసీపై చర్చ జరిగిందని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వస్తే ఈ విధానాన్ని మారుస్తామని బీఆర్ఎస్ నేతలంటున్నారని... వాళ్లు అధికారంలోకి వచ్చేది లేదు. పాలసీ మార్చేది లేదని ఎద్దేవా చేశారు. ఇండస్ట్రియల్ పాలసీతో రాష్ట్రానికి అదనపు ఆదాయం వస్తుందని తెలిపారు. విద్యుత్ కేంద్రాల నిర్మాణంలో 50 వేల కోట్ల కుంభకోణం జరిగిందన్న బీఆర్ఎస్ ఆరోపణలో వాస్తవంలేదన్నారు. 50 వేల కోట్లు కాదు 50 వేల రూపాయల కుంభకోణం కూడా జరగలేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన భద్రాద్రి కొత్తగూడెం పవర్ ప్రాజెక్టు పెద్ద కుంభకోణం అని, గత ప్రభుత్వం ఇండియా బుల్ అనే కంపెనీ దగ్గర ఉపయోగంలో లేని పరికరాలు కొనుగోలు చేసి సబ్ క్రిటికల్ సాంకేతిక పరిజ్ఞానంతో ఈ కేంద్రాన్ని నిర్మించారని... ఇది ఎందుకు ఉపయోగించలేని పరిస్థితి ఉందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం విద్యుత్ ప్రాజెక్టుకు అవుట్ డేటెడ్ టెక్నాలజీ వాడాల్సిన అవసరం ఏముందని, భద్రాద్రి ప్రాజెక్టు అనవసరంగా తెలంగాణ ప్రజలపై రుద్దిన ప్రాజెక్టు అని మంత్రి ఉత్తమ్ దుయ్యబట్టారు.

అవగాహనతో ముందుకెళ్దాం

(మూడోపేజీ తరువాయి)

చేశాయి. ఖమ్మం జిల్లా సీపీఎం రాష్ట్ర నాయకులు సామినేని రామారావు హత్యకు గురై నెలరోజులు కావస్తున్నప్పటికీ పోలీసులు హంతకులను పట్టుకోకపోవడంపై సమావేశం నిరసన వ్యక్తం చేసింది. కేసు విషయంలో ఎలాంటి పురోగతి లేదని, వెంటనే కేసును వేగవంతంగా దర్యాప్తు చేయాలని, దోషులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సీపీఐ, సీపీఎం నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో-మహబూబాబాద్ : పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని జన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, బి అజయ్ సారధి రెడ్డి, సాదుల శ్రీనివాస్, గౌని ఐలయ్య అన్నారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు ఉద్యమ సమయంలో పెట్టిన అక్రమ కేసులో భాగంగా గురువారం సిపిఐ, కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నేతలు కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతనంగా వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ హయాంలో పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలన్నారు. బిజెపి ప్రభుత్వం బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ప్రారంభించేందుకు కృషి చేయకపోతే మరో ఉద్యమం తప్పదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే ,ఎంపీలు చొరవ చూపి జిల్లాలో ఉన్న కేసులన్నీ ఎత్తివేసే విధంగా కృషి చేయాలని తెలిపారు. కోర్టుకు హాజరైన వారిలో నల్లు సుధాకర్ రెడ్డి, పెరుగు కుమార్, సూర్నపు సోమయ్య ,గుణ గంటి రాజన్న ,పోతరాజు రాజు, ప్రసాద్ ,ఇరుగు మనోజ్ ,మధు ,సమ్మెట రాజమౌళి ,తండ మాధవి, పూసపాటి స్వరూప ,బానోత్ శ్రీనివాస్ ,రామచంద్రు, రవికుమార్, దిలీప్ ,నరేష్ ,భాస్కర్ ,శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

టీపోల్ మొబైల్ యాప్ వినియోగించుకోవాలి

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లకు సౌకర్యవంతంగా ఎన్నికల సమాచారాన్ని అందించేందుకు రూపొందించిన టీ పోల్ మొబైల్ యాప్ గూగుల్ ప్లే స్టోర్ లో అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టీ -పోల్ యాప్ ద్వారా ఓటర్లు పోలింగ్ కేంద్ర వివరాలు, ఓటర్ స్లిప్పు నమోదు సమాచారం సులభంగా తెలుసుకో గలుగుతారని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఓటరు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని వినియోగించుకోవాలని కోరారు. జిల్లాలో ఓటరు అవగాహన మరియు ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలలో తమ ఓటు హక్కు వినియాగించుకోవాలని అన్నారు. ఈ యాప్‌ను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు.

పంచాయతీలకు నామినేషన్లు ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో-మెదక్: జిల్లాలో మొదటి విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. మొదటి విడతలో ఆరు మండలాల్లో 160 పంచాయతీలలో సర్పంచ్, 1402 వార్డు స్థానాలకు నామినేషన్లు స్వీకరిస్తున్నారు. రేగోడ్, పెద్ద శంకరంపేట్, టేక్మాల్, పాపన్నపేట, హవేలి ఘనపూర్ మండల పరిషత్ కార్యాలయాల వద్ద నామినేషన్లు స్వీకరిస్తున్నారు. అన్ని ఏర్పాట్లు చేశారు. హవేలి ఘనపూర్, పాపన్నపేట్ ఎంపీపీ కార్యాలయాలలో నామినేషన్ ప్రక్రియను ఎన్నికల అబ్జర్వర్ భారతి లక్పతి నాయక్, కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి తప్పులు, పొరపాట్లు లేకుండా చూడాలన్నారు. నామినేషన్లు దాఖలుకు కావలసిన ధ్రువ పత్రాలను సమర్పించడం లాంటి విషయాలను అభ్యర్థులకు తెలియజేయాలని ఆమె సూచించారు. నామినేషన్ల ఫారాలను స్పష్టంగా చూసి వాటిల్లో ఏవైనా తప్పులు వుంటే సరిచేసుకునే విధంగా సహకరించాలని తెలిపారు.

పట్టపగలే ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా/ రామకృష్ణాపూర్: మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం క్యాతనపల్లి మునిసిపాలిటీ పరిధి రాజీవ్ చౌక్ దగ్గరలో ఏరియా ఆసుపత్రికి వెళ్లే దారిలో పెద్దమ్మ తల్లి వైన్స్ షాపు పక్కన, అమరవాదికి వెళ్లే దారిలో రోడ్డు పక్కన సర్వే నంబర్ 7 లో అక్రమ నిర్మాణాలను పట్టపగలే యథేచ్ఛగా చేపడుతున్నారు. రెవెన్యూ మున్సిపల్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవట్లేదు. ఈ నిర్మాణాల సూత్రధారులు అధికారులను సైతం లెక్కచేయకుండా కొందరి రాజకీయ నాయకుల అండదండలతో బెదిరింపులకు పాల్పడుతున్నారని వారిపై చర్యలు తీసుకోవడానికి అధికారులు సైతం వెనుకడుగు వేస్తున్నారంటూ ఈ కట్టడాలలో ఎవరి పాత్ర ఎంత ఉందో అని పట్టణ ప్రజలు బహుబాటంగానే చర్చించుకుంటున్నారు. మందమర్రి తహసిల్దార్ సతీష్ కుమార్ శర్మ ఇదివరకే ప్రభుత్వ స్థలాలలో ఎటువంటి అక్రమ కట్టడాలు చేపట్టరాదంటూ అలా చేపట్టిన వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అయినా బేఖాతరు చేస్తూ అంతా నా ఇష్టం, ఈ కట్టడాలను ఆపేదెవరు అనే విధంగా చక్కగా ఈ నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ కట్టడాలపై మందమరి తహసిల్దార్, స్థానిక మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

విశాలాంధ్ర-తొర్రూరు: 420 హామీలతో ప్రజలను మోసగించిన కాంగ్రెస్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో తగు రీతిలో గుణపాఠం చెప్పాలని మాజీ జెడ్పిటిసి మంగళపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశానుసారం మండలంలోని వెలికట్ట గ్రామంలో బుధవారం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తక్కలపల్లి దేవేందర్ రావు అధ్యక్షతన గురువారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. పార్టీ నాయకుల అభిప్రాయాల మేరకు మాజీ సర్పంచ్ బందు శ్రీనివాస్ ను బీఆర్ఎస్ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా ప్రకటించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ మాట్లాడుతూ.... ఆరు గ్యారంటీల పేరుతో అడ్డగోలు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. రాష్ట్ర ప్రజలను దారుణంగా మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పాలనలో గ్రామాలు అధ్వాన్నంగా మారాయన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు బత్తుల యాకయ్య, పోసాని రాములు,లింగారావు, బాలకృష్ణ,రాజారాం, కుమారస్వామి, బంధు రవి, కొమ్ము రాములు, కొమిరెల్లి,కరుణాకర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ వేసిన సునీత కొమ్మాలు

విశాలాంధ్ర-గూడూరు: మండల కేంద్రంలో కాంగ్రెస్ తరఫున వాంకుడోత్ కొమ్మాలు సతిమని వాంకుడోత్. సునీత గురువారం నామినేషన్ వేశారు. అంగడి ప్రాంగణం నుండి భారీగా జనాభాతో బ్యాండ్ మేళం, డీజే పాటలతో మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళి నాయక్ సారథ్యంలో భారీ ర్యాలీ చేపట్టారు.

నిబద్ధత గల కమ్యూనిస్టు.. పోటు ప్రసాద్

ఆశయాన్ని ఆచరణలో చూపిన మహోన్నతుడు
వర్ధంతి సభలో బాగం

విశాలాంధ్ర బ్యూరో-ఖమ్మం: నిబద్ధత గల కమ్యూనిస్టు పోటు ప్రసాద్ అని తుది శ్వాస వరకు పార్టీ విస్తరణ కోసం, పేదల అభ్యున్నతి కోసం కృషి చేశారని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలి పారు. ఆయన నమ్మిన సిద్ధాం తాన్ని ఆచరణలో చూపిన మహోన్నతుడు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ నాయకుడు, సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి పోటు ప్రసాద్ ప్రథమ వర్ధంతి సభ గురువారం సీపీఐ కార్యాలయంలో జరిగింది. ఎస్కె జానిమియా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హేమంతరావు. మాట్లాడుతూ సాయుధ పోరాట వారోత్స కుటుంబంలో జన్మించిన పోటు ప్రసాద్ తుదిశ్వాస వరకు అదే పంథాను కొనసాగించారన్నారు. విద్యార్థి దశలో విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం ముఖ్యంగా ఖమ్మంలో పిజి కళాశాల సాధన కోసం జరిగిన ఉద్యమంలో పోటు ప్రసాద్ క్రియా శీలక భూమిక పోషించారని ఆయన తెలిపారు. కార్మిక సంఘ నాయకునిగా పని చేసిన పోటు ప్రసాద్ సంఘటిత, అసంఘటిత రంగాలలో బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించారన్నారు. సుదీర్ఘ కాలం కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేసిన ప్రసాద్ ఎటువంటి విమర్శకు తావివ్వలేదని ఆయన తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శిగా జిల్లాలో పార్టీ శాఖల పునర్ నిర్మాణంపై దృష్టి సారించి సఫలీకృతుడయ్యారన్నారు. నాయనమ్మ యర్రమ్మ, తండ్రి రాఘవయ్య వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న పోటు ప్రసాద్ స్పష్టమైన రాజకీయ సైద్ధాంతిక అవగాహన కలిగి ఉండడంతో పాటు సిద్ధాంతాన్ని ప్రజల్లోకి తీసుకు పోవడం లోనూ ఆయన సఫలీకృతుడయ్యారని హేమంతరావు తెలిపారు. ఒక సంక్లిష్ట పరిస్థితుల్లో పోటు ప్రసాద్ వర్ధంతి సభను జరుపుకుంటున్నామని ఒక పక్క కమ్యూనిస్టు పార్టీ శత వసంత సంబురాలు ఖమ్మంలో జరగబోతున్నాయని ఈ సమయంలో పోటు ప్రసాద్ లేని లోటు అడుగడుగునా కనిపిస్తుందన్నారు. జాతీయ మహాసభలను ఖమ్మంలో నిర్వహించాలని తలపెట్టిన ఆలోచన పరుడు ప్రసాద్ అని అన్నారు. అభ్యుదయవాదిగా, నికార్సయిన కమ్యూనిస్టుగా జీవించిన ప్రసాద్ కమ్యూనిస్టు ఉద్యమం ఉన్నంత కాలం చిరస్థాయిగా నిలిచి ఉంటారని హేమంతరావు తెలిపారు. అంతకు ముందు పోటు ప్రసాద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వర్ధంతి సభలో రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఎపూరి లతాదేవి, సిద్ధినేని కర్ణకుమార్, బిజి క్లెమెంట్, మహ్మద్ సలాం, పోటు ప్రసాద్ తనయుడు సాత్విక్, సతీమణి నిర్మల, సోదరి పోటు కళావతి తదితరులు పాల్గొన్నారు..

40వ డివిజన్లో...: సీపీఐ నాయకుడు పోటు ప్రసాద్ ప్రథమ వర్ధంతి సభను 40వ డివిజన్లో ఘనంగా నిర్వహించారు. ఆయన స్మారక స్తూపం వద్ద పార్టీ పతాకాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆవిష్కరించారు. స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బిజి క్లైమెంట్ అధ్యక్షతన జరిగిన సభలో హేమంతరావు మాట్లాడుతూ 40వ డివిజన్లో పార్టీ శాఖ ఏర్పాటుకు పోటు ప్రసాద్ విశేష కృషి చేశారని ఆయన సమక్షంలో అనేక మంది సీపీఐలో చేరిన కొద్ది రోజులకే ప్రసాద్ మరణించడం అత్యంత బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, నగర కార్యదర్శి ఎస్కె జానిమియా, పోటు కళావతి, తోట రామాంజనేయులు, గాదె లక్ష్మి నారాయణ, పోటు పూర్ణ, వరదా నర్సింహా రావు, పోటు నిర్మల, పలువురు సిపిఐ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా నగర్ పైలాన్ వద్ద : ఇందిరా నగర్ పైలాన్ వద్ద పోటు ప్రసాద్ ప్రథమ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పోటు ప్రసాద్ స్మారక స్తూపానికి సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, పోటు ప్రసాద్ తనయుడు సాత్విక్ పోటు ప్రసాద్ స్మారక స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని సిపిఐ నాయకులు ప్రారంభించారు. వందలాది మంది ఈ కార్యక్రమంలో పాల్గొని పోటు ప్రసాద్కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, నాయకులు ఎస్కె జానిమియా, ఏపూరి లతాదేవి, పోటు కళావతి, పోటు నిర్మల. తాటి వెంకటేశ్వరరావు, పగడాల మల్లేష్, ఏనుగు గాంధీ, వరదా నర్సింహారావు, బండారుపల్లి నవీన్, సత్యనారాయణరెడ్డి, వెంకన్న, నాగేశ్వరరావు, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ, ఆముదాల వెంకన్న, జాకీర్, తాటి నిర్మల, అక్రమ్ తదితరులు పాల్గొన్నారు..

నామినేషన్ల ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా ఎన్నికల పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం

విశాలాంధ్ర బ్యూరో-నిర్మల్ జిల్లా: పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఎన్నికల జిల్లా పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం అధికారులను ఆదేశించారు. గురువారం లక్ష్మణ చందా మండలంలోని వడ్యాల్ పంచాయతీ కార్యాలయంలోని నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు ఇక్కడ ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. పరిశీలకులు మాట్లాడుతూ హెల్ప్ డెస్క్‌లో సిబ్బంది అందుబాటులో ఉంటూ, అభ్యర్థులకు సమాచారం ఇవ్వడంలో సహాయపడాలన్నారు. అధికారులు ఖచ్చితంగా సమయ పాలన పాటించాలని పేర్కొన్నారు. నామినేషన్ల ప్రక్రియ మొత్తం పారదర్శకంగా, ప్రశాంతంగా పూర్తి చేయాలని వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఎటువంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి అన్ని రకాల ఫారములను తగినన్ని అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. అన్ని రిజిస్టర్లను పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. రోజువారీగా నామినేషన్లకు సంబంధించి వివరాలన్నింటినీ తమకు అందజేయాలని వివరించారు. ప్రతిరోజు దాఖలు అయిన నామినేషన్ల పత్రాలను జాగ్రత్తగా భద్రపరచాలని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తి అయ్యేవరకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిపిఓ శ్రీనివాస్, తహసిల్దార్ సరిత, ఎంపీడీవో రాధా రాథోడ్, ఎన్నికల అధికారులు, సిబ్బంది, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

మీడియా సెంటర్ ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో-ఖమ్మం: స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా కలెక్టరేట్ మొదటి అంతస్తులోని ఎఫ్ 3 లో ఉన్న డిపిఆర్ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎం.సీ.ఎం.సీ)ను అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. జిల్లాలో ఎన్నికల సజావు నిర్వహణకు జిల్లా యంత్రాంగం తరపున కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు, ఎన్నికలు సక్రమంగా నిర్వహించడంలో పాత్రికేయులు తమ వంతు పాత్ర పోషించాలని, ఎతికల్ ఓటింగ్, ఓటు హక్కు ప్రాముఖ్యత గురించి ప్రజలకు వివరించాలని, ఎన్నికలకు సంబంధించి సరైన సమాచారం ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. మీడియా సెంటర్ ద్వారా పాత్రికేయులకు అవసరమైన సరైన సమాచారం సకాలంలో అందిస్తారని, ఎన్నికల సందర్భంగా ఎటువంటి ఊహాగానాలకు చెందిన వార్తలను వెరిఫై చేసుకోకుండా రాయవద్దని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో వీడియోలు వినియోగించాలంటే ముందుగా మీడియా సెంటర్ లోని ఎంసిఎంసీ కమిటీని సంప్రదించి అనుమతి తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో డిపిఆర్ఓ ఎం.ఏ. గౌస్, డిపిఓ ఆశాలత, అదనపు పిఆర్వో ఎండి. అయూబ్ ఖాన్, ఎంసిఎంసి కమిటీ సభ్యులు, కార్యాలయ టైపిస్ట్ ప్రవళిక, కంప్యూటర్ ఆపరేటర్లు నవీన్, హరీష్, సిబ్బంది చింతల శ్రీనివాస్ రావు, చావా నారాయణ, తాజుద్దీన్, మంగ, అధికారులుపాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణ చట్టం రావాలి: భాస్కర్

విశాలాంధ్ర బ్యూరో-మెదక్: రాష్ట్రంలో పనిచేస్తున్న 50 వేల మంది న్యాయవాదుల కోసం రక్షణ చట్టం అమలు చేయాలని సీనియర్ అడ్వకేట్, బార్ తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యునిగా పోటీలో ఉన్న రాపోలు భాస్కర్ డిమాండ్ చేశారు. గురువారం మెదక్ జిల్లా కోర్టులో న్యాయవాదులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ... రెండు సంవత్సరాలకు ఒకసారి జరగాల్సిన కౌన్సిల్ ఎన్నికలు గత ఏడున్నర సంవత్సరాలుగా జరగకపోవడం శోచనీయమన్నారు. 2026 జనవరి 31 లోగా ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశాలతో గత్యంతరంలేక ఎన్నికలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. 25 మంది కౌన్సిల్ సభ్యులు, అందులోనుండి చైర్మన్ ఎన్నుకున్నట్లయితే న్యాయవాదుల సంక్షేమం, దోహదపడుతుందన్నారు. రాష్ట్రంలో పనిచేస్తున్న న్యాయవాదులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో అడ్వకేట్లకు 25 కోట్ల రూపాయల ఇప్పించడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని జూనియర్ న్యాయవాదులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, వారి సంక్షేమం, ఆర్థిక భద్రత కోసం నెలకు 5 నుండి 10 వేల వరకు స్టైఫెండ్ ఇవ్వాలని, ఇందుకోసం ప్రయత్నం చేస్తా అన్నారు. న్యాయవాదుల సంక్షేమం, ఆరోగ్య భద్రత కోసం ఆరోగ్య బీమా పరిమితిని 2 లక్షల నుండి 5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఇండ్లు లేదా స్థలాలు లేని ఆర్థికంగా వెనుకబడిన న్యాయవాదులకు ఇళ్లు, ఇల్లు స్థలాలు ప్రభుత్వం కేటాయించాలన్నారు. 2019 నుండి నమోదు అయిన న్యాయవాదులందరికీ హెల్త్ కార్డులు, అడ్వకేట్ వెల్ఫేర్ ఫండ్ రాని న్యాయవాదులు కూడా స్టాండింగ్ నిబంధన లేకుండా తగిన ఫీజుతో లబ్ధి పొందేలా కృషి చేస్తానన్నారు. 41ఏ లేదా బీఎన్ఎస్ఎస్ 35 యొక్క దుర్వినియోగం నియంత్రించేందుకు కృషి చేస్తానని భాస్కర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ 2019 ఎన్నికల మేనిఫెస్టోలో న్యాయవాదులకు ఇచ్చిన హామీలను త్వరితగతిన అమలు చేయాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాములు, సీనియర్ న్యాయవాది కొప్పుల పోచయ్య, సుభాష్ గౌడ్, రవీందర్, జనార్దన్ రెడ్డి , రాఘవులు, శ్రీనివాస్ గౌడ్ తదితరులున్నారు.

నామినేషన్ కేంద్రాలను ఎస్పీ తనిఖీ

విశాలాంధ్ర-వనపర్తి: గురువారం గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల మొదటి విడత నామినేషన్ల దృష్ట్యా గోపాల్ పేట్, మండలంలోని గోపాల్ పేట్, తాడిపత్రి, గ్రామపంచాయతీలు మరియు ఎదుల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎదుల గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన నామినేషన్ మరియు పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ఆకస్మికంగా పరిశీలించారు. నామినేషన్ కేంద్రాల్లో విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందితో ఎస్పీ గారు ప్రత్యేకంగా మాట్లాడి, ఎన్నికల నియమావళి ప్రకారం నామినేషన్ ప్రక్రియ పూర్తిగా నిష్పక్షపాతంగా, శాంతియుతంగా జరుగేలా పనిచేయాలని పలు సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛిత పరిస్థితులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు పారదర్శకమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రతి సిబ్బందిపైన ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలలో శాంతిభద్రతలను కాపాడటంలో ఎలాంటి రాజీ ఉండదు. ఎన్నికల ప్రక్రియను భంగపరచాలని చూస్తే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవు." అని స్పష్టం చేశారు. జిల్లాలోని సెన్సిటివ్ గ్రామాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, ప్రతి పోలింగ్ కేంద్రంలో పకడ్బందీ బందోబస్తు, పేట్రోలింగ్, క్విక్ రెస్పాన్స్ టీంలను సిద్ధంగా ఉంచినట్లు ఎస్పీ గారు తెలిపారు. అక్రమ డబ్బు, మద్యం పంపిణీ, బెదిరింపులు, అనైతిక ప్రలోభాలు వంటి తప్పిదాలు ఎక్కడైనా గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పి, వెంకటేశ్వర్ రావు, కొనపర్తి సిఐ కృష్ణయ్య గోపాల్పేట్ ఎస్సై, నరేష్, రేవల్లి ఎస్సై, రజిత, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మేడారం జాతర విజయవంతం చేద్దాం: ఎస్పీ

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: వచ్చే సంవత్సరం జనవరి 28 నుండి 31వ తేదీ వరకు జరగనున్న మహా మేడారం జాతరను పాత్రికేయులు, పోలీస్ సిబ్బంది, జిల్లా యంత్రాంగంతో కలసి సమన్వయంగా విజయవంతం చేద్దామని జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ అన్నారు. గత జాతర సందర్భంగా జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా, ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకుని, అందరితో కలిసి ముందుకు సాగుతున్నామని అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో పాత్రికేయులతో సమన్వయ కమిటీ సమావేశం ఓఎస్డి శివం ఉపాధ్యాయ, డి.ఎస్.పి రవీందర్‌లతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న మహా జాతరకు కోటి 50 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవడానికి, పదివేల మంది పోలీస్ సిబ్బంది నియమిస్తున్నామని, మేడారంలోని అమ్మవార్ల గద్దెల వద్ద మాస్టర్ ప్లాన్‌తో పనులు కొనసాగుతున్నాయని వివరించారు. జాతర సందర్భంగా అమ్మవార్లను దర్శించుకోవడానికి అందరికీ ఒకే నిబంధనలు ఉంటాయని, 99 శాతం ఎలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకుందామని తెలిపారు. గతంలో రెండు జాతర సందర్భంగా పనిచేసిన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్నానని, భక్తులకు ఇబ్బంది కలగకుండా అమ్మవార్లను దర్శించుకోవడానికి గతంలో ఉన్న క్యూలైన్లకు అదనంగా మరో ఐదు క్యూలైన్లను ఏర్పాటు చేయబోతున్నామని వివరించారు. మేడారం జాతర సందర్భంగా పాత్రికేయులు ఎలాంటి ఇబ్బందులు గురికాకుండా ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేయడంతో పాటు వారికి గుర్తింపు కార్డులు ఇవ్వడానికి ఆలోచిస్తామని, జాతర విషయంలో పాత్రికేయులు సహకరించాలని కోరారు. ఎలాంటి సంఘటనలు జరిగిన తన దృష్టి కానీ ఇతర అధికారులు దృష్టి గానీ తీసుకపోవాలని, ప్రతి విషయాన్ని భూతద్దంలో చూపించకుండా, సమస్య పరిష్కారం కోసం పాత్రికేయులు సూచనలు సలహాలు ఇవ్వాలని అన్నారు.

పోలీస్ సిబ్బందికి రెయిన్ కోట్లు పంపిణీ

డిజిపి ఆఫీస్ నుంచి వచ్చిన రెయిన్ కోట్లు, టీ షర్ట్ లను, ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ గురువారం ములుగు జిల్లా కేంద్రం పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో పోలీస్ సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు కాలం, సమయంతో సంబంధం లేకుండా 24 గంటలు విధి నిర్వహణలో ఉంటారని, అట్టివారికి కాలానుగుణంగా, రెయిన్ కోట్లు, స్వెటర్‌లు, టీ షర్ట్‌లు, ఇవ్వడం ద్వారా వారి విధులలో వారికి కొంత తోడ్పాటు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓ ఎస్డి శివ ఉపాధ్యాయ, ములుగు డి.ఎస్.పి రవీందర్, ఆర్ఐ అడ్మిన్ స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

నామినేషన్ ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలి

విశాలాంధ్ర-కొమరం భీం: 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లాలోని వాంకిడి మండల కేంద్రంలో గల గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వాంకిడి, జంబుల్ ధరి గ్రామపంచాయతీల సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని సందర్శించి నామినేషన్ పత్రాలను పరిశీలించి స్టేజ్ 1 రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ స్వీకరణ కేంద్రం ముందు గ్రామపంచాయతీలోని వార్డుల వారీగా ఫోటో ఓటర్ల జాబితా, రిజర్వేషన్ల వివరాలను ప్రదర్శించాలని, నామినేషన్ స్వీకరణ కేంద్రం నుండి 100 మీటర్ల పరిధిలో గుంపులుగా ఎవరిని అనుమతించకూడదని, నామినేషన్ సమర్పించే అభ్యర్థులు, ప్రతిపాదించే వారిని మాత్రమే అనుమతించాలని, నామినేషన్ల కేంద్రం వద్ద రద్దీ లేకుండా చూడాలని తెలిపారు.

ఆంగ్లంలో నిష్ణాతులుగా తయారు చేయాలి

విశాలాంధ్ర-మరిపెడ: విద్యార్థులను ఆంగ్లంలో నిష్ణాతులుగా తయారు చేయాలని, దానికి తగిన విధంగా వారికి శిక్షణను అందజేయాలని మండల విద్యాశాఖ అధికారిని గాదె అనిత దేవి ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండలంలో ఎల్టా మరిపెడ ఆధ్వర్యంలో మండల స్థాయి ఎజుక్వెస్ట్ మరియు ఇంగ్లీష్ ఒలంపియాడ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ఎల్టా మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి బయగాని రామ్మోహన్ తో కలిసి ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఆంగ్ల పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పే అంశాలను విద్యార్థులు జాగ్రత్తగా నేర్చుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఈ పోటీలలో జిల్లా పరిషత్, గవర్నమెంట్ పాఠశాలల విభాగం నుండి జూనియర్స్‌లో నర్మదా జడ్పిహెచ్ఎస్ ఎల్లంపేట, సీనియర్ విభాగంలో వైష్ణవి జడ్పీహెచ్ఎస్ గుండెపుడి, ఎజుక్వెస్ట్ జూనియర్ ఐశ్వర్య జెడ్పిహెచ్ఎస్ గుండెపుడి, సీనియర్ లిఖిత జెడ్పిహెచ్ఎస్ గుండెపుడి విజేతలుగా నిలిచారు. మోడల్ స్కూల్ కస్తూర్బా పాఠశాలల నుండి హర్షవర్ధన్ ఇంగ్లీష్ ఒలంపియాడ్ జూనియర్స్ లో హర్షవర్ధన్, సీనియర్ నుండి నాగేశ్వరి, ఎజుక్వెస్ట్ జూనియర్ దేవి విజ్ఞత, సీనియర్ అస్మిత మోడల్ స్కూల్ మరిపెడ విజేతలుగా నిలిచారు. విజేతలకు సర్టిఫికెట్లు మరియు షీల్డ్స్ బహుకరించారు. విజేతలు డిసెంబర్ 18న మహబూబాబాద్‌లో జిల్లాస్థాయి పరీక్షలలో పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్టా రాష్ట్ర కౌన్సిలర్ ఆంతోని డిసోజా, మరిపెడ కన్వీనర్ మంగు, కో కన్వీనర్ మల్లన్న, గైడ్ టీచర్లు దేవుల, నెహ్రూ, మర్రెడ్డి, లింగ నాయక్, లచ్చిరామ్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు

విశాలాంధ్ర బ్యూరో-ఖమ్మం: మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ స్వీకరణ మొదలైంది. రఘునాథపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చింతగుర్తి, గణేశ్వరం, రఘునాథపాలెం గ్రామాల నామినేషన్లు స్వీకరణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్, అనుదీప్ దురిశెట్టి తనిఖీ చేశారు. దాఖలు చేసే నామినేషన్ ప్రతాలను పరిశీలించారు. ఎన్నికల విధులు, బాధ్యతల పట్ల సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ తర్వాత పోటీ అభ్యర్థుల ప్రకటన, వారికి గుర్తుల కేటాయింపు తదితర అంశాలపై పూర్తి భాద్యతతో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జిల్లాలోని 7 మండలాలలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలలో 192 సర్పంచ్, 1740 వార్డు సభ్యుల స్థానాలకు గురువారం నుండి ఈనెల 29 శనివారం వరకు ఉదయం గం.10-30 నిమిషాల నుండి సాయంత్రం 5.00 గంటలకు వరకు కేటాయించిన కేంద్రాలలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు నామినేషన్లు స్వీకరిస్తారని అన్నారు. మొదటి విడుతలో 3వేల సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాటు చేశామని కలెక్టర్ వివరించారు. మండల తహసీల్దారు శ్వేత, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించాలి

విశాలాంధ్ర-సూర్యాపేట బ్యూరో: గ్రామ పంచాయతీ ఎన్నికలను నిష్పక్షపాతంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని జనరల్ పరిశీలకులు రవి సూచించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కే. నరసింహతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఓటర్లకు అవగాహన కల్పించి స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని, ఓటర్ స్లిప్స్ పంపిణీలో జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.మూడు విడతలలో జిల్లాలో మొత్తం 486 గ్రామపంచాయతీలు, 4,388 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయని, మొత్తం ఓటర్లు 6,94,815 మంది ఉన్నారని కలెక్టర్ తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, నామినేషన్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.సోషల్ మీడియాలో అసత్య ప్రచారం, ద్వేషపూరిత పోస్టులు నిషేధమని, ఎన్నికల ఫిర్యాదుల కోసం 6281492368 నంబరుకు సమాచారమివ్వవచ్చని తెలిపారు.

దీక్షాదివస్ విజయవంతం చేయాలి



విశాలాంధ్ర-మేడిపల్లి: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం వెనుక ఉన్న నాయకుడు మహానేత కేసీఆర్ చేసిన గొప్ప పోరాటం, వేలాది మంది విద్యార్థులు, యువత చేసిన త్యాగాలు మరియు ఉద్యమ నాయకత్వం చూపిన దీక్షలు, నిరాహార దీక్షలు, ఆత్మాహుతులు వంటి చారిత్రక ఘటనలను ప్రజలకు మరోసారి గుర్తుచేయడం. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి, అమర వీరుల స్తూపాలకు పాలాభిషేకం, వృద్ధాశ్రయాలలో పండ్లు పంపిణీ చేయడం, తెలంగాణ ఉద్యమ చరిత్ర యొక్క ఛాయ చిత్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఉదయం బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో దీక్షాదివస్ ఈ నెల 29వ తేదీన జరగనున్న దీక్షాదివస్ కార్యక్రమం గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరు మహేష్, లేతాకుల మాధవి రఘుపతి రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, 14డివిజన్ అధ్యక్షుడు జావిద్ ఖాన్, మహిళా అధ్యక్షురాలు నిర్మల, యూత్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, బాలరాజు, కిరణ్ గౌడ్, ప్రవీణ్ రెడ్డి శ్రీనివాస్, జోగి రెడ్డి, శంకర్ గౌడ్ శ్రీరాములు గౌడ్ ప్రసాద్ అక్షత్, మల్ల వెంకటేష్ గౌడ్, కూరెళ్ళ ఉపేందర్ రాధాకృష్ణన్ రావు, జగన్ రెడ్డి, నరేందర్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సతీష్ రెడ్డి, బుల్లెట్ శంకర్, శ్రీను, అశోక్ రెడ్డి, సోమేష్ గౌడ్, లింగారెడ్డి, అమర్ పటేల్, కృష్ణమూర్తి అంజయ్య, నాగిరెడ్డి, లక్ష్మీనారాయణ, శివరాజ్, అశోక్ రెడ్డి, సమ్మయ్య, కిరణ్ గౌడ్, క్రైసర్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

అపశబ్దాలైపోయిన వందే మాతరం, జై హింద్

ఏదో ఓ వివాదం లేకపోతే నరేంద్ర మోదీకి, ఆయన నాయకత్వంలోని ప్రభుత్వానికి నిద్రపట్టదు. రాజ్యసభలో వందే మాతరం, జై హింద్ లాంటి నినాదాలు చేయకూడదని రాజ్యసభ సచివాలయం విడుదల చేసిన బులెటిన్‌లో పేర్కొంది. ఇది బులెటెనే అయినప్పటికీ అది ఉత్తర్వుతో సమానమే. ఈ ఉత్తర్వులు జారీ చేసింది రాజ్యసభ అధ్యక్షుడిగా వ్యవహరించ బోతున్న చంద్రాపురం పొన్ను సామి రాధా కృష్ణన్ కాదు. కానీ ఆయన అధ్యక్షత వహించే రాజ్యసభ సచివాలయం ఆయనకు తెలియకుండా ఇలాంటి ఆదేశం జారీ చేయగలుగు తుందనుకోలేం. మరి సంఘపరివార్‌కు ప్రీతిపాత్రమైన "జై శ్రీరాం" నినాదం పార్లమెంటులో చేయవచ్చునో లేదో తెలియదు. పోనీ మోదీ అని అనొచ్చునా? మరి బీజేపీ ఎంపీ బిధూడీ నిండు కొలువులో ముస్లింలను అవమానించే మాటలు మాట్లాడడం పార్లమెంటు మర్యాదకు అనుగుణమైందని అనుకోవాలేమో. వందే మాతరం మీద బీజేపీ రకరకాల తమాషాలు చేస్తూ ఉంటుంది. ఇటీవలే వందేమాతరంలోని కీలక పంక్తులను పండిత్ నెహ్రూ తొలగించారని క్షుద్ర వివాదానికి తెర తీసింది. ఇది పచ్చి అబద్ధం. బంకిం చంద్ర చటోపాధ్యాయ రాసిన వందేమాతరం గేయంపై తమకు ఎనలేని భక్తి శ్రద్ధలు ఉన్నట్టు ప్రవర్తించింది. వందేభారతం గేయంపై సంఘ్ పరివార్‌కు వల్లమాలిన భక్తి శ్రద్ధలే ఉంటే ఆర్ఎస్ఎస్ శాఖలలో ఆ గేయాన్ని ఎందుకు ఆలపించరు అన్న ప్రశ్నకూ సమాధానం ఉండదు. నిజానికి వందేమాతరం ఆధారంగా సంఘ్ పరివార్, దాని రాజకీయ అంగమైన బీజేపీ రాజకీయం మాత్రం దండిగా చేస్తున్నాయి. భారత్‌కు జయం కలుగుగాక అన్న అర్థం ఇచ్చే జైహింద్ అన్న నినాదం విన్నా బీజేపీకి తేళ్ల జెర్రులు పాకినట్టు ఉంటుందేమో! "జై హింద్" నినాదాన్ని మొట్ట మొదట ఇచ్చింది కేరళలోని ట్రావంకోర్ కు చెందిన స్వాతంత్ర్య సమర యోధుడు చమప రామన్. ఆయన జర్మనీలో ఉంటూ భారత స్వాతంత్ర్యం కోసం పోరాడారు. ఈ నినాదాన్ని విదేశాలలోని భారత విప్లవకారులు ప్రచారంలోకి తెచ్చారు. బ్రిటీష్ వారికి వందేమాతరం అన్నా, జై హింద్ అన్నా పడేది కాదు. స్వాతంత్ర్య పోరాట సమయంలో బ్రిటిష్ వారి కొమ్ము కాసిన సంఘ పరివార్‌కు, దాని రాజకీయ విభాగమైన బీజేపీకి అంత కోపం కావొచ్చు. స్వాతంత్ర్య పోరాట కాలంలో 1943–1944లో నేతాజీ సుభాష్ చంద్ర బోస్ జై హింద్ నినాదాన్ని విరివిగా వాడే వారు. ఆయన ప్రసంగాల తరవాత విధిగా జై హింద్ అనే వారు. ఆయన నెలకొల్పిన ఆజాద్ హింద్ ఫౌజ్ నినాదం కూడా ఇదే. జనం ఒకరినొకరు పలకరించుకున్నప్పుడూ జై హింద్ అనడం సంప్రదాయంగా వస్తోంది. దేశం స్వతంత్రమైన తరవాత భారత రక్షణ దళాలు జై హింద్‌ను పరస్పరం పలకరించుకోవడానికి వాడే వారు. ఇది దేశవాసుల్లో దేశ భక్తిని ప్రోదిచేసింది. జై హింద్‌కు నిజానికి నిఖార్సైన సెక్యులర్ స్వభావం ఉంది. ఇది దేశవాసులను సంఘటితం చేసింది. స్వాతంత్ర్య పోరాటంలో ఈ నినాదం బాగా మార్మోగింది. పండిత్ నెహ్రూ ఉపన్యాసాల చివరలో కూడా జై హింద్ అని దీనికి విస్తృత ప్రచారం తీసుకొచ్చారు.

1906 నుంచి 1910 మధ్య బ్రిటిష్ వలసవాద ప్రభుత్వం వందేమాతరం గేయాన్ని అనేక సార్లు నిషేధించింది. బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో ఈ నినాదమే ఎక్కువగా వినిపించేది. 1930లలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థులు వందేమాతరం గీతాలాపనను నిషేధించారు. ఆర్య సమాజ్ నాయకుడు వందే మాతరం రామ చంద్రరావు జైలులో ఉన్నప్పుడు ఈ పోలీసులు కొరడా దెబ్బలు కొట్టినప్పుడల్లా వందేమాతరం అనే వారు. అది కడకు ఆయన ఇంటి పేరుగా మారిపోయింది. భగత్ సింగ్, ఖుదీరాం బోస్ కూడా ఉరికంబానికి వేలాడినప్పుడూ జై వందే మాతరం, జై హింద్ అనే నినదించారు. 1950 జనవరి 24న రాజ్యాంగ నిర్ణాయక సభ వందేమాతరంను జాతీయ గేయంగా ప్రకటించింది. గాంధీకి, సుభాష్ చంద్ర బోస్‌కు, నెహ్రూకు–సర్దార్ పటేల్ పటేల్‌కు లేదా నెహ్రూకు నేతాజీకి పోటీ పెట్టే సంఘ్ పరివార్ వందేమాతరంను ఈసడించు కోవడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. ఇంత చరిత్ర ఉన్న ఈ వందేమాతరం, జై హింద్ అన్న మాటలనే పార్లమెంటులో ప్రస్తావించకూడదు అని రాజ్యసభ సచివాలయం ఆదేశాలు జారీ చేయడం ఆశ్చర్యకరం ఏమీ కాదు. అంతేకాదు రాజ్యసభలో ధన్యవాదాలు, కృతజ్ఞతలు అని కూడా అనకూడదట. ఆ ఇతర మాటలేమిటో మాత్రం రాజ్యసభ సచివాలయం జారీ చేసిన బులెటిన్‌లో వివరించలేదు. సభా గౌరవాన్ని పరిరక్షించడానికి ఈ మాటలు ప్రస్తావించకూడదట. అక్కడికి ఇవేవో పార్లమెంటు గౌరవానికి విరుద్ధమైనవైనట్టు. స్వాతంత్ర్య పోరాట చరిత్రలో ఆవగింజంత చోటైనా లేని సంఘ్ పరివార్, బీజేపీకి వందేమాతరం, జై హింద్ అన్న మాటలు రుచించకపోవడమూ సహజమే. సుభాష్ చంద్ర బోస్ ఆజాద్ హింద్ ఫౌజ్ ఏర్పాటు చేస్తున్న సమయంలో సావార్కర్ బ్రిటిష్ సైన్యంలో జనాన్ని చేర్చడంలో తలమునకలై ఉన్నారన్న సత్యాన్ని గుర్తు పెట్టుకుంటే అసలు రహస్యం బయట పడ్తుంది. బెంగాల్ శాసన సభకు త్వరలో ఎన్నికలు జరగాల్సి ఉంది కనక బీజేపీ ఈ వివాదానికి తెర లేపి ఉండొచ్చు. కానీ వందేమాత్రం, జై హింద్ – ఈ రెండింటికీ బెంగాల్‌తో అత్యంత సన్నిహిత సంబంధం ఉంది. ఇవి బెంగాల్ ఆత్మగౌరవంతో ముడివడి ఉన్నాయి. అప్పుడే బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత మమతా బెనర్జీ బీజేపీ మీద అగ్గి మీద గుగ్గిలంలా పోరాడుతున్నారు. బీజేపీ నాటకాల మర్మం అర్థం చేసుకుంటే వందేమాతరం, జై హింద్ అంటే ఎందుకంత వ్యతిరేకత వెళ్లగక్కుతున్నారో అర్థం అవుతుంది. కిందటి బెంగాల్ శాసనసభ ఎన్నికలకు ముందు నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఫైళ్లు బయట పెడ్తామని మోదీ ప్రభుత్వం బీరాలు పలికింది. అందులో ఆర్ఎస్ఎస్‌కు, హిందూ మహాసభకు వ్యతిరేకమైన అంశాలున్నాయని కనిపెట్టగానే ఆ విషయం ప్రస్తావించడమే మానుకుంది. నెహ్రూకు వ్యతిరేకంగా, కాంగ్రెస్ కు విరుద్ధంగా లేశమంత ఆనవాలైనా నేతాజీ ఫైళ్లలో లేదు. ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ హయాంలో ఇలాంటి ఆదేశాలు జారీ కావడానికి స్పష్టమైన కారణమే ఉంది. ఆయన మధ్యలో కాషాయ తీర్థం పుచ్చుకున్న మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్ లాంటి వారు కాదు. రాధాకృష్ణన్ మూలాలు ఆర్ఎస్ఎస్‌లో బలంగా ఉన్నాయి. డిసెంబర్ ఒకటిన ప్రారంభమయ్యే పార్లమెంటు శీతాకాల సమావేశాలలో ఈ వివాదం ప్రతిపక్షాలకు మరో ఆయుధం అందివచ్చినట్టైంది.

పీడితజన బాంధవుడు పూలే

రామకిష్టయ్య సంగన భట్ల



భారత జాతిపిత మోహన్‌దాస్ గాంధీ కన్నా ముందే "మహాత్మునిగా" భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ "గురువుగా" భావించి, జన నీరాజనాలు అందుకున్న జ్యోతిరావు పూలే భారత ప్రప్ర థమ సామాజిక తత్వవేత్త. కుల వ్యవస్థకు వ్యతిరేకంగా, అణచివేతకు గురవుతున్న ప్రజలకు ఆత్మస్థైర్యం అందించేందుకు, వారి హక్కుల కోసం, నిరంతరం అననుకూల పరిస్థితులలో పోరాటాలు చేసి సత్య ధర్మ శోధక మండలిని స్థాపించి, అనేక సమస్యల పరిష్కారానికి కృషిచేసిన మహనీయుడు పూలే. సామాజిక తత్వవేత్తగా, ఉద్యమకారునిగా, సంస్క రణవాదిగా, సాంఘిక సేవా తత్పరునిగా, బాలికా విద్య ప్రోత్సాహకునిగా, మహిళా హక్కుల పరిరక్షకునిగా, కార్మిక పక్షపాతిగా, దీన జన బాంధవునిగా, లింగ వివక్షకు వ్యతిరేకిగా, అణగదొక్కబడిన వర్గాల హృదయాలలో చిరస్థాయిగా నిలిచారు పూలే. 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్ర (బ్రిటిష్ ఇండియా)లో జన్మించిన పూలే. తండ్రి గోవిందరావు పీష్వాల కాలంలో పూల వ్యాపారం చేయడం వల్ల వారికి పూలే అని పేరు వచ్చింది. చిన్నతనంలో చదువు మానేసి, తిరిగి పుణేలో 1941లో క్రైస్తవ ముస్లిం మిత్రుల సహకారంతో, స్కాటిష్ మిషన్‌లో చేరి విద్యాభ్యాసం కొనసాగించారు. పుస్తకపఠనంపై మక్కువ ఎక్కువ చూపారు. చదువుకునే సమయాన 1948లో బ్రాహ్మణ స్నేహితుని వివాహానికి హాజరైన సందర్భంగా బీసీ "మాలి" కులానికి చెందిన పూలే కుల వివక్షకులోనై తీవ్ర మానసిక వ్యధ చెందారు. కులం, వర్గం, ప్రాంతం, లింగాది, వివక్షతలకు అవిద్యే కారణమని భావించి, తన భార్య సావిత్రిని బడికి పంపారాయన. 1848 ఆగస్టులో బాలికల పాఠశాలను 51–52 లో మరో రెండు పాఠశాలలను ఆదర్శ దంపతులు స్థాపించారు. 1853లో దేశంలోనే మొదటగా పూలే వితంతువుల, అనాథ శిశువుల కోసం సేవా సదనం స్థాపించారు. శ్రామిక ప్రజల కోసం 1855లో 'రాత్రి బడి'ని స్థాపించారు. 1864లో "బాలహత్య ప్రతిబంధక్ గృహ" గర్భస్రావ వ్యతిరేక కేంద్రాన్ని స్థాపించి, వితంతువులైన గర్భిణీ స్త్రీలకు అండగా నిలిచాడు. 1868లో తన ఇంటి దగ్గరున్న స్నానాల తొట్టి వద్ద స్నానం చేసేందుకు అంటరాని వారికి కూడా అనుమతి ఇచ్చాడు. బాల హత్య ప్రతిబంధక్ గృహలో జన్మించిన బ్రాహ్మణ వితంతు కుమారున్ని 1872లో దత్తత స్వీకరించారు. తాను అనుభవించిన కుల వివక్ష ఇతరులకు అనుభవానికి రాకూడదని ఆకాంక్షించారు. సహ ధర్మచారిణి సావిత్రితో కలిసి 40 ఏళ్ల పాటు నిర్వహించిన సామాజిక ఉద్యమాలు, పూలే దంపతులకు పేద జనోద్ధారకులుగా సమాజంలో గుర్తింపు తెచ్చాయి. ఎక్కడ అన్యాయం, వివక్ష చోటు చేసుకుంటే, అక్కడ ఉద్యమం నడిపారు. అణగారిన వర్గాలకే కాదు, బాధితులైన అగ్రకుల వితంతు పునర్వివాహాలకు విశేష కృషి సలిపారు. బ్రాహ్మణ వితంతువులకు శిరో ముండనాలు చేయబోమని క్షురకులతో సమ్మెలు చేయించారు. 1871లో సత్యశోధన పక్షాన దీనబంధు పత్రిక నడిపాడు. సహపంక్తి భోజనానికి సంసిద్ధత ప్రకటించాడు. 1873 సెప్టెంబరు 24న సత్య శోధక సమాజాన్ని పూలే స్థాపించాడు. దేశంలోనే ఇది మొట్టమొదటి సంస్కరణోద్యమం. బొంబాయి నిర్మాణానికి తెలంగాణ నుంచి వలస వెళ్లి ఎదిగిన మున్నూరుకాపులే అధికం. బొంబాయిలో సత్యశోధక్ సమాజ్ శాఖ పుట్టింది సయాజీ నాగు మున్నూరుకాపు ఇంటిలోనే. పూలే సామాజిక సంస్కరణోద్యమానికి తుదిశ్వాస వరకు చేదోడువాదోడై నిలిచిన జాయా కారాడీ లింగు తండ్రి జాయా ఎల్లప్పలింగు ముంబైలో భవన నిర్మాణ కాంట్రాక్టరు. పూలే కొంతకాలం భవన నిర్మాణ కాంట్రాక్టరుగా పనిచేశారు. అప్పుడే ఆయనకు ముంబై తెలుగు ప్రజల పితామహునిగా ప్రసిద్ధులైన కాంట్రాక్టరు రామయ్య వెంకయ్య అయ్యవారితో పరిచయమైంది. వెంకయ్య పూలేను ముంబైకి ఆహ్వానించి, తోటి కాంట్రాక్టర్లతో కలిసి సత్యశోధక సమాజాన్ని విస్తరించడానికి, పాఠశాలలను ఏర్పాటుచేసి నడపడానికి ఆర్థిక, హార్థిక సహాయాలను అందించారు. సత్యశోధక సమాజానికి తెలుగువారి విరాళాలే ప్రధాన ఆర్థిక వనరుగా ఉండేవి. వెంకయ్య ఇల్లే అనాథ బాలల ఆశ్రమంగా ఉండేది. వారిని గొప్ప విద్యా వంతులుగా, సత్యశోధకులుగా చేసిన ఘనత వెంకయ్యదే. పూలే ప్రసిద్ధ గ్రంథం "గులాంగిరి" పుస్తకాన్ని 1873లో వెంకయ్యనే ప్రచురించారు.

1882లో హంటర్ కమిషన్‌కు' శూద్రాతి శూద్రులకు చదువు చెప్పించాల్సిన అవసరం ఉందని నివేదికలిచ్చి, అస్పృశ్యుల కోసం బ్రిటిష్ వారితో పాఠశాలల్ని ఏర్పాటు చేయించారు. 83 లో కల్టివేటర్ విప్ కార్డ్ (సేద్య గాడిపై చర్నాకోల) ముప్పై మూడు వ్యాసాల పుస్తకాన్ని సార్వజనిక సత్య ధర్మ పేరున ప్రచురించారు. బ్రాహ్మణేతరులతో జరిపించిన కులాంతర వివాహాలు చెల్లవని బ్రాహ్మణులు తీర్మానాలు చేస్తే, సత్యశోధన మండలి ద్వారా కోర్టుకు వెళ్లారు. 1990లో కోర్టు పూలే వాదనను సమర్థించింది. తద్వారా పూలే అమితానందం చెందారు. ఆయన రాసిన 33 ఆర్టికల్స్ గల "సార్వజనిక్ సత్యధర్మ" పుస్తకంలో కుటుంబ సృష్టి నియమాల గురించి వివరిస్తూ ప్రపంచం మొత్తాన్ని ఒక కుటుంబంగా వ్యక్తీకరించాడు. సామాజిక ప్రజాస్వామ్యం సాధించటం భారత దేశానికి ముఖ్యమనే మహత్తర సందేశాన్ని అందించిన మహాత్మా పూలే తన గురువు అని డా బీఆర్ అంబేద్కర్ ప్రకటించారు. పూలేకు కేవలం కుల వ్యవస్థ వ్యతిరేకతే కాదు, సామ్రాజ్యవాద వ్యతిరేకత, కార్మికవర్గ, రైతాంగ పక్షంగా పోరాడే అవగాహన, కార్యాచరణ ఉన్నాయి. అనారోగ్యానికి గురై పడకకే పరిమితం అయిన సమయాన, తాను మృతి చెందాక, ఎవరు ఏ బాధ్యతలు స్వీకరించాలో వివరించి సామాజిక ఉద్యమాలు, విస్తరింపచేసి, ప్రగతి మార్గంలో ప్రజలను తీసుకెళ్లాలని నొక్కి చెప్పి, తన ఆదర్శాలను కొనసాగించాలని హితవు పలికి 63వ ఏట 1890 నవంబర్ 28న గురువారం రాత్రి ప్రార్థనా గీతాల మధ్య పూలే తుదిశ్వాస విడిచారు. భారతావనిలో గొప్ప సాంఘిక సంస్కర్తగా ఆచంద్ర తారార్కం మహాత్మ పూలే మిగిలి పోనున్నారు.

సీనియర్ జర్నలిస్ట్, 9440595494

కార్మిక వర్గ సైద్ధాంతిక మహోపాధ్యాయుడు ఏంగెల్స్

ఎంసీ వెంకటేశ్వర్లు

భూస్వామిక పెట్టుబడి దారీ వర్గాల దోపిడీకి గురై దుర్భర జీవితాలు అనుభవిస్తున్న నిరుపేదలు, రైతన్నలు, శ్రామిక వర్గాల విముక్తికి "మార్క్సిజం" సిద్ధాంత ఆయుధాన్ని అందించిన మహోపా ధ్యాయులు మార్క్స్–ఏంగెల్స్. వారిద్దరి సాన్నిహిత్యం నాలుగు దశాబ్దాలు అవిచ్ఛిన్నంగా కొనసాగింది. స్నేహితులుగా, విప్లవకారులుగా, మార్క్సిస్టు ఆలోచన–ఆచరణకు నిబద్ధులై వారు చేసిన కృషి ప్రపంచ మానవాళి విముక్తికి మార్గదర్శకంగా నిలిచింది. అందువలన వారిద్దరిని వేరుచేసి చూడటం సాధ్యంకాదు. ఏంగెల్స్ ప్రష్యా (నేటి జర్మనీ)లోని బర్మన్ నగరంలో 1820 నవంబరు 28న జన్మించారు. ఆయన తత్వవేత్త, రాజకీయ నాయకుడు, మార్క్సిస్టు విప్లవకారుడు. ఏంగెల్స్ తండ్రి పారిశ్రామికవేత్త అయినప్పటికీ విద్యార్థిగా ఉన్న రోజుల్లోనే నియంతృత్వ విధానాలు, కార్మికవర్గ దోపిడీ విధానాలను ద్వేషించేవారు. ప్రముఖ తత్వవేత్త, బెర్లిన్ విశ్వవిద్యాలయం ఆచార్యులుగా ఉన్న హెగెల్ భావాలకు అనుచరుడిగా ఉన్నారు. ఆనాటి పరిస్థితుల్లో హెగెల్ తత్వశాస్త్ర భావాలు విప్లవాత్మకంగా ఉన్నా భావవాదంతో కూడుకున్నాయి. బ్రిటన్‌లో పారిశ్రామిక విప్లవం చోటుచేసుకున్న నేపథ్యంలో మార్క్స్, ఏంగెల్స్ నాటి సామాజిక, ఆర్థిక పరిస్థితులను అధ్యయనం చేయసాగారు. భూమిని స్వాధీనం చేసుకుని, ఆస్తిని కూడబెట్టుకుని వ్యాపారం, పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న యజమానులు సుఖసంతోషాలతో ఉండగా, వారి దగ్గర పనిచేసి ఆకలి–దప్పులతో చింపిరి గుడ్డలతో, వ్యాధిగ్రస్తులై జీవచ్ఛవాలుగా బతకడానికి కారణం ఏమిటని మార్క్స్, ఏంగెల్స్ ఆలోచించారు.

అప్పటికే ఏంగెల్స్ ప్రకృతి–మానవుడు, మానవ సంబంధాలు, సామాజిక పరిణామంపై అధ్యయనం మొదలుపెట్టాడు. మార్క్స్‌తో ప్రత్యక్ష సంబంధం లేకపోయినా ఉత్తరాల ద్వారా పరస్పరం తమ అభిప్రాయాలు పంచుకునేవారు. ఏంగెల్స్ 1842లో తన తండ్రి కంపెనీలో గుమాస్తాగా చేరి, లండన్‌లో స్థిరపడ్డారు. పారిశ్రామికవేత్త కుమారుడినని, కంపెనీలో ఉద్యోగం చేస్తున్నానని ఆలోచించకుండా ఇంగ్లాండులో కార్మికవర్గం నివసించే మురికివాడలలో తిరిగి, అక్కడి పరిస్థితులు అధ్యయనం చేశారు. లండన్, మాంచెస్టర్, యార్క్‌షైర్ మురికివాడలలో గృహవసతి లేక మురికికూపాలలో నివసిస్తున్న కార్మికులను ప్రత్యక్షంగా చూశారు. అనారోగ్యంతో, ఆకలితో బాధపడుతున్న చంటి పిల్లల దుస్థితిని చూసి చలించిపోయారు.

విజయవాడలో మార్క్స్, ఏంగెల్స్ విగ్రహం

కార్మికవాడలలో తన అనుభవాలను, ఆనాటి ప్రభుత్వ నివేదికలను, గణాంకాలతో సహా వివరిస్తూ 1845లో 'ఇంగ్లాండులో కార్మికవర్గం స్థితి' అనే గ్రంథం రచించి సంచలనం సృష్టించారు. సమాజానికి సంపద సృష్టించే శ్రామికవర్గం దుర్భర జీవితాలు, దరిద్రాన్ని ప్రామాణికంగా, హృదయవిదారకంగా చిత్రించిన ఈ గ్రంథం ప్రపంచ శ్రామికవర్గంపై ప్రగాఢమైన ప్రభావం కలుగజేసింది. సామాజిక, ఉత్పాదకశక్తుల సంబంధాలను లోతుగా పరిశీలించిన ఏంగెల్స్, హెగెల్ భావవాద ప్రభావం నుంచి బయటపడి భౌతికవాదిగా మారారు.

భౌతికవాద దృక్పథం కలిగిన మార్క్స్, ఏంగెల్స్ సామాజిక పరిణామక్రమాన్ని చారిత్రక భౌతికవాద దృక్పథంతో విశ్లేషణకు పూనుకున్నారు. శాస్త్రవిజ్ఞానం ఉచ్ఛస్థితికి అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో కూడా సత్యసాయి బాబా అడుగుజాడల్లో నడవాలనీ, రామాలయంపై ఎగురుతున్న కాషాయ జెండా శ్రీరాముని సిద్ధాంతాలను ప్రపంచానికి చాటుతుందని దేశ ప్రధాని మోదీ అశాస్త్రీయ భావజాలాన్ని ప్రచారం చేస్తున్నారంటే 160 సంవత్సరాల క్రితం మార్క్స్–ఏంగెల్స్... క్రిస్టియన్ మతాచార్యుల నుంచి ఎలాంటి ఒత్తిళ్లను ఎదుర్కొన్నారో అర్థమవుతుంది. సమాజ పరిణామక్రమంలో భూములు, ఫ్యాక్టరీలు, యంత్రాలు తదితర సొంత ఆస్తులను కూడబెట్టుకుని ఆస్తిపాస్తులులేని అత్యధిక జనాభాను, అత్యల్ప సంఖ్యాకులు దోపిడీ చేయడాన్ని నిర్మూలించి సోషలిస్టు సమాజాన్ని నెలకొల్పాలన్న ధృడ సంకల్పంతో మార్క్స్–ఎంగెల్స్ కృషి చేశారు. సొంత ఆస్తిపై ఏర్పడిన సామాజిక, ఉత్పత్తి సంబంధాలను బద్దలుకొట్టి సోషలిస్టు వ్యవస్థను ఏర్పాటు చేయడంలో కార్మికవర్గం అగ్రభాగాన ఉంటుందని సూత్రీకరించారు. ఆనాటి సామాజిక శాస్త్రవేత్తలు, ఉతారవాదులు, పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు ఒక పక్క మతాధిపతులు మరో పక్క మార్క్సిస్టు సిద్ధాంతాన్ని, వర్గపోరాట దృక్పథాన్ని వ్యతిరేకిస్తూ పుంఖాను, పుంఖాలుగా రచనలు చేశారు. మార్క్స్‌ను పాలకవర్గాలు ఎక్కడా నివసించకుండా దేశ బహిష్కరణ చేశారు. బూర్జువావర్గ దోపిడీని, పెట్టుబడిదారీ సమాజంలో జరిగే ఘటనలను విమర్శిస్తూ శ్రామికవర్గ ప్రత్యక్ష కార్యాచరణను తోసిపుచ్చే కుహనా విమర్శలను మార్క్స్, ఎంగెల్స్ ఎండగట్టారు.

సమాజాన్ని అనేక కోణాల నుంచి విశ్లేషించిన తత్వవేత్తలు, ఆర్థికవేత్తలు శ్రామికవర్గ ప్రయోజనాలు, దోపిడీ వర్గాల మధ్య వర్గ వైరుధ్యాలను గుర్తించడంలో వైఫల్యం చెందారు. రాబర్ట్ ఒవెన్, సెయింట్–సైమన్, ఛార్లెస్ ఫూరియర్ లాంటి ఊహాజనిత సోషలిస్టులు, వర్గపోరాటం లేకుండా సోషలిజం తీసుకురాగలమన్న వారి సిద్ధాంతాలను మార్క్స్, ఏంగెల్స్ తుత్తునియలు చేశారు. పెట్టుబడిదారీ సమాజంలో దోపిడీకి గురవుతున్న అత్యధిక ప్రజానీకానికి, దోపిడీకి పాల్పడుతున్న అత్యల్ప ప్రజానీకానికి మధ్య వైరుధ్యం పరిపక్వమైనప్పుడు సామాజిక విప్లవం వస్తుందని మార్క్స్–ఏంగెల్స్ చేసిన సూత్రీకరణ చరిత్రలో రుజువైంది. రష్యన్ అక్టోబరు విప్లవం, చైనా, క్యూబా విప్లవాలు ఇందుకు సజీవ సాక్షులు. మార్క్స్–ఏంగెల్స్ సిద్ధాంతకర్తలే కాదు. ఆచరణవాదులు కూడా. ఏంగెల్స్ 1845, 1847 వరకు బ్రస్సెల్స్, పారిస్‌లో నివసిస్తూ అక్కడి కార్మికవర్గంతో ప్రత్యక్ష సంబంధాలు పెట్టుకున్నారు. అక్కడే మార్క్స్, ఏంగెల్స్ రహస్యంగా పనిచేస్తున్న జర్మన్ 'కమ్యూనిస్టు లీగ్'తో సంబంధాలు పెట్టుకుని లీగ్ కోరిక మేరకు 1848లో 'కమ్యూనిస్టు ప్రణాళిక'ను రచించారు. ఆ పుస్తకం నేటికీ ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమానికి, యావత్తు ప్రపంచ కార్మికోద్యమానికి మార్గదర్శిగా ఉన్నది.

ఏంగెల్స్ కమ్యూనిస్టు ఉద్యమానికి అంకితమైన మార్క్సిస్టు మేధావి. ప్రపంచ విప్లవోద్యమాలకు ప్రామాణికమైన 'మార్క్సిజం' సిద్ధాంతం రూపకల్పనలో మార్క్స్ సహచరుడుగా ఏంగెల్స్ కృషి చేసినా ఆ ఘనతను మార్క్స్‌కే కట్టబెట్టాడు. అసంపూర్తిగా మిగిలిన మార్క్స్ రచన 'కాపిటల్'ను పూరించి, ప్రచురించడంలో ఏంగెల్స్ ఔదార్యం కొనియాడదగినది. సోషలిజం ఏ ఒక్క దేశానికో పరిమితమైనది కాదనీ సార్వత్రికమైనదని గుర్తించిన మేధావి. మార్క్స్ 1883 మార్చి 14న చనిపోయిన తరువాత ప్రపంచ కార్మికవర్గ ఐక్యతను కాపాడటంలో తనవంతు పాత్ర నిర్వహించారు. యూరోపియన్ సోషలిస్టులకు సలహాదారుడిగా, నాయకుడిగా కొనసాగారు. జర్మన్, స్పెయిన్, రొమేనియా, రష్యా వంటి దేశాల ప్రతినిధులు కూడా ఆయన సలహా కోసం, ఆదేశాల కోసం వస్తుండేవారనీ, వయోవృద్ధుడైన ఏంగెల్స్ మహత్తర జ్ఞాననిధిని దారాళంగా వినియోగించుకునే వారని లెనిన్ కొనియాడారు. సైద్ధాంతిక అవగాహన, విశేష జీవితానుభవం కలిగిన మహాయోధుడు, శ్రామికవర్గ మహోపాధ్యాయుడు అయిన ఏంగెల్స్ 1895 ఆగస్టు 5న లండన్‌లో తుదిశ్వాస విడిచారు. ఆయన సోషలిస్టు సైద్ధాంతిక బీజాలు పెరిగి ప్రపంచాన్ని ఆవరించాయి. నేటికీ కార్మిక, కర్షక, శ్రామికవర్గ విముక్తికి ఆదర్శంగా నిలిచాయి.

> భౌతికవాద దృక్పథం కలిగిన మార్క్స్, ఏంగెల్స్ సామాజిక పరిణామక్రమాన్ని చారిత్రక భౌతికవాద దృక్పథంతో విశ్లేషణకు పూనుకున్నారు. శాస్త్రవిజ్ఞానం ఉచ్ఛస్థితికి అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో కూడా సత్యసాయి బాబా అడుగుజాడల్లో నడవాలనీ, రామాలయంపై ఎగురుతున్న కాషాయ జెండా శ్రీరాముని సిద్ధాంతాలను ప్రపంచానికి చాటుతుందని దేశ ప్రధాని మోదీ అశాస్త్రీయ భావజాలాన్ని ప్రచారం చేస్తున్నారంటే 160 సంవత్సరాల క్రితం మార్క్స్–ఏంగెల్స్... క్రిస్టియన్ మతాచార్యుల నుంచి ఎలాంటి ఒత్తిళ్లను ఎదుర్కొన్నారో అర్థమవుతుంది.

శుక్రవారం ఏంగెల్స్ 205వ జయంతి

చైనాకు భారత ఎగుమతులు పెరిగాయా!

ఎం కోటేశ్వరరావు

చైనాకు ఏడు నెలల్లో 25శాతం పెరిగిన భారత ఎగుమతులు. మీడియాలో కొద్ది రోజుల క్రితం వచ్చిన శీర్షిక ఇది. ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు వరుసగా ఏడు నెలల నుంచి పెరుగుతూనే ఉన్నాయి. మంచిదే, మన ఎగుమతులు ఏమాత్రం పెరిగినా సంతోషించాల్సిందే. అయితే అసలు కథేమిటంటే నరేంద్రమోదీకి భజన చేసేందుకు అలవాటుపడిన వారు చేసిన జిమ్మిక్కు ఇది. నిజంగా జరిగిందేమిటి ? గతేడాదితో పోలిస్తే ఎగుమతులు పెరిగిన మాట నిజం. ఇదే సమయంలో చైనా నుంచి దిగుమతులు అంతకంటే ఎక్కువగా పెరిగిన సంగతి, పదేళ్ల స్థాయికి ఎగుమతులు పడిపోయిన నిజాన్ని జనాలకు చెప్పరేం ! నరేంద్రమోదీ ఏలుబడి పదకొండు సంవత్సరాలను మూడు భాగాలుగా విభజిద్దాం. 2014–15 నుంచి 2018–19 మధ్య కాలంలో చైనాకు మన ఎగుమతులు 11.96 నుంచి 16.75 బిలియన్ డాలర్లకు పెరిగాయి. తరువాత మూడు సంవత్సరాలలో 21.56 బిలియన్ డాలర్లకు చేరాయి. అప్పటి నుంచి 2024–25లో 14.25 బిలియన్ డాలర్లకు పతనమయ్యాయి. గత ఏడాది తొలి ఏడు నెలలతో పోల్చి చూపి వర్తమాన సంవత్సరంలో 10.03 బిలియన్ డాలర్లకు 25శాతం పెరిగినట్లు చిత్రించారు. మిగిలిన ఐదు నెలల కాలంలో గత ఏడాది మొత్తాలకు చేరవచ్చు, స్వల్పంగా పెరగవచ్చు తప్ప గతంలోని 21.56 బిలియన్ డాలర్లకు చేరే స్థితి ఉందా? చైనాకు మన ఎగుమతులు పెరగటం వెనుక అంతర్జాతీయ రాజకీయాలు కూడా లేకపోలేదు. అమెరికా వైపు మొగ్గుచూపుతున్న నరేంద్రమోదీకి పన్నుల రూపంలో ట్రంప్ తీసుకున్న వైఖరి మింగుడు పడలేదు. ఈ స్థితిలో ఎత్తుగడగా అవసరం ఉన్నా లేకున్నా చైనా ఏప్రిల్ నుంచి మన దేశం నుంచి దిగుమతులను పెంచింది, దీని కొనసాగింపు రానున్న రోజుల్లో మన దేశం అనుసరించే వైఖరిని బట్టి ఉంటుంది. చైనాకు మన మార్కెట్‌ను ఎంతగా తెరిస్తే దానికి ప్రతిగా మనకూ మేలు చేకూరే విధంగా బీజింగ్ వ్యవహరిస్తుందని వేరే చెప్పనవసరం లేదు. చైనా పెట్టుబడులను స్వీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. మన దేశం నుంచి విమానాలను నడిపేందుకు రెండు చైనా కంపెనీలు దరఖాస్తు చేసినట్లు తాజా వార్తలు వెల్లడించాయి. చైనా మీద ఆధారపడకూడదు, దాన్ని పక్కకు నెట్టేసి అసలు మనమే ప్రపంచానికి వస్తువులను ఎగుమతులు చేద్దాం అంటూ పైకి ఎన్ని కబుర్లు చెప్పినా అలాంటి సూచనలు లేవు. తొలి ఏడు నెలల్లో ఎగుమతులు పెరిగాయని చెప్పిన వారు అదే సమయంలో చైనా నుంచి దిగుమతులు 57.65 నుంచి 64బిలియన్ డాలర్లకు పెరిగాయని చెబితే నిజాయితీగా ఉంటుంది. గత సంవత్సరం చైనాతో మన వాణిజ్య లోటు 99.12 బిలియన్ డాలర్లు. దీన్నే మరోవిధంగా చెప్పాలంటే నరేంద్రమోదీ సర్కార్ అసమర్ధతకు బీజింగ్‌కు మనం చెల్లించిన మూల్యం. ఇంకా చెప్పాలంటే గత పదకొండు సంవత్సరాల్లో 701.95 బిలియన్ డాలర్లు సమర్పించుకున్నాం. మోదీ అధికారానికి వచ్చిన తొలి ఏడాది మన వాణిజ్య లోటు 48.45 బిలియన్ డాలర్లు కాగా పదకొండేళ్లలో రెట్టింపై 99.21 బిలియన్ డాలర్లకు చేరింది, ఎందుకని? గత ఐదు సంవత్సరాల్లో చైనాకు మన ఎగుమతులు 33శాతం పడిపోగా దిగుమతులు 74శాతం పెరిగాయి. ఆత్మనిర్భరత ఏమైనట్లు, ప్రపంచంలో పెరిగినట్లు చెపుతున్న మోదీ పలుకుబడి సంగతేమిటి? కాంగ్రెస్ యాభై ఏళ్లలో చేయలేని వాటిని తాను తొలి ఐదేళ్లలోనే చేసినట్లు గతంలో చెప్పుకున్నారు. సంతోషం. వర్తమాన అవసరాలకు అనుగుణంగా వస్తూత్పత్తిని ఎందుకు చేయలేకపోయినట్లు? రెండింజన్ల పాలనే కదా ఉన్నది. యాపిల్ ఐఫోన్లను తయారు చేస్తున్నాం, ఎగుమతి చేస్తున్నాం అని ప్రచారం చేస్తున్నారు. మిగతా ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల సంగతేమిటి? గ్లోబల్ ట్రేడ్ రిసర్చ్ ఇనిస్టిట్యూట్(జీటీఆర్ఐ–ఇండియా) చెప్పినదాని ప్రకారం కీలకమైన ఎనిమిది పారిశ్రామిక ఉత్పత్తుల విషయంలో చైనా ప్రధాన సరఫరాదారుగా ఉంది. చైనా నుంచి దిగుమతుల వలన రెండు రకాల నష్టాలు, ఒకటి స్థానిక మన పరిశ్రమలు గిడసబారిపోతున్నాయి, కార్మికులకు ఉపాధి దొరకటం లేదు. విలువైన విదేశీమారక ద్రవ్యాన్ని చైనాకు సమర్పించుకుంటున్నట్లు ముందే చెప్పుకున్నాం. గత కాంగ్రెస్ పాలనకూ మోదీ ఏలుబడికి తేడా ఏమిటి? చైనా నుంచి దిగుమతుల్లో మన్మోహన్ సింగ్ రికార్డులనే కాదు, తన రికార్డులను కూడా తానే మోదీబద్దలు కొట్టుకున్నారు. చైనాతో తిరిగి సత్సంబంధాలను నెలకొల్పుకొనటం మంచిదే. కానీ అనేక వస్తువుల దిగుమతులపై ఆంక్షలను సడలించిన కారణంగా గత రికార్డులను అధిగమించే సూచనలు కనిపిస్తున్నాయి.

అమెరికాతో వాణిజ్య ఒప్పందం గురించి గత పదినెలలుగా చెబుతూనే ఉన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేతతో సహా అన్నీ డోనాల్డ్ ట్రంప్ చెబుతున్నట్లే జరుగుతున్నందున అనేక అనుమానాలు. ఇంతవరకు ఏం జరుగుతోందో జనానికి తెలియదు. ట్రంప్ చెబితే తప్ప మనకు తెలిసేట్లు లేదు, మన మార్కెట్‌ను వారి వస్తువులకు బార్లా తెరవాలని అమెరికా వత్తిడి తెస్తోంది. అదే జరిగితే స్థానిక పరిశ్రమలు, వాణిజ్యాలను మూసుకోవాల్సిందే అని మన కార్పొరేట్లు హెచ్చరిస్తున్నాయి. వర్తమాన ఆర్థిక సంవత్సరం తొలి ఏడునెలల్లో మన ఎగుమతులు ఎక్కువగా అమెరికాకు జరిగితే దిగుమతులు చైనా నుంచి జరిగాయి. ఇదేం కుదరదు అన్నీ మా నుంచే దిగుమతి చేసుకోవాలని ట్రంప్ బెదిరిస్తున్నాడు. అసలు సంగతేమిటంటే చైనా నుంచి తక్కువ ధరలకు వస్తున్నాయి కనుక దిగుమతి చేసుకుంటున్నాం తప్ప జిన్‌పింగ్ మీద ప్రేమతో కాదు. అమెరికాకు చోటిస్తే ఎడారి వ్యాపారి, ఒంటె కథ మాదిరి దేశీయ సంస్థలను బయటకు నెట్టేయటం లేదా మింగివేస్తుంది. అందుకనే రెండు దేశాలతో సమన్వయం చేసుకోవటం మోదీకి కత్తిమీద సాములా ఉంది. రానున్న రోజుల్లో మనకు మేలు జరిగే విధంగా విదేశాంగ విధానం ఉండాలని ఇప్పటికే కార్పొరేట్ల లాబీ మాట్లాడుతోంది. కరవమంటే కప్పకు విడవమంటే పాముకు కోపం! మన దేశ వస్తు ఎగుమతులను చూస్తే 2024లో 434.44 బిలియన్ డాలర్లు కాగా దిగుమతులు 698–702 బి. డాలర్ల మధ్య ఉన్నాయి. నిఖర వాణిజ్యలోటు 263.31బిలియన్ డాలర్లు. ఎగుమతుల్లో అమెరికా 18.3, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ 8.5, నెదర్లాండ్స్ 5.6, సింగపూర్ 3.6, చైనా 3.4, బ్రిటన్ 3.2, సౌదీ అరేబియా 2.8, బంగ్లాదేశ్ 2.6, జర్మనీ 2.4, ఇటలీ 1.92శాతాల చొప్పున ఉన్నాయి. 2024 జనవరి నుంచి జూన్ వరకు వివరాలు చూస్తే మన దేశం 151దేశాలతో వాణిజ్య మిగులు, 75దేశాలతో తరుగులో ఉంది. మోదీ భక్తులు చూశారా మానేత పలుకుబడి అని డబ్బా కొట్టుకోవటానికి ఈ అంకెలు తప్ప వాస్తవ పరిస్థితి ఏమిటోపైన చెప్పుకున్నాం. అమెరికాను వదులుకొనేందుకు భయపడటానికి, డోనాల్డ్ ట్రంప్ ఎంతగా అవమానించినా మౌనంగా ఉండటానికి అక్కడికి మన ఎగుమతులు ఎక్కువగా ఉండటమే కారణం. మరోవైపు ఐదేళ్లపాటు చైనాతో వైరంతో గడిపిన తరువాత సాధారణ సంబంధాలు ఏర్పరుచుకోవటానికి కారణం దాని మీద ఆధారపడాల్సి రావటమే. పదకొండు సంవత్సరాల్లో పరాధీనతను తగ్గించటానికి మోదీ చేసిందేమీ లేదు. అందుకే రాజీపడ్డాం. మన దిగుమతులను చూస్తే 2024లో చైనా నుంచి 15.5, రష్యా 9.1, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ 8.6, అమెరికా 6.1, సౌదీ అరేబియా 4.3, ఇరాక్ 4.2, ఇండోనేషియా 3.4, స్విట్జర్లాండ్ 3.1, దక్షిణ కొరియా 3, సింగపూర్ 2.9శాతం చొప్పున ఉన్నాయి. గాల్వన్ లోయ ఉదంతాల సమయంలో కాషాయ దళాలు చైనా నుంచి దిగుమతుల నిలిపివేస్తే డ్రాగన్ మన కాళ్ల దగ్గరకు వస్తుందంటూ ఊగిపోయారు. నిజానికి మనకు అంత సీన్ లేదు, 2024లో చైనా నుంచి దిగుమతులు చేసుకున్న మొదటి పది దేశాలలో మనం కేవలం 3.4శాతంతో ఆరవ స్థానంలో ఉన్నాం. చైనాను వెనక్కు నెట్టేయాలన్న సంకల్పాన్ని ఎవరూ కాదనరు, పోటీ పడాల్సిందే. కానీ ఒక్కసారిగా ఈ పరిస్థితి మారాలన్నా, 2047 నాటికి దేశాన్ని ఎక్కడికో తీసుకుపోవాలన్నా నరేంద్రమోదీ అల్లావుద్దీన్ అద్భుత దీపాన్ని సంపాదించాల్సిందే.

సీనియర్లతో మాట్లాడాకే నిర్ణయం

కర్నాటక సీఎం మార్పుపై ఖడ్గే

న్యూఢిల్లీ: కర్నాటక నాయకత్వంపై కాంగ్రెస్‌లో తర్జనభర్జన కొనసాగుతోంది. సీనియర్ నాయకులతో చర్చించిన తర్వాతే ఈ గందరగోళానికి తెరదించగలమని పార్టీ అధ్యక్షుడు మలికార్జున ఖడ్గే అన్నారు. 'కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను దిల్లీకి పిలిపించి, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సహా సీనియర్ నేతలతో కలిసి రాష్ట్ర నాయకత్వంపై చర్చించిన తర్వాత ఈ వివాదాన్ని పరిష్కరిస్తాం' అని ఖడ్గే గురువారం వెల్లడించారు. అధికారం కోసం పార్టీలో పోరు తీవ్రరూపం దాల్చింది. రెండున్నరేళ్ల పాలన పూర్తి కావడంతో 2023లో జరిగిన ఒప్పందం ప్రకారం సీఎం మార్పు జరగాలని జోరుగా ప్రచారం జరుగుతోంది. డీకే శివకుమార్‌కు ముఖ్యమంత్రి బాధ్యతలు అప్పగిస్తారన్న ఊహాగానాలు ఉన్నాయి. ఖడ్గే బెంగళూరులో విలేకరులతో మాట్లాడుతూ 'నేను దిల్లీ వెళ్లిన తర్వాత ముగ్గురు-నలుగురు కీలక నాయకులతో చర్చిస్తాను. ఏ విధంగా ముందుకెళ్లాలో నిర్ణయిస్తాం. ఆ తర్వాతే ఈ గందరగోళానికి తెర దించుతాం. సిద్ధరామయ్య, డీకే శివ కుమార్‌ను తప్పకుండా దిల్లీ చర్చల్లో భాగస్వాములను చేస్తాం. అందరితో చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటాం' అని అన్నారు. ఇదిలావుంటే, తనకు సన్నిహితులైన సీనియర్లతో బెంగళూరు నివాసంలో సిద్ధరామయ్య భేటీ అయ్యారు. సమావేశం అనంతరం సీఎం విలేకరులతో మాట్లాడుతూ ఇది ప్రత్యేక సమావేశం కాదని, మామూలుగా జరిగేదేనని చెప్పారు. కాగా, అధిష్ఠానం పిలిచిన వెంటనే దిల్లీకి వెళతామని సిద్ధరామయ్య, డీకే శివకుమార్ వెల్లడించారు.

అధిష్ఠానాన్ని కలవను: డీకే

ఒప్పందం ప్రకారం రెండున్నరేళ్ల తర్వాత తనకు ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని డీకే శివకుమార్ కోరుతున్నారు. మరోవైపు, సీఎం సిద్ధరామయ్య ఐదేళ్ల పాటు తానే సీఎంగా ఉండాలని భావిస్తున్నారు. ఈ వివాదం ప్రస్తుతం కాంగ్రెస్ అధిష్ఠానం ముందు ఉంది. ఇప్పటికే రెండు వర్గాలు తమ నేతలే సీఎంగా ఉండాలని భావిస్తున్నాయి. దిల్లీ అధిష్ఠానంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇదిలా ఉంటే, తాజాగా డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. తాను అధిష్ఠానాన్ని కలవడం లేదని, దిల్లీకి తనను ఎవరూ పిలువలేదని ఆయన అన్నారు. తాను ఒక కార్యక్రమం కోసం ముంబై వెళ్తున్నట్లు చెప్పారు. ఇన్నాళ్లు వచ్చిన వార్తలను డీకే శివకుమార్ తోసిపుచ్చారు.

ఐదేళ్లూ సిద్ధరామయ్యే: యతీంద్ర

ముఖ్యమంత్రి మార్పుపై ఊహాగానాలు వెల్లువెత్తుతున్న వేళ సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర గురువారం కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎంగా సిద్ధరామయ్య తన ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకుంటారని ధీమా వ్యక్తం చేశారు. తన తండ్రిపై ఎలాంటి ఆరోపణలు లేవని, ఆయన ఎటువంటి కుంభకోణాల్లో భాగం కాలేదని పేర్కొన్నారు. సిద్ధరామయ్య సుపరిపాలన అందిస్తున్నారని, ఎమ్మెల్యేల మద్దతు కూడా ఆయనకే ఉందని తెలిపారు. అయితే, పార్టీ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయానికే కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. అధికార పంపిణీ గురించి తనకు తెలియదని, ఎవరూ తనతో చెప్పలేదని ఆయన అన్నారు. ఇచ్చిన మాటకు సీఎం సిద్ధరామయ్య కట్టుబడి ఉంటారన్నారు. కానీ, ఆయన అధిష్ఠానానికి ఇచ్చిన మాట ఏంటనేది మాత్రం తాను చెప్పలేనని, ఆ విషయాన్ని ముఖ్యమంత్రినే అడగాలని అన్నారు.

సీఎంగా డీకేకు మద్దతిస్తా: పరమేశ్వర

బెంగళూరు: కర్నాటకలో ముఖ్యమంత్రి మార్పుపై సందిగ్ధత కొనసాగుతోంది. అయితే, ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు అత్యంత సన్నిహితుడు, కర్నాటక హోం మంత్రి జి.పరమేశ్వర దీనిపై కీలక వ్యాఖ్యలు చేశారు. నాయకత్వ మార్పునకు అధిష్ఠానం అంగీకరిస్తే... ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సీఎం అయ్యేందుకు తాను పూర్తిగా మద్దతిస్తానని తెలిపారు. పరమేశ్వర గురువారం మీడియాతో మాట్లాడుతూ 'సీఎం ఆకాంక్షల గురించి ఎవరైనా అడిగితే... నేను రేసులో ఉన్నానని చెబుతుంటా. కానీ, అధికార మార్పిడి జరిగి... డీకేకు సీఎం బాధ్యతలు అప్పగించినా మేము దానికి అంగీకరిస్తాం' అని అన్నారు. తనకు కూడా ముఖ్యమంత్రి అవ్వాలనే ఆకాంక్ష ఉందన్నారు. పార్టీ కోసం తాను చేసిన కృషి గురించి అధిష్ఠానానికి పూర్తిగా తెలుసని, తుది నిర్ణయం వారిదేనన్నారు. అదేసమయంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే కూడా కర్నాటక సీఎం పదవికి తగిన వ్యక్తి అన్నారు. అయితే, సిద్ధూ, డీకే మధ్య ఎలాంటి ఒప్పందం జరిగిందనే విషయం తనకు తెలియదని చెప్పారు.

డీకేకు అన్యాయం జరిగితే పోరాటమే: వొక్కలిగ సంఘం హెచ్చరిక

బెంగళూరు: ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తున్న ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు అన్యాయం జరిగితే తీవ్రంగా పోరాడతామని కర్నాటక రాష్ట్ర వొక్కలిగ సంఘం గురువారం కాంగ్రెస్ అధిష్ఠానాన్ని హెచ్చరించింది. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కూడా అయిన శివకుమార్ వొక్కలిగలోని ఆధిపత్య వ్యవసాయ వర్గానికి చెందిన వ్యక్తి. సంఘ అధ్యక్షుడు ఎల్. శ్రీనివాస్ ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 'అసెంబ్లీ ఎన్నికల సమయంలో శివకుమార్ తీవ్రంగా శ్రమించారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి పార్టీని బలోపేతం చేశారు. అతని ప్రయత్నాల వల్ల కాంగ్రెస్ 140 సీట్లు గెలుచుకుంది' అని తెలిపారు. సిద్ధరామయ్య రెండున్నర సంవత్సరాల పదవీకాలం పూర్తి చేసిన తర్వాత ఆయనను ముఖ్యమంత్రిని చేస్తామని కాంగ్రెస్ అధిష్ఠానం గతంలో శివకుమార్‌కు హామీ ఇచ్చిందని ప్రజలు చెబుతున్నారని తెలిపారు. సిద్ధరామయ్య గతంలో ఐదు సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఇప్పుడు ఈసారి రెండున్నర సంవత్సరాలు పూర్తి చేశారని బెంగళూరు మాజీ డిప్యూటీ మేయర్ శ్రీనివాస్ అన్నారు. శివకుమార్‌కు సిద్ధరామయ్య అధికారాలను బదిలీ చేస్తారా లేదా అనే సందేహాలు ఉన్నాయని, మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ విషయంలో దిల్లీలో పర్యటిస్తున్నారని చెప్పారు. 'వొక్కలిగ సంఘానికి చెందిన మేము కాంగ్రెస్ అధిష్ఠానం డీకే శివకుమార్ చేసిన కృషికి కనీసం 'కూలీ' (ప్రతి ఫలం) ఇవ్వాలని అభ్యర్థిస్తున్నాము' అని సంఘం అధ్యక్షుడు అన్నారు. శివకుమార్‌కు ఇచ్చిన హామీని నెరవేర్చాలని కాంగ్రెస్ అధిష్ఠానాన్ని అభ్యర్థిస్తూ, ఉప ముఖ్యమంత్రి పార్టీ కోసం జైలులో కూడా గడిపారని శ్రీనివాస్ అన్నారు. 'కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కలిగిన సైనికుడికి ఎటువంటి అన్యాయం జరగకూడదు. శివకుమార్‌కు అన్యాయం జరిగితే తీవ్రంగా పోరాడతామని వొక్కలిగ సంఘానికి చెందిన మేము నొక్కి చెబుతున్నాము' అని తెలిపారు.

వైద్య కళాశాలల్లో భారీ అవినీతి

10 రాష్ట్రాల్లో ఈడీ మెరుపు దాడులు

న్యూఢిల్లీ: వైద్య కళాశాలల అనుమతుల వ్యవహారంలో లంచాలు, గోప్య సమాచారం లీక్ కేసు దర్యాప్తులో భాగంగా దేశవ్యాప్తంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలు చేపట్టింది. గత కొంత కాలంగా దేశంలోని వివిధ వైద్య కళాశాలల్లో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతున్నట్లు విమర్శలు వస్తున్న సంగతి విదితమే. ఈ నేపథ్యంలోనే ఈడీ కీలక దర్యాప్తు చేపట్టింది. గురువారం ఏకకాలంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, రాజస్థాన్, బీహార్, ఉత్తరప్రదేశ్, దిల్లీతో సహా 10 రాష్ట్రాల్లోని 15 ప్రాంతాల్లో మెరుపు సోదాలు నిర్వహిస్తోంది. ఈ ఏడాది జూన్ 30న సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) నిబంధనల కింద ఈ సోదాలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ కేసులో నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) అధికారులతో సహా పలువురు ప్రభుత్వ అధికారులకు లంచాలు చెల్లించారని సీబీఐ తన ఎఫ్ఐఆర్‌లో ఆరోపించింది. వైద్య కళాశాలల తనిఖీలకు సంబంధించిన అత్యంత రహస్య సమాచారాన్ని సదరు అధికారులు లంచం తీసుకుని ఆయా కళాశాలల కీలక అధికారులకు, దళారీలకు చేరవేశారని ఆరోపణలు ఉన్నాయి. ఈ రహస్య సమాచారం సహాయంతో కళాశాలల యాజమాన్యాలు తనిఖీకి ముందు అవసరమైన పారామితులను, మౌలిక వసతులను తారుమారు చేసి, అక్రమంగా అకడమిక్ కోర్సులను నిర్వహించడానికి అనుమతులు పొందాయని దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. ఈ భారీ అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఈడీ బృందాలు ప్రధానంగా వివిధ రాష్ట్రాల్లో ఉన్న ఏడు వైద్య కళాశాలల ప్రాంగణాలలో తనిఖీలు నిర్వహించాయి. అంతేకాకుండా సీబీఐ ఎఫ్ఐఆర్‌లో నిందితులుగా పేర్కొనబడిన కొందరు ప్రైవేట్ వ్యక్తులు, దళారుల నివాసాలు కూడా ఈ సోదాలలో భాగంగా ఉన్నాయి. ఈ సోదాల ద్వారా పెద్ద ఎత్తున అక్రమ లావా దేవీలు, మనీలాండరింగ్ కార్యకలాపాలకు సంబంధించిన పత్రాలు, డిజిటల్ సాక్ష్యాలు లభించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

దిల్లీలో ఎన్‌కౌంటర్... గ్యాంగ్‌స్టర్ అరెస్ట్

న్యూఢిల్లీ: దిల్లీలోని ద్వారకలో గురువారం కాల్పుల ఘటన చోటుచేసుకుంది. యాంటీ నార్కోటిక్స్ సెల్‌కు, హిమాన్షు భావు గ్యాంగ్‌కు చెందిన అంకిత్‌కు మధ్య కాల్పులు జరగ్గా... అతని కుడి కాలుకు బులెట్ తగిలింది. ఈ ఎన్‌కౌంటర్ తర్వాత అంకిత్‌ను యాంటీ-నార్కోటిక్స్ విభాగం అధికారులు అరెస్టు చేశారు. గత నెల చివర్లో రోహిత్ లాంబాపై నలుగురు కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా... హిమాన్షు భావు గ్యాంగ్‌కు కాల్పులతో సంబంధం ఉన్నట్లు తేలింది. ఇప్పటికే నలుగురు నిందితులను అరెస్టు చేయగా, ఇద్దరు ప్రధాన షూటర్లు పరారీలో ఉన్నారు. పోలీసులు వారి కోసం గాలిస్తున్నారు. పరారీలో ఉన్న నిందితులను అంకిత్, దీపక్‌గా అధికారులు గుర్తించారు. ఈ ఇద్దరు నిందితులపై దిల్లీ పోలీసులు రూ.25 వేలు రివార్డు ప్రకటించారు. నజాఫ్‌గఢ్‌లోని సాయిబాబా మందిర్ సమీపంలోకి నిందితుల్లో ఒకడైన అంకిత్ వస్తున్నట్లు ద్వారకాలోని యాంటీ నార్కోటిక్స్ బృందానికి సమాచారం అందింది. ఉదయం 8 గంటల సమయంలో అంకిత్ బైక్‌పై వస్తుండగా పోలీసులు పట్టుకోవడానికి ప్రయత్నించారు. అతను తప్పించుకోవడం కోసం పోలీసులపై మూడు రౌండ్లు కాల్పులు జరిపాడు. ఒక బుల్లెట్ పోలీసు కానిస్టేబుల్ బుల్లెట్ ప్రూఫ్ జాకెట్‌ను తాకింది. ఆత్మరక్షణ కోసం పోలీసులు నిందితుడిపై మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో అతడి కాలికి గాయమైంది. ఆ తర్వాత నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు.

సమాన ప్రయోజనాలపై

బాంబే హైకోర్టుకు అగ్నివీర్ తల్లి

ముంబై: అగ్నిపథ్ కింద నియమితులైన సైనికుల కుటుంబాలకు మరణానంతర ప్రయోజనాల్లో సమానత్వం కల్పించాలని కోరుతూ అగ్నివీర్ తల్లి జ్యోతిబాయి బాంబే హైకోర్టును ఆశ్రయించారు. సాధారణ సైనికుల కుటుంబాలకు మంజూరు చేసే దీర్ఘకాలిక పెన్షన్, సంక్షేమ హక్కులను అగ్నిపథ్ సైనికులకు కేటాయించకపోవడం వివక్షతో కూడిన తిరస్కరణగా జ్యోతిబాయి పిటిషన్‌లో సవాలు చేశారు. ఈ కేసు అగ్నిపథ్ కింద జరిగిన మొదటి యుద్ధ భూమి దుర్ఘటనగా పేర్కొంటూ... న్యాయపరమైన పరిశీలన ఆవశ్యకతను పునరుద్ఘాటించారు. ఆమె కుమారుడు అగ్నివీర్ ఎం.మురళీనాయక్ జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో 851 లైట్ రెజిమెంట్‌లో పనిచేస్తున్నాడు. ఈ ఏడాది మే 9న సరిహద్దు కాల్పుల్లో అతను మరణించాడు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 కింద దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో ఈ పథకాన్ని రద్దు చేయాలని కోరుకోవడం లేదని, అయితే అగ్నివీరుల కుటుంబాలకు జీవితాంతం భద్రత నుండి మినహాయించే కార్యాచరణ పరిణామాలను సవాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అగ్నివీర్‌లకు ప్రయోజనాలు తిరస్కరించడమంటే.. ఒకే రకమైన విధులు నిర్వర్తించే, ఒకేరకమైన ప్రమాదాలు ఎదుర్కొనే రెండు వర్గాల సైనికుల మధ్య ఏకపక్ష వర్గీకరణ సృష్టించే ఆర్టికల్ 14, 21లను ఉల్లంఘించడమేనని వాదించారు. తన కుమారుడు అదే యునిఫాం ధరించాడని, అదే ప్రమాణం చేశాడని, సాధారణ సైనికునిలాగే ప్రమాదాన్ని ఎదుర్కొన్నాడని జ్యోతిబాయి పేర్కొన్నారు. అయినప్పటికీ అగ్నిపథ్ పథకం నిబంధనల కారణంగా అతని అత్యున్నత త్యాగాన్ని, అమరవీరుడైన సైనికుని కుటుంబం పొందాల్సిన ప్రతిష్ట, గౌరవం, భద్రత కోల్పోవాల్సి వస్తోందని తెలిపారు. సర్వీసులో మరణించే అగ్నివీరుల కుటుంబాలకు కుటుంబ పెన్షనస్, గ్రాట్యుటీ, మాజీ సైనికుల హోదా, ఆరోగ్య సంరక్షణ ప్రయోజనాలు, సంస్థాగత గుర్తింపును మంజూరు చేయడానికి ఆదేశాలు జారీ చేయాల్సిందిగా పిటిషన్‌లో కోరారు. అధికారిక స్మారక చిహ్నాలలో అటువంటి అమరవీరులను చేర్చాలని, అమర వీరుల గౌరవ కార్యక్రమాల్లో సమానత్వాన్ని కల్పించాలని కోరారు. తాను పూర్తిగా తన కుమారుడి ఆదాయంపై ఆధారపడ్డానని పేర్కొన్నారు. తన ఏకైక కుమారుడిని అకస్మాత్తుగా కోల్పోవడంతో తాము మానసికంగా కుంగిపోయామని, ఆర్థికంగా అభద్రతలోకి నెట్టేసిందని పేర్కొన్నారు. తన భర్త నిరుద్యోగి అని పిటిషన్‌లో తెలిపారు. పిటిషనర్ తరపున న్యాయవాది ప్రకాష్ అంబేద్కర్ హాజరుకానున్నారు.

26 లక్షల మంది ఓటర్ల పేర్లు సరిపోలడం లేదు

బెంగాల్‌లో ఎస్ఐఆర్ కసరత్తుపై ఈసీ

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్ ప్రస్తుత ఓటర్ల జాబితాలలో దాదాపు 26 లక్షల మంది ఓటర్ల పేర్లు 2002 ఓటర్ల జాబితాతో సరిపోలడం లేదని ఎన్నికల సంఘం నివేదించిందని ఒక అధికారి తెలిపారు. గత సారాంశ సవరణ (ఎస్ఐఆర్) కసరత్తులో 2002-2006 మధ్య వివిధ రాష్ట్రాలలో తయారు చేసిన వాటితో రాష్ట్ర తాజా ఓటర్ల జాబితాను పోల్చిన తర్వాత ఈ వ్యత్యాసం వెలుగులోకి వచ్చిందని ఆయన బుధవారం సాయంత్రం తెలిపారు. ఈసీ వర్గాల ప్రకారం, కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ కింద బుధవారం మధ్యాహ్నం నాటికి పశ్చిమ బెంగాల్‌లో ఆరు కోట్లకు పైగా గణన ఫారమ్‌లను డిజిటలైజ్ చేశారు. 'డిజిటలైజ్ చేసిన తర్వాత ఈ ఫారమ్‌లను మ్యాపింగ్ విధానం కిందకు తీసుకువస్తారు. అక్కడ వాటిని మునుపటి ఎస్ఐఆర్ రికార్డులతో సరిపోల్చుతారు. రాష్ట్రంలోని దాదాపు 26 లక్షల మంది ఓటర్ల పేర్లను గత ఎస్ఐఆర్ జాబితాతో ఇంకా సరిపోల్చలేమని ప్రాథమిక పరిశోధనలు చూపిస్తున్నాయి' అని ఒక అధికారి పీటీఐకి చెప్పారు. డిజిటలైజేషన్ కొనసాగుతున్నందున ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆయన అన్నారు. ఎన్నికల సందర్భంలో 'మ్యాపింగ్' అంటే 2002లో చివరిగా సంకలనం చేయబడిన ఎస్ఐఆర్ జాబితాలతో తాజాగా ప్రచురించబడిన ఓటరు జాబితాను తనిఖీ చేయడానికి సూచిస్తుంది. ఈ సంవత్సరం మ్యాపింగ్ కసరత్తులో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఓటరు జాబితాలు కూడా చేర్చబడ్డాయి. మరింత సమగ్రమై, కచ్చితమైన ధ్రువీకరణ ప్రక్రియను నిర్ధారించడానికి ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం తీసుకున్న చర్య అని ఆయన తెలిపారు. అయితే మ్యాపింగ్‌లో వ్యత్యాసాలు ఉంటే తుది ఓటర్ల జాబితా నుంచి స్వయంచాలకంగా తొలగించబడటం కాదని అధికారి స్పష్టం చేశారు.

ఓటర్ల తనిఖీకి ఏఐ సాధనమా?

ఎస్ఐఆర్ కసరత్తుపై ఈసీని ప్రశ్నించిన టీఎంసీ

కోల్‌కతా: ఓటర్ల జాబితాపై కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కు ఓటర్ల ధ్రువీకరణ కోసం కృత్రిమ మేధస్సు ఆధారిత (ఏఐ) యాప్‌ను ఉపయోగించాలనే ఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని పశ్చిమ బెంగాల్‌లోని అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ప్రశ్నించింది. 'ఇప్పుడు బెంగాల్ ఎస్ఐఆర్ కసరత్తు సమయంలో వారు 'ఏఐ యాప్' ను ఉపయోగిస్తారని ఈసీ చెబుతోంది. సాధారణంగా ఈ యాప్‌ను ఎవరు తయారు చేశారు. దాని కార్యాచరణకు సంబంధించిన వివరాలు లేవు' అని తృణమూల్ రాజ్యసభ ఎంపీ సాకేత్ గోఖలే గురువారం అన్నారు. 'వెండర్లు, డెవలపర్లు ఎవరు? ఏఐ యాప్ పక్షపాతం చూపేందుకే రూపొందించబడిందా? ఇప్పటికే ఉన్న పీడీఎఫ్ సాఫ్ట్‌వేర్ సులభంగా చేయగలిగినప్పుడు నకిలీ ఎంట్రీలను శోధించడానికి కృత్రిమ మేథ ఎందుకు అవసరం' అని సాకేత్ నిలదీశారు. బహుళ ప్రదేశాలలో నమోదయిన ఓటర్లను గుర్తించడంలో సహాయపడటానికి ఈసీ ఏఐ ఆధారిత యాప్‌ను ప్రవేశపెట్టింది. ఏఐ సాధనం ఓటరు వివరాల్లో ఫోటోగ్రాఫర్‌ల ముఖ సారూప్యతలను విశ్లేషిస్తుంది. చనిపోయిన ఓటర్లు, వివిధ రాష్ట్రాల్లోని బహుళ నియోజకవర్గాలలో, ఒకే నియోజకవర్గంలోని వేర్వేరు పోలింగ్ కేంద్రాలలో నమోదయిన ఓటర్లను వేర్వేరు రాజకీయ పార్టీలు గుర్తించాయి. 'ఓటు దొంగతనం ఆరోపణపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తన మూడు వివరణాత్మక ప్రదర్శనలలో నియోజకవర్గాలలో ఓటరుగా నమోదు చేసుకున్న తీరును ఉదహరించారు. అయితే రాహుల్ చేసిన ఆరోపణలను ఈసీ ఖండించింది. బెంగాల్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ ఓటర్లు, బూత్ లెవెల్ ఆఫీసర్ల (బీఎల్‌వోలు) మరణాలు, సాంకేతిక సమస్యలు, బీఎల్‌వోలలో ఒక వర్గం నిరసనలతో వివాదాలతో నిండిపోయింది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈ ప్రక్రియను వ్యతిరేకించారు. ప్రస్తుతానికి బెంగాల్‌లో ఈ 'ఏఐ యాప్' వివరాలను ఈసీ ఎందుకు దాచిపెడుతోంది? ఈ అనుమానాస్పద యాప్‌ను బీజేపీతో సంబంధాలు ఉన్న ఎవరైనా అభివృద్ధి చేయలేదని హామీ ఏమిటి? ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకత లేదు. దీనిని చాలా అనుమానాస్పద రీతిలో హడావిడిగా చేస్తున్నారు. ఈసీ ఎందుకు స్పష్టంగా చెప్పడం లేదు?' అని సాకేత్ ప్రశ్నించారు.

కొత్త కార్మిక కోడ్‌లు

వెంటనే రద్దు చేయాలి

ఏఐయుడబ్ల్యూసీ డిమాండ్

న్యూఢిల్లీ: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త కార్మిక కోడ్‌లను వెంటనే రద్దుచేయాలని అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల కాంగ్రెస్ (ఏఐయుడబ్ల్యుసి) డిమాండ్ చేసింది. గురువారం ఏఐయూడబ్ల్యూసీ అధ్యక్షుడు ఉదిత్‌రాజ్ విలేకరులతో మాట్లాడారు. లేబర్‌కోడ్‌లు కార్మిక వ్యతిరేకమని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా కార్మిక కోడ్‌లకు వ్యతిరేకంగా ఉద్యమం ప్రారంభించ నున్నట్లు చెప్పారు. కొత్త కార్మిక కోడ్‌లు ప్రమాదకరమైన ధోరణికి నాంది పలుకుతాయని పేర్కొంటూ, కార్మికుల ప్రయోజనాలను, ముఖ్యంగా అసంఘటిత కార్మికుల ప్రయోజనాలను కాపాడే పాత కార్మిక చట్టాలను ఖూనీ చేశారని దుయ్యబట్టారు. 44 కోట్ల మంది అసంఘటిత కార్మికులను పెద్ద కార్పొరేట్లు, ఆశ్రిత పెట్టుబడిదారుల దయాదాక్షిణ్యాలకు వదిలేశారన్నారు. కొత్త కోడ్‌ల ద్వారా కార్మిక హక్కుల్ని కాలరాశారని, వారు ఇకపై సమ్మె చేయలేరన్నారు. నాలుగు లేబర్‌కోడ్‌లు కార్మికులకు అత్యంత హానికరమని, కార్మిక హక్కుల్ని పూర్తిగా హరిస్తాయని తెలిపారు. కార్మికుల ఉద్యోగ భద్రతను కాలరాయడమేకాక కార్పొరేట్ల ప్రయోజనాలకు కొమ్ముకాస్తాయని ఉదిత్‌రాజ్ ధ్వజమెత్తారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం ఈ కార్మిక వ్యతిరేక కొత్త కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో వృత్తి భద్రత, ఆరోగ్యంపై గతంలో కఠినమైన చట్టాలు ఉండేవని, కానీ ఇప్పుడు తనిఖీ వ్యవస్థను రద్దు చేశారని... చాలా సరళతరమైన చట్టాన్ని ప్రవేశపెట్టారని రాజ్ అన్నారు. తనిఖీ వ్యవస్థ బలహీనపడటం వల్ల కార్మికుల శ్రమ దోపిడీ పెరుగుతుందని, యజమానులు అనేక చట్టపరమైన పరిమితుల నుండి మినహాయింపులు పొందుతారని ఆయన ఆరోపించారు.

సీట్ల సర్దుబాటుపై ఉద్ధవ్, రాజ్ చర్చలు

ముంబై: శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే గురువారం ముంబైలో మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) అధ్యక్షుడు రాజ్ ఠాక్రేను కలిశారు. రాబోయే మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు సీట్ల పంపకాల ఏర్పాట్లపై ఇద్దరు నాయకులు చర్చించినట్లు తెలుస్తోంది. ఉద్ధవ్ సెంట్రల్ ముంబైలోని దాదర్‌లోని రాజ్ నివాసం 'శివతీర్థం' ను సందర్శించారు. ఒకప్పుడు రాజకీయంగా విడిపోయిన బంధువుల మధ్య ఈ సంవత్సరం జరిగిన వరుస సమావేశాలలో ఇది తాజాది. ఇటీవలి కాలంలో వారి పార్టీల మధ్య సయోధ్య, పొత్తుకు సంకేతాలు వస్తున్న నేపథ్యంలో వారు ఒకరికొకరు సన్నిహితంగా ఉంటున్నారు. శివసేన (యూబీటీ), ఎంఎన్ఎస్ ఇంకా అధికారికంగా పొత్తును ప్రకటించనప్పటికీ, ఠాక్రే బంధువులు స్థానిక సంస్థల ఎన్నికలకు, ముఖ్యంగా కీలకమైన బృహన్ ముంబై మునిసిపల్ కార్పొరేషన్ (బీఎంసీ), ముంబై మెట్రోపాలిటన్ ప్రాంతం, పూణే, నాసిక్‌లోని ఇతర పౌర సంస్థల ఎన్నికలకు త్వరలో పొత్తు కుదుర్చుకునే సూచనలు ఇచ్చారు. ఈ సమావేశంలో ఉద్ధవ్, రాజ్ పౌర ఎన్నికలకు తమ పార్టీల మధ్య సీట్ల పంపకం, ఓటర్ల జాబితాలో జరిగిన అక్రమాల గురించి చర్చించారని భావిస్తున్నట్లు శివసేన (యూబీటీ) నాయకుడు ఒకరు వెల్లడించారు. ప్రతిపక్షాలు ఈ అంశాన్ని తీవ్రంగా లేవనెత్తుతున్నాయి. శివసేన (యూబీటీ) భాగస్వామి అయిన కాంగ్రెస్... ఎంఎన్ఎస్‌తో పొత్తును ప్రతిఘటిస్తున్నట్లు నివేదించబడిన విషయాన్ని కూడా వారు చర్చించారని ఆయన అన్నారు. కాగా ఈ వారం ప్రారంభంలో ఉద్ధవ్, రాజ్ ముసాయిదా ఓటర్ల జాబితాలో అభ్యంత రాలు, సూచనలను సమర్పించడానికి మరింత సమయం కోరుతూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి లేఖ సమర్పించారు. మహారాష్ట్ర ప్రస్తుతం గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహిస్తోంది. డిసెంబరు 2న 246 మునిసిపల్ కౌన్సిల్‌లు, 42 నగర పంచాయతీలకు ఎన్నికలు జరుగుతాయి. వాటి తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా 336 పంచాయతీ సమితిలు, 32 జిల్లా పరిషత్‌లు, 29 మునిసిపల్ కార్పొరేషన్‌లకు ఎన్నికలు (షెడ్యూల్ ఇంకా ప్రకటించలేదు) జరుగుతాయి. జనవరి 31 నాటికి మొత్తం స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలి.

కోర్టు మాయాజాలం చేయలేదుగా!

దిల్లీ కాలుష్యంపై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: దిల్లీ-నేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్సీఆర్) ప్రాంతంలో గాలి నాణ్యత రోజురోజుకూ దిగజారుతోంది. దీనిపై దాఖలైన పిటిషన్‌ను స్వీకరించిన సుప్రీంకోర్టు డిసెంబర్ 3న విచారిస్తామని వెల్లడించింది. ఈ సమస్యను నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని న్యాయస్థానం అభిప్రాయపడింది. పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, ఇది ఆరోగ్య అత్యవసర పరిస్థితి అని సీనియర్ న్యాయవాది అపరాజితా సింగ్ చేసిన వాదనను కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చితో కూడిన ధర్మాసనం ఈ అంశాన్ని విచారణ చేపట్టింది. 'ఒక న్యాయస్థానం ఏం మాయాజాలం చేయగలదు? దిల్లీ-ఎన్సీఆర్‌కు ఇది ప్రమాదకరమని తెలుసు. అయితే, పరిష్కారం ఏమిటనేదే ఇక్కడ ముఖ్యం. దీనికి గల కారణాలు గుర్తించాలి. పరిష్కారాలు కేవలం ఆ రంగంలోని నిపుణుల నుంచే లభిస్తాయి. దీర్ఘకాలిక పరిష్కారాలు లభిస్తాయని మేం ఆశిస్తున్నాం' అని ప్రధాన న్యాయమూర్తి అన్నారు. గతంలో తీవ్రమైన వాయు కాలుష్యం కారణంగా దిల్లీలోని పాఠశాలల్లో క్రీడా కార్యక్రమాలు వాయిదా వేయాలని కోర్టు సూచించింది. 'గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్' (జీఆర్ఏపీ) కింద ఏడాది పొడవునా ఆంక్షలు విధించడానికి నిరాకరించిన న్యాయస్థానం... దీర్ఘకాలిక, స్థిరమైన పరిష్కారాలపై దృష్టి పెట్టాలని సూచించింది.

సెక్స్ వర్కర్లలో ఎస్ఐఆర్ భయం

కోల్‌కతా: ఆసియాలోనే అతిపెద్ద రెడ్ లైట్ ఏరియా అయిన పశ్చిమ బెంగాల్‌లోని సోనాగాచిలో కొత్త చిక్కు వచ్చి పడింది. అక్కడున్న సెక్స్ వర్కర్లు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఇప్పుడు వాళ్లు పాత పెట్టెలు, బీరువాలు తెరుస్తున్నారు. ప్రతి సెక్స్ వర్కర్ ఒక పత్రం కోసం వెతుకుతున్నారు. వారి గుర్తింపు కార్డు లేదా వారి గుర్తింపును నిరూపించే ఇతర పత్రాల కోసం వెతుకుతున్నారు. విషయం ఏమంటే... బెంగాల్ ఎన్నికలకు ముందు ఎన్నికల కమిషన్ ఎస్ఐఆర్ ప్రారంభించింది. అది సెక్స్ వర్కర్లను భయభ్రాంతులకు గురిచేస్తోంది. దాదాపు 10 వేల మంది సెక్స్ వర్కర్లకు సోనాగాచి నిలయంగా ఉంది. ఇక్కడ చాలామంది బాలికలు, మహిళలు ఉన్నారు. ఇందులో చాలామందికి తండ్రి, చిరునామా లేదా ఇంటి చిరునామా లేదు. ఎస్ఐఆర్ కోసం ఎన్నికల కమిషన్ అడుగుతున్న పత్రాలు వీరి వద్ద లేవు. ముఖ్యంగా 2002 ఓటర్ల జాబితా నుంచి ఇప్పటి వరకు వీళ్లకు సంబంధించి కుటుంబ వివరాల రుజువులు ఉనికిలో లేవని చెబుతున్నారు. ఇక్కడున్న మహిళలు, యువతులు, బాలికలు వివిధ పరిస్థితులు, మార్గాల ద్వారా సోనాగాచికి వస్తారు. వారిలో చాలామందికి విషాదకరమైన కథలు ఉన్నాయి. ఇక్కడికి వచ్చే చాలామంది మహిళలు అక్రమ రవాణాకు గురైనవారే అని చెబుతున్నారు. మహిళలు ఇంటి నుంచి పారిపోయి ఇక్కడ వ్యభిచార కూపంలో చిక్కుకుంటున్నారు. వారి వద్ద తమ సొంత సమాచారం ఉన్నప్పటికీ... ఎన్నికల సంఘం విడుదల చేసిన 2002 ఓటరు జాబితా నుంచి వారి తల్లిదండ్రుల వివరాలను తిరిగి పొందడం వారికి అసాధ్యంగా మారింది. దీంతో వారికి ఓటు నమోదు కుదిరేలా కనిపించడం లేదు.

విశాలాంధ్ర హైదరాబాద్

బీసీల రిజర్వేషన్లు తగ్గించింది బీఆర్ఎస్సే

కేటీఆర్ వ్యాఖ్యలపై సీతక్క స్పందన

విశాలాంధ్ర - హైదరాబాద్ : బీసీ రిజర్వేషన్లను కాంగ్రెస్ ప్రభుత్వం 17 శాతానికి తగ్గించిందన్న కేటీఆర్ వ్యాఖ్యలు పూర్తిగా అసత్యమని, బీసీ రిజర్వేషన్ల అంశంపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న అబద్ధాల ప్రచారాన్ని ప్రజలు నమ్మరని పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. గురువారం ప్రజాభవన్లో మంత్రి సీతక్క మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితోనే కుల గణన, రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తిచేసిందని పేర్కొన్నారు. 2014లో జరిగిన స్థానిక ఎన్నికల్లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, అయితే 2019లో బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 22 శాతానికి తగ్గించి బీసీల గొంతు కోసిందని ఆమె స్పష్టం చేశారు. బీసీలకు జరిగిన ఈ అన్యాయాన్ని బీసీ ప్రజలు ఎప్పటికీ మర్చిపోరన్నారు. 2019 స్థానిక ఎన్నికల్లో రాష్ట్రం యూనిట్‌గా సర్పంచ్ల రిజర్వేషన్లను టీఆర్ఎస్ ఖరారు చేయగా, ఆ విధానాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టిందని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం సర్పంచ్ రిజర్వేషన్లకు మండల యూనిట్‌గా, వార్డు సభ్యుల రిజర్వేషన్లకు గ్రామపంచాయతీ యూనిట్గా పరిగణలోకి తీసుకోవడం జరిగిందన్నారు. రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు బీసీలకు న్యాయం చేయాలనే సంకల్పంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగిందని తెలిపారు. కుల గణనను పూర్తి చేసి, అసెంబ్లీలో తీర్మానం ఆమోదించి, సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేశామని, ఆ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగానే రిజర్వేషన్లు ఖరారు అయినట్లు తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు అనుసరించి 50 శాతం రిజర్వేషన్ పరిమితిని తప్పనిసరిగా పాటించాల్సి వచ్చిందని మంత్రి అన్నారు. కొన్ని మండలాల్లో ఎస్సీ ఎస్టీ జనాభా అధికంగా ఉండటంతో ఆ పరిమితిని దాటి పోకుండా ఉండేందుకు బీసీ రిజర్వేషన్లలో కొంత మార్పు జరిగినట్లు స్పష్టం చేశారు. సర్పంచుల రిజర్వేషన్లకు మండలాన్ని, వార్డు సభ్యులకు గ్రామాన్ని, జడ్పీటీసీలకు జిల్లాను, జడ్పీ చైర్మన్లకు రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకున్నామని వివరించారు. బీఆర్ఎస్ నేతలు బీసీల మంచిని కోరుకునే పరిస్థితిలో లేరని మంత్రి సీతక్క పేర్కొన్నారు. కుల గణనలో బీఆర్ఎస్ పాల్గొనలేదని గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్లు నిలిచిపోవాలని కోర్టుల్లో అడ్డంకులు సృష్టించిన పార్టీ బీఆర్ఎస్సేనని ఆమె పేర్కొన్నారు. కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడానికి స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో జంతర్ మంతర్ వద్ద చేసిన ధర్నాకు కూడా బీఆర్ఎస్ మద్దతు ఇవ్వలేదని గుర్తుచేశారు. భద్రాచలం, ములుగు, ఆదిలాబాద్ వంటి ఏజెన్సీ ప్రాంతాల్లో పీసా చట్టం మరియు సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం జనాభా ప్రాతిపదికన 100 శాతం గిరిజనులకు రిజర్వేషన్ల కేటాయింపు జరిగిందని, ఇది రాజ్యాంగబద్ధమైన హక్కు అని మంత్రి స్పష్టం చేశారు. కొత్తగా ఏర్పడిన తండాలు, గూడేలు గ్రామపంచాయతీలుగా మారడంతో గిరిజన సీట్ల సంఖ్య సహజంగా పెరిగిందని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు రాజకీయ ప్రయోజనాల కోసం కులాల మధ్య విభేదాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని, బీసీల గొంతు కోసింది ఎవరు, కుల గణనను అడ్డుకుంది ఎవరు, రిజర్వేషన్లపై అడ్డంకులు సృష్టించింది ఎవరు అన్న ప్రశ్నలకు బీఆర్ఎస్ సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చిందని మంత్రి సీతక్క అన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పోరాటం ఆగదని, కేంద్రంపై మరింత ఒత్తిడి తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

బీసీ రిజర్వేషన్లలో ప్రభుత్వం మోసం : ఎంపీ

విశాలాంధ్ర-బషీర్‌బాగ్: బీసీలకు స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని వాగ్దానాలు చేసి జీవో తీసి ఎవరికి చెప్పా చేయకుండా 23 శాతంకు తగ్గించి అమలు చేసేటప్పుడు 17 శాతంకు తగ్గించడం అన్యాయమనీ తెలంగాణా బీసీ జాక్ చైర్మన్, ఎంపీ ఆర్.కృష్ణయ్య అన్నారు. దిన్ని నిరసిస్తూ తెలంగాణా బీసీ జాక్ ఆధ్వర్యంలో నిజాం కాలేజి నుండి అంబేద్కర్ విగ్రహం వరకు వందలాది మందితో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనకు రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం కన్వీనర్ మోదీ రాందేవ్, రాష్ట్ర బి.సి యువజన సంఘం అధ్యక్షులు అంజి ఆధ్వర్యంలో జరిగింది. కృష్ణయ్య మాట్లాడుతూ స్థానిక సంస్థ రిజర్వేషన్లు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఊరువాడ ఏకం చేసి కాంగ్రెస్ పార్టీ ఇంటింటా ప్రచారం చేసిందన్నారు. స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని - కామారెడ్డి డెక్లరేషన్ చేశారు. పంచాయతీ రాజ్ సంస్థలలో బీసీలకు 42 శాత రిజర్వేషన్లు కల్పిస్తామని, కోట్ల కరపత్రాల ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని అన్నారు. 42 శాతం కల్పిస్తూ రాజ్యాంగ బద్దంగా జీవో నెంబర్ 9 జారీ చేశారన్నారు. బీహార్ ఎన్నికలు ముగియగానే చడి చప్పుడు కాకుండా రిజర్వేషన్లను 42 శాతం నుంచి 22 శాతం తగ్గిస్తూ మరో జీవో నెంబర్ 46 జారీ చేశారన్నారు. అమలు చేయడంలో 17 శాతం తగ్గించి తీవ్ర అవక-తవకలు పాల్పడ్డారనీ ఆరోపించారు. జీవో 46 కారణంగా సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాల కేటాయింపులో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని పేర్కొన్నారు.
పలు జిల్లాల్లో, అనేక మండలాల్లో, గ్రామాల్లో బీసీలకు ఒక్క సర్పంచ్ లేదా వార్డు సభ్యుని సీటు కూడా కేటాయించలేదని దాదాపు 1200 సర్పంచ్ పదవులు దక్కకుండా పోయాయన్నారు. కార్యక్రమంలో బి.సి. నాయకులూ జాతీయ బి.సి సంక్షేమ సంఘం కోఆర్డినేటర్ ర్యాగ అరుణ్ కుమార్, మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు కొండ దేవయ్య, రాష్ట్ర సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు భూమన్న యాదవ్, తెలంగాణా బి.సి సంక్షేమ సంఘంవర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, అనంతయ్య, పగిళ్ళ సతీష్, అంజి గౌడ్, నిఖిల్, బాలస్వామి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ ఎన్నికల్లో సీపీఐ, సీపీఎం పరస్పర అవగాహన

విశాలాంధ్ర-హైదరాబాద్ : గ్రామపంచాయతీ ఎన్నికలలో సిపిఐ , సిపిఎం పార్టీలు పరస్పర అవగాహనతో ఒకరిపై ఒకరు పోటీ చేయకుండా ఉండాలని ఈరోజు హైదరాబాదులో సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సిపిఐ సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుల సమావేశంలో నిర్ణయించడం జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, సిపిఐఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సిపిఐ సీనియర్ నాయకులు చాడ వెంకట్ రెడ్డి, సయ్యద్ అజీత్ పాషా, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కల్లపల్లి శ్రీనివాసరావు, ఈటి నరసింహ, సిపిఎం రాష్ట్ర నాయకులు ఎస్. వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, జి. నాగయ్య, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, వి.ఎస్ బోస్ లతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గ్రామపంచాయతీ కి జరుగుతున్న సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలలో సిపిఐ సిపిఎం పరస్పర అవగాహనతో ఒకరిపై ఒకరు పోటీ చేయకూడదని నిర్ణయించారు. అదేవిధంగా ఖమ్మం జిల్లా సిపిఐఎం రాష్ట్ర నాయకులు సామినేని రామారావు హత్యకు గురై నెలరోజులు కావస్తున్న పోలీసులు హంతకులను పట్టుకోలేదని, కేసు విషయంలో ఎలాంటి పురోగతి లేదని,వెంటనే ఈ కేసును వేగవంతంగా దర్యాప్తు చేయాలని, దోషులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సిపిఐ సిపిఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అకౌంట్స్ ఆఫీసర్ రాంమోహన్‌కు సన్మానం

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : మేడ్చల్ మల్కాజి గిరి జిల్లా కలెక్టరేట్ అకౌంట్స్ ఆఫీసర్ రాంమోహన్ కీసర ఆర్డిఓ కార్యాలయా నికి డిప్యూటేషన్ పై వెళుచున్నందున కలెక్టరేట్ జిల్లా ఎస్సీ అభివృద్ధిశాఖ అధికారి, తెలంగాణ గజిటెడ్ ఆఫీసర్స్ సంఘం అధ్యక్షులు వినోద్ కుమార్ ఆధ్వర్యంలో వివిధ శాఖల జిల్లా అధికారులు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు మాట్లాడుతూ ఎఓ పనితనాన్ని, సహకారాన్ని, మంచితనాన్ని కొనియాడారు. అనంతరం ఎఓరాంమోహన్ ను పుష్పగుచ్చాలతో, శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ సాంబశివరావు, సిపిఓ శేఖర్, జిల్లా ఇంటర్మీడియోట్ అధికారి కిషన్, డిఈఓ విజయకుమారి, బిసి వెల్ఫేర్ అధికారి ఝాన్సీలక్ష్మి, డిసిఓ వెంకట్ రెడ్డి, ఎల్డిఎం శివప్రసాద్, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రేపు జిల్లా స్థాయి క్రీడల నిర్వహణ

విశాలాంధ్ర-హైదరాబాద్ : దివ్యాంగులకు 29న జిల్లా స్థాయి క్రీడల నిర్వహించనున్నట్లు దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఎడి రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవము-2025 పురస్కరించుకొని నవంబర్ 29 న విక్టోరియా ప్లే గ్రౌండ్, చాదర్‌ఘాట్, హైదరాబాద్ నందు ఉదయం 9.00 గంటలకు జిల్లాలోని దివ్యాంగుల అందరికి జూనియర్స్ (10-18సం.,) సీనియర్స్ (18-54సం.,) విభాగాలలో ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇట్టి ఆటల పోటీలో పాల్గొనే దివ్యాంగులు (శారీరక, అంధ, బధిర, మానసిక వికలాంగుల) పుట్టిన తేదీ, నిర్ధారణ కోసం సదరమ్ సర్టిఫికేట్ అలాగే ఆధార్ కార్డ్ జిరాక్స్ తో పాటు కార్యాలయానికి వచ్చి తమ పేర్లను నమోదు చేసుకోగలరని అలాగే దీనికి సంబంధించి పూర్తి వివరాలకు ఫోను నంబరు: 9640452773 ద్వారా కూడా సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లాలోని దివ్యాంగులు (శారీరక, అంధ, బధిర, మానసిక వికలాంగుల) మరియు వారి కొరకు పనిచేసే స్వచ్ఛ%శీ%ద సంస్థలు, దివ్యాంగుల సంఘ నాయకులు అధిక సంఖ్య లో పాల్గొని ఇట్టి క్రీడా వేడుకలను విజయవంతం చేయవలసిందిగా ఎడి ఒక ప్రకటన లో తెలిపారు.

లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-కాప్రా : తన పుట్టినరోజు పురస్కరించుకుని గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా మొక్కను నాటిన ఉప్పల్ శాసనసభ సభ్యులు బండారి లక్ష్మా రెడ్డి గురువారం మల్లాపూర్ వీఎస్ఆర్ గార్డెన్లో అభిమానులు, కార్యకర్తలు మధ్య జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మా రెడ్డి మాట్లాడుతూ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ అన్న గ్రీన్ ఇండియా ఛాలెంజ్ అనే చాలా మంచి కార్యక్రమాన్ని చేపట్టారని ఈ మొక్కలు నాటడం అంటే మాకు చాలా సంతోషం కలుగుతుందని ఒకప్పుడు హైదరాబాదులో ఎక్కడ చెట్టు కనిపించేది కాదని కానీ ఈ రోజు ఎక్కడ చూసినా కూడా పచ్చని చెట్ల తోనే కనిపిస్తుందని మన మాజీ ముఖ్యమంత్రి గారు చేపట్టిన హరిత హారం స్ఫూర్తితో ఈ రోజు నగరం అంతా పచ్చగా మారిపోయిందని మనందరం మంచి ఆరోగ్యంతో ఉండాలంటే మంచి వాతావరణం అవసరమని కాబట్టి దీన్ని అందరూ బాధ్యతగా తీసుకొని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉప్పల్ నియోజికవర్గ నాయకులు , కార్యకర్తలు, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ప్రతినిధి శ్రవణ్ పాల్గొన్నారు.

పేదలకు ఉచిత వైద్యమే లక్ష్యం: కిషోర్‌రెడ్డి

విశాలాంధ్ర-దుండిగల్: పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించడమే లక్ష్యంగా పనిచేస్తానని కాంగ్రెస్ రాష్ట్ర యువ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి చర్చ్ గాగిలాపూర్ గ్రామంలో బికెర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 7వ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఈ విధంగా ఉచిత సేవలందించడం చాలా అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఎల్లప్పుడు ప్రజల మధ్యలో ఉంటూ వారి సమస్యలు తెలుసుకుంటూ వాటిని పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అధికంగా పేద ప్రజలు నివసించే బస్తీలు,కాలనీలలో బికేఆర్ ట్రస్టు ద్వారా ఈ వైద్య సేవలు మరింత వేగవంతం చేస్తామని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకర్ రెడ్డి, కావాలి గణేష్,ప్రేమ్ కుమార్,షఫి,రాము యాదవ్,గజా, లింగం గౌడ్,ప్రదీప్ రెడ్డి,సతీష్ రెడ్డి,వినోద్ రెడ్డి,సుధీర్ రెడ్డి, నవీన్ రెడ్డి,ప్రదీప్ రెడ్డి,పులి రాజా కోటి,జోసెఫ్ రెడ్డీ, బాలరాజ్ రెడ్డి,అశోక్ రెడ్డి,జైపాల్ రెడ్డి,కాలనీ వాసులు గ్రామ ప్రజలు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటి డిఎం అండ్ హెచ్ఓ లావణ్య బాధ్యతలు

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు చెందిన డా.సి.ఎచ్.లావణ్య రెడ్డి సిఏఎస్, మెడికల్ ఆఫీసర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శ్రీరంగవరంలో విధులు నిర్వహిస్తున్న ఆమెకు డిప్యూటీ సివిల్ సర్జన్ హోదాకు పదోన్నతి లభించింది. ఈ పదోన్నతి అనంతరం మల్కాజిగిరి విభాగానికి డెప్యూటీ జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారిగా ఆమె నియమితులయ్యారు. గురువారం ఆమె తన కొత్త పదవిలో బాధ్యతలు స్వీకరించగా, కార్యాలయ సిబ్బంది ఆమెను ఆప్యాయంగా స్వాగతించారు. జిల్లా వైద్య ఆరోగ్యఅధికారి డా సి.ఉమా గౌరీ ఆదేశాలని అనుసరిస్తూ, మల్కాజిగిరి డివిజన్‌లో వైద్య సేవలను మరింత బలోపేతం చేస్తానని డా.లావణ్య రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డా.సుష్మ, హెల్త్ ఎడ్యుకేటర్ వేణుగోపాల్, డిపిఎంఓ జోసఫ్, పిఎంఓఓ మోజోద్దీన్, సిహెచ్ఓ మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బీసీలను మోసం చేశారు: శ్రీనివాస్‌గౌడ్

విశాలాంధ్ర-బషీర్ బాగ్: ప్రజా పాలన పేరుతో బీసీలను నమ్మించి మోసం చేశారనీ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు.రెండు సంవత్సరాల కాలయాపన చేసి రాహుల్ గాంధీ ఆలోచన విధానాన్ని అమలు చేస్తామని మాట తప్పారన్నారు. గురువారం తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ, తెలంగాణ ప్రజాప్రతినిధుల ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో గన్ పార్క్ వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రెండు సంవత్సరాలుగా 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని బీసీలను మోసం చేశారని మండిపడ్డారు.జీవో 46 అమలు చేయడంలో తీవ్ర అన్యాయం చేస్తున్నారని స్థానిక సంస్థలు ఎన్నికలు తక్షణమే రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు.42 శాతం రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 12735 గ్రామ పంచాయతీల్లో కేవలం 2176 బీసీలకు రిజర్వేషన్లు కల్పించారనీ అన్నారు.బీసీలను రాజకీయంగా తీవ్ర అన్యాయానికి గురి చేశారన్నారు. రిజర్వేషన్లు పెంచుతామనీ తగ్గించారనీ ఆవేదన వ్యక్తం చేశారు.బీసీలను తడి బట్టతో గొంతు కోశారనీ, కులగణన లెక్కలను బయట పెట్టాలన్నారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెల్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాల న్నారు. ఇండియా కూటమికి 200 పైగా ఎంపీలు ఉన్నారు ఎక్కడ పార్లమెంట్లో మాట్లాడడం లేదని ఆరోపించారు.రాబోయే పార్లమెంట్ సమావేశాలను స్తంభింపజేయాలని కోరారు. లేనిపక్షంలో గుణపాఠం తప్పదన్నారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, తెలంగాణ ప్రజా ప్రతినిధుల ఫోరం యాదయ్య, రాజు ,కుమార్ రవి, జగదీష్, ప్రవీణ్ ,వినోద్ తదితరులు పాల్గొన్నారు.

జనరల్ స్థానాల్లో పోటీ చేద్దాం

తెలంగాణ బీసీ పొలిటికల్ ఫ్రంట్ పిలుపు

విశాలాంధ్ర- బషీర్ బాగ్: జనరల్ స్థానాల్లో పోటీ చేద్దాం అనిఅగ్ర కులాలను ఓడిద్దామని తెలంగాణ బీసీ పొలిటికల్ ఫ్రంట్ పిలుపునిచ్చింది. గురువారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్ తో కలసి చైర్మన్ బాలగోని బాలరాజ్ గౌడ్ మాట్లాడారు. కామారెడ్డిలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కర్ణాటక బీసీ ముఖ్యమంత్రి సిద్దరామయ్య తో చెప్పించి, మేనిఫెస్టోలో పెట్టించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్లపై హై కోర్ట్ లో కేసు పెండింగ్ ఉండగానే జీవో 46 తీసుకవచ్చి సర్పంచు ఎన్నికలకు పోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ బీసీ ప్రజా ప్రతినిధులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీసీ బిడ్డ అయిన నల్గొండ డీసీసీ కైలాష్ ను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అవమానకరంగా మాట్లాడిన తీరు చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వంలో బీసీలకు ఎలాంటి ప్రాధాన్యత ఇస్తుందో తెలుస్తుందన్నారు.ఫ్రంట్ కన్వీనర్ వెంకన్న గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి బీసీల గొంతు కోశారని, జనరల్ స్థానాల్లో బీసీలను నిలబెట్టి గెలిపించుకుంటామని ఆయన అన్నారు. కాంగ్రెస్, బిజెపి, బీఆర్ఎస్ పార్టీలు ఏకమై బీసీలపై కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. 60 శాతం జనాభా ఉన్న బీసీలకు 17శాతం కేటాయించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. 11 , 14 ,17 తేదీల్లో జరిగే సర్పంచ్ ఎన్నికలకు బీసీలను చైతన్యపరిచి ఒకే వేదికపై తీసుకువచ్చి జనరల్ స్థానాలలో నిలబెట్టి గెలిపించుకుంటామని ఆయన అన్నారు. ఓ బీసీ మేలుకో నీ గ్రామాన్ని ఏలుకో అని అయిలి వెంకన్న పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫ్రంట్ నేతలు అంబాల నారాయణ గౌడ్, విజయ్ కుమార్ గౌడ్, దుర్గయ్య, రాజ్, నాగ భూషణం, బోయ గోపి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: కానామేట్ సర్వేనెంబర్ 41/ 12 41/13. ప్లాట్ నెంబర్ 7. 8.9 సుమారు 600 గజాల ప్రభుత్వ అసైన్డ్ ల్యాండ్. లో అక్రమంగా మూడు ఫ్లోర్లు స్లాబ్లు వేసి నిర్మిస్తున్నారు. ప్రభుత్వ భూమిలో. ఎతెచ్చగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు బిల్డర్స్ కబ్జాలు చేసి బౌలా అంతస్తులు నిర్మిస్తుంటే అటువైపు కన్నెత్తి కూడా చూడని అధికారులు. ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్నటువంటి నిర్మాణాలను ఆపి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని.. ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని శేరిలింగంపల్లి తహసిల్దార్ గారికి ఈరోజు స్థానికులు సయ్యద్ కరీం తదితరులు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. తక్షణమే పనులను ఆపకపోతే కలెక్టర్ గారి దృష్టికి తీసుకెళ్లి ఆందోళన కార్యక్రమం చేపడతాం అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజా సమస్యలపై కార్పొరేటర్ పాదయాత్ర

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని రాయదుర్గం గ్రామం లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయిస్తామని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి తెలిపారు. రాయదుర్గం గ్రామం లోనీ ప్రజలు ఇటీవల తాము ఎదుర్కొంటున్న సమస్యలను కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి గారు దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఈ రోజు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నేతలతో కలిసి సమస్యలపై ఈరోజు గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి తక్షణమే స్పందించి అక్కడే ఉన్న అధికారులకు వాటిని నోట్ చేసుకొని వీలైనంత త్వరగా అందుకు అవసరమైన నిధులు కేటాయించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యుఎస్ డీజీఎం నరేందర్ రెడ్డి, జిహెచ్ఎంసీ ఇంజనీరింగ్ ఈఈ శిరీష , ఏ ఎం ఓ హెచ్ శ్రీకాంత్ రెడ్డి, ఎంటమాలజీ ఏఈ తనూజ, సీనియర్ నాయకులు అనిల్ గౌడ్, నరేందర్ ముదిరాజ్, నందు ,కృష్ణ ముదిరాజ్, కృష్ణ యాదవ్, నరేందర్ యాదవ్, శ్యామ్ యాదవ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఐజేయూ జిల్లా మహాసభ

హాజరుకానున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ

విశాలాంధ్ర - మహబూబ్ నగర్ : ఈనెల 29న టియుడబ్ల్యూ జే (ఐజేయు) మహబూబ్నగర్ జిల్లా మహాసభలు భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని మహాసభల కన్వీనర్ కే ఏ విజయ రాజు తెలిపారు. మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మహాసభకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ తో పాటు మహబూబ్నగర్ జిల్లాలోని ముగ్గురు ఎమ్మెల్యేలు అన్నం శ్రీనివాస్ రెడ్డి, జి మధుసూదన్ రెడ్డి, జనంపల్లి అనిరుద్ రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తో పాటు ఇతర రాజకీయ ప్రముఖులు కూడా హాజరవుతున్నట్లు వెల్లడించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత నిర్వహించే మూడవ జిల్లా మహాసభను మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలోని శివం కన్వెన్షన్ హాల్లో ఉదయం 10గంటల నుంచి కార్యక్రమాలు తెలిపారు. మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రతి మండలం నుంచి యూనియన్ సభ్యులు ప్రతి ఒక్కరు సరళి వచ్చి మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

గచ్చిబౌలిలో ఆర్ఎస్ బ్రదర్స్ షోరూమ్ ప్రారంభం

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: ఐటీ రాజధాని హైదరాబాద్, గచ్చిబౌలిలో సరికొత్త షోరూమ్ ద్వారా తన రిటైల్ బ్రాండ్ విస్తృతిని పెంచుతున్న ఆర్.ఎస్. బ్రదర్స్ తన 16వ షోరూను హైదరాబాద్ గచ్చిబౌలిలో ప్రారంభించింది. పి. వెంకటేశ్వర్లు, ఎస్. రాజమౌళి, టి.ప్రసాదరావు, మరియు దినంగత పి.సత్యనారాయణ స్థాపించిన ఈ సంస్థ తన విజయవంతమైన రిటైల్ ప్రస్థానంలో ఒక విశిష్టమైన బ్రాండు గా చరిత్ర సృష్టించి, అటు సంప్రదాయాన్నీ, ఇటు ఆధునిక జీవనశైలిని ప్రతిబింబించే వైవిధ్యభరిత వస్త్రశ్రేణితో షాపింగ్ ప్రియుల ఏకైక గమ్యంగా ఆవిర్భవించి, సాటిలేని వరైటీలను సరసమైన ధరలకు అందిస్తూ నగరవాసుల విశ్వసనీయతను చూరగొంటూ, వారి హృదయాలకు మరింతగా చేరువయింది. పాపులర్ స్టార్ మీనాక్షి చౌదరి గచ్చిబౌలిలో ఆర్.ఎస్. బ్రదర్స్ షోరూమ్ శుభారంభానికి ప్రత్యేక అతిథిగా విచ్చేశారు. కుటుంబంలోని అన్ని తరాలవారి అవసరాలను ప్రతిబింబిస్తూ, వివాహవేడుకలకు అవసరమైన కొనుగోళు గమ్యంగా, సర్వాంగసుందరంగా ముస్తాబైన 16వ షోరూమ్ శుభారంభంలో పాలుపంచుకోవడం తనకు ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. సంప్రదాయాన్నీ, సరికొత్త ఫ్యాషన్లనూ మేళవిస్తూ ఎప్పటికప్పుడు వైవిధ్యభరితమైన వెరైటీలను, సాటిలేని డిజైన్లను ఫ్యాషన్ ప్రియులకు అందుబాటులో ఉన్నాయన్నారు.

రైతులకు శుభవార్త

భారత ప్రభుత్వ వ్యవసాయ మరియు సహకార శాఖ మరియు రైతు సంక్షేమ శాఖచే జారీ చేయబడిన 24-10-2015 నాటి ఆర్డర్ నెంబరు ఎస్ఓ 2900 (ఇ) కు అనుగుణంగా, తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ 100% నీటిలో కరిగే ఎరువుల మిశ్రమాన్ని (ద్రవ/గుళికల రూపంలో) తయారు చేసి సరఫరా చేయగలమని తెలియజేస్తున్నాము.

S. NO.	TYPES OF FERTILIZERS	NUTRIENT PERCENT
1.	N:P:K:S	00:00:50
2.	N:P:K:S	00:60:20
3.	N:P:K:S	00:45:45
4.	N:P:K:S	08:00:47-75
5.	N:P:K:S	13:40:13
6.	N:P:K	19:19:19
7.	N:P:K	15:08:35
8.	N:P:K	23:19:18
9.	N:P:K	15:35:15
10.	N:P:K	17:17:17
11.	N:P:K	20:20:20
12.	N:P:K	11:36:24
13.	N:P:K	08:16:39
14.	N:P:K	12:05:27-8Cao
15.	N:P:K	00:55:18-7MgO
16.	N:P:K	00:49:32
17.	N:P:K	05:45:05-8Zn
18.	N:P:K	16:11:32
19.	N:P:K	00:45:15-8MgO-6S
20.	N:P:K	00:24:24-4MgO-6S

పై ఎరువులు పంటల అభివృద్ధికి మరియు అధిక దిగుబడుల కొరకు సహకరించును.

Address:
ABHAYA CROP CARE PVT LTD,
Survey No 74, 77a, Eastern Side Of First Shed Maduri Feeds, Malkapur(V), Choutuppal(M), Yadadri Bhuvanagiri District – 508252
Contact - 9949777741 Email ID – abhayacropcare2015@gmail.com

రైతులకు శుభవార్త

భారత ప్రభుత్వ వ్యవసాయ మరియు సహకార శాఖ మరియు రైతు సంక్షేమ శాఖచే జారీ చేయబడిన 24-10-2015 నాటి ఆర్డర్ నెంబరు ఎస్ఓ 2900 (ఇ) కు అనుగుణంగా, తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ 100% నీటిలో కరిగే ఎరువుల మిశ్రమాన్ని (ద్రవ/గుళికల రూపంలో) తయారు చేసి సరఫరా చేయగలమని తెలియజేస్తున్నాము.

S. NO.	TYPES OF FERTILIZERS	NUTRIENT PERCENT
1.	N:P:K:S	00:00:50
2.	N:P:K:S	00:60:20
3.	N:P:K:S	00:45:45
4.	N:P:K:S	08:00:47-75
5.	N:P:K:S	13:40:13
6.	N:P:K	19:19:19
7.	N:P:K	15:08:35
8.	N:P:K	23:19:18
9.	N:P:K	15:35:15
10.	N:P:K	17:17:17
11.	N:P:K	20:20:20
12.	N:P:K	11:36:24
13.	N:P:K	08:16:39
14.	N:P:K	12:05:27-8Cao
15.	N:P:K	00:55:18-7MgO
16.	N:P:K	00:49:32
17.	N:P:K	05:45:05-8Zn
18.	N:P:K	16:11:32
19.	N:P:K	00:45:15-8MgO-6S
20.	N:P:K	00:24:24-4MgO-6S

పై ఎరువులు పంటల అభివృద్ధికి మరియు అధిక దిగుబడుల కొరకు సహకరించును.

Address:
GENTECH CROP SCIENCES PVT LTD,
Sy. No: 92, Door No: 1-23, Dharmojigudem (V), Choutuppal (M), Yadadri Bhuvanagiri (D), Telangana – 508252.
Contact - 97017 99888, Email ID – info@gentechagro.com

రైతులకు శుభవార్త

భారత ప్రభుత్వ వ్యవసాయ మరియు సహకార శాఖ మరియు రైతు సంక్షేమ శాఖచే జారీ చేయబడిన 24-10-2015 నాటి ఆర్డర్ నెంబరు ఎస్ఓ 2900 (ఇ) కు అనుగుణంగా, తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ 100% నీటిలో కరిగే ఎరువుల మిశ్రమాన్ని (ద్రవ/గుళికల రూపంలో) తయారు చేసి సరఫరా చేయగలమని తెలియజేస్తున్నాము.

S. NO.	TYPES OF FERTILIZERS	NUTRIENT PERCENT
1.	N:P:K:S	00:00:50
2.	N:P:K:S	00:60:20
3.	N:P:K:S	00:45:45
4.	N:P:K:S	08:00:47-75
5.	N:P:K:S	13:40:13
6.	N:P:K	19:19:19
7.	N:P:K	15:08:35
8.	N:P:K	23:19:18
9.	N:P:K	15:35:15
10.	N:P:K	17:17:17
11.	N:P:K	20:20:20
12.	N:P:K	11:36:24
13.	N:P:K	08:16:39
14.	N:P:K	12:05:27-8Cao
15.	N:P:K	00:55:18-7MgO
16.	N:P:K	00:49:32
17.	N:P:K	05:45:05-8Zn
18.	N:P:K	16:11:32
19.	N:P:K	00:45:15-8MgO-6S
20.	N:P:K	00:24:24-4MgO-6S

పై ఎరువులు పంటల అభివృద్ధికి మరియు అధిక దిగుబడుల కొరకు సహకరించును.

Address:
SIBA CROP CARE
74, 77, Main Road Malkapur, Back Side Of Hotel Sri Aadhya, Tupranpet(V), Choutuppal(M), Yadadri Bhuvanagiri District – 508252 Contact - 9177970699
Email ID – sibacropcare@gmail.com

జర్మనీలో పర్యటించాలంటూ మంత్రికి ఆహ్వానం

విశాలాంధ్ర - హైదరాబాద్ :: జర్మనీలో పర్యటించాలంటూ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు ఆహ్వానం అందింది. టెక్నాలజీ, ఇండస్ట్రీ, ఇన్నోవేషన్, ఇంటర్నేషనల్ బిజినెస్ లో 'తెలంగాణ జర్మనీ' మధ్య ద్వైపాక్షిక సహకారం మరింత బలోపేతమయ్యేలా తమ దేశంలో పర్యటించాలని జర్మన్ బుండెస్?టాగ్ (పార్లమెంట్) సభ్యుడు, ఏఎఫ్‌డీ పార్లమెంటరీ గ్రూప్ ఫారిన్ పాలసీ అధికార ప్రతినిధి, ఇండో-జర్మన్ పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ గ్రూప్ ఛైర్మన్ మార్కస్ ఫ్రోహ్నమైయర్ ఆయనను ఆహ్వానించారు. ఈ మేరకు మంత్రి శ్రీధర్ బాబు జనవరిలో జర్మనీలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన జర్మనీ ప్రభుత్వ పెద్దలు, కీలక అధికారులు, అక్కడి ప్రముఖ పారిశ్రామికవేత్తలు, ఇండస్ట్రీ నిపుణులతో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. ఈ హై లెవెల్ మీటింగ్స్ లో ఇండస్ట్రియల్ పార్టనర్‌షిప్స్, తెలంగాణలో ఇన్వెస్ట్ మెంట్ ఆపర్చునిటీస్, జర్మనీలో తెలంగాణ కంపెనీలకు మార్కెట్ యాక్సెస్ కల్పించడం, జర్మనీ తెలంగాణ మధ్య టెక్నాలజీ ట్రాన్స్ ఫర్, ద్వైపాక్షిక సహకార బలోపేతానికి తీసుకోవాల్సిన అంశాలపై చర్చించనున్నారు.

నామినేషన్ పత్రాలు క్షుణ్ణంగా పరిశీలించాలి

విశాలాంధ్ర ప్రతినిధి - రంగారెడ్డి : నామినేషన్ల స్వీకరణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా అభ్యర్థి సమర్పించిన నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి తీసుకోవాలని జనరల్ అబ్జర్వర్ పి.ప్రశాంత్ జీవన్ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. గురువారం మొదటి దశ పోలింగ్ కు సంబంధించి గురువారం నుండి (తేదీ: 27-11-2025 నుండి 29-11-2025 వరకు) ప్రారంభమైన ఈ నేపథ్యంలో శంషాబాద్ మండలం పెద్దతుప్ర గ్రామ పంచాయతీ కార్యాలయంలో పెద్దతుప్ర, పెద్దతుప్ర తండా, ముచ్చింతల్, మదనపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మదనపల్లి, మదనపల్లి కొత్త తాండ, మదనపల్లి పాత తాండ గ్రామాల పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను జనరల్ అబ్జర్వర్ పి.ప్రశాంత్ జీవన్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) శ్రీనివాస్ తో కలిసి పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్ లో నమోదు చేయాలని జనరల్ అబ్జర్వర్ సూచించారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించి జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలని అన్నారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, విధుల్లో ఉన్న ప్రభుత్వ సిబ్బంది నామపత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. శంషాబాద్ ఎంపిడిఓ మున్ని, తహసీల్దర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం : మేయర్

విశాలాంధ్ర, హైదరాబాద్ : బంజారాహిల్స్ డివిజన్‌లో ఎన్‌బిటీ నగర్, వెంగల్ రావు బిల్డింగ్, మిథిలా నగర్ లో 3 కోట్ల అభివృధి పనులకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి గురువారం శంకుస్థాపన చేశారు. డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డి గారికి మేయర్ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మేయర్ తన క్యాంప్ కార్యాలయంలో జిహెచ్‌ఎంసి, వాటర్ వర్క్స్, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ అధికారుల తో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రేటర్ హైదరాబాద్ నగరం, బంజారాహిల్స్ డివిజన్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని మేయర్ తెలిపారు. ప్రస్తుతం శంకుస్థాపన చేసిన పనులతో పాటు ప్రగతి లో ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని మేయర్ అధికారులను ఆదేశించారు.

ఫరూక్ నగర్ మండలంలో నామినేషన్ల పర్వం

విశాలాంధ్ర,షాద్ నగర్, రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం, ఫరుక్ నగర్ మండలంలో గురువారం మొదటి రోజు నామినేషన్ల స్వీకరణ పర్వంలో సర్పంచ్ పదవి కోసం ఆ గ్రామాలకు సంబంధించిన అభ్యర్థులు 34 మంది నామినేషన్లు వేశారు. అదేవిధంగా 19 మంది వార్డు సభ్యుల పదవి కోసం నామినేషన్లు వేశారు. ఆయా నామినేషన్ల క్లస్టర్ల పరిధిలో జరిగిన నామినేషన్ల కార్యక్రమాలను షాద్ నగర్ ఆర్డీవో ఆర్ సరిత, ఫరూక్ నగర్ ఎంపీడీవో బన్సీలాల్, షాద్ నగర్ ఎస్సై తదితర సిబ్బంది ప్రక్రియను పర్యవేక్షించారు. మొగలిగిద్ద క్లస్టర్ ను అధికారులు పరిశీలించారు. అయా గ్రామ పంచాయతీల వారిగా నామినేషన్లు స్వీకరించిన వాటిలో అన్నారం క్లస్టర్ 2, భీమారం క్లస్టర్ 5, బూర్గుల క్లస్టర్ 2, చెవులపల్లి క్లస్టర్ 3, ఎలుకట క్లస్టర్ 4, కిషన్ నగర్ క్లస్టర్ 2, గంట్లవెల్లి క్లస్టర్ 5, మొగిలిగిద్ద క్లస్టర్ 4, కమ్మదనం క్లస్టర్ 3, వెలిజర్ల క్లస్టర్ 2, చించోడు క్లస్టర్ 2 చొప్పున మొత్తం 34 మంది సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసినట్టు తెలిపారు.

ఇక వార్డు సభ్యుల విషయానికి వస్తే అన్నారంలో ఒక వార్డుకు, ఉపరిగడ్డ గ్రామ పంచాయతీలో ఆరు వార్డులకు, కంది వనంలో మూడు వార్డులకు, రాసు మల్ల గూడలో ఒక వార్డు, కిషన్ నగర్ గ్రామంలో రెండు వార్డులు, మొగిలిగిద్ద లో మూడు వార్డులు, కమ్మదనం లో ఒక వార్డు, వెంకన్నగూడలో తండాలో ఒక వార్డు మండలంలో మొత్తం 19 వార్డులకు నామినేషన్లు వేయడం జరిగిందని అధికారులు తెలిపారు.

నిబద్ధతతో ఎన్నికల విధులు నిర్వర్తించాలి

విశాలాంధ్ర-నల్గొండ బ్యూరో: గ్రామపంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఉద్యోగి పూర్తి నిబద్ధతతో పనిచేయాలని స్థానిక సంస్థల ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్ అన్నారు.కలెక్టరేట్‌లో జరిగిన అవగాహన సమావేశంలో ఉద్యోగులు సమయపాలనతో బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. బ్యాలెట్ పేపర్ల భద్రత, %ఖీూ-చాూ% బృందాల సమర్థ నిర్వహణ, పోలింగ్ కేంద్రాల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు.ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ, డీపీవో తదితర అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

విశాలాంధ్ర, హైదరాబాద్ : మహేశ్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఈ వెంకటాచారి అన్నారు. ఏపీ మహేశ్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ ఎన్నికల వచ్చే నెల డిసెంబర్ 7న నిర్వహణ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సూచనలు మేరకు నాంపల్లిలోని వనితా మహావిద్యాలయం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఉన్న శంకర్‌జీ హాల్‌లో పిఓ, ఎపిఓ, ఓపిఓలకు శిక్షణ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ పోలింగ్ విధి,విధానాలు, ఎన్నికల నియమాలు, బాధ్యతల పై వివరించి, ఎన్నికలను నిబద్ధత అలాగే పారదర్శకంగా జరిగేలా ఎన్నికల నిర్వహణ అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలని సూచించారు. డిసెంబర్ 7న నిర్వహించే ఈ ఎన్నికల్లో మొత్తం 14 బోర్డు సభ్య స్థానాలకు పోలింగ్ జరగనుందని తెలిపారు. ఇందుకు మొత్తం 78 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనుండగా, వాటిలో 68 పోలింగ్ కేంద్రాలు ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా అదనంగా రాజస్థాన్ రాష్ట్రం జైపూర్, భిల్వారా, మహారాష్ట్రలోని ముంబై , ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, రాజమండ్రి, అలాగే తెలంగాణాలోని ఖమ్మం, వరంగల్, కరీంనగర్ నగరాల్లో ఆయా బ్యాంక్ ల పరిధిలోని 10 కేంద్రాలను అక్కడి జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో పర్యవేక్షణ నిరంతరం కొనసాగేలా సీసీటీవీ కెమెరాలు అలాగే వెబ్‌కాస్టింగ్ సదుపాయాలను చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల రోజున ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ప్రధాన కేంద్రంగా పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. అలాగే 37 వేలకు పైగా ఓట్లు ఉన్నందున ఎక్కడ కూడా సమస్యలు ఉత్పన్నం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. అదే విధంగా ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో ముందుగా ఏర్పాటు చేయనున్న డిస్ట్రిబ్యూషన్ సెంటర్లో ఎన్నికల పోలింగ్ అధికారులు రిపోర్ట్ చేసి ఎన్నికల సామాగ్రి తీసుకోవాలని ఆయన సూచించారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్ లోని కమల నెహ్రూ పాలిటెక్నిక్ భవనంలో స్ట్రాంగ్ రూమ్ తో పాటు కౌంటింగ్ ఏర్పాట్లు కూడా చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. శిక్షణా కార్యక్రమంలో ఎస్ ఈ ఎం మరియు సహాయక రిటర్నింగ్ అధికారి జ్యోతి, లా అధికారి శ్రీధర్, డి సి. ఓ ప్రసన్న, మహేష్ కోఆపరేటివ్ బ్యాంక్ అధికారులు, జిల్లా కోఆపరేటివ్ బ్యాంక్ అధికారులు,పిఓ, ఎపిఓ అలాగే ఓపిఓలు తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి ఆసుపత్రి కార్మికుల ఆందోళన బాట

విశాలాంధ్ర - హైదరాబాద్ :: కాల పరిమిత ముగిసిన పాత ఐహెచ్‌ఎఫ్‌ఎంఎస్ ఏజెన్సీ టెండర్లను రద్దుచేసి నూతన టెండర్లలో ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్వైజర్ కార్మికులకు కనీస వేతనం 26వేలకు పెంచుతూ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 1 నుండి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన బాట పడుతున్నట్లు తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి సురేష్ తెలిపారు. గురువారం జీతాల పెంపు కోసం చేపట్టబోయే ఆందోళన డిమాండ్ నోటీసులు మహబూబ్ నగర్ జనరల్ ఆస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ ప్రేరణకి అందజేశారు. ఈ సందర్భంగా పి. సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానలో శానిటరీ భద్రత రోగి సంరక్షణ కోసం ప్రభుత్వం మూడు సంవత్సరాలకోసారి ఏజెన్సీలోని ఎంపిక చేస్తారని 2022 సంవత్సరంలో ప్రభుత్వం ఐ ఎచ్ ఎఫ్ఎంఎస్ టెండర్ల ద్వారా ప్రస్తుత ఏజెన్సీలను నియమించారని వాటి మూడు సంవత్సరాల కాల పరిమితి దాటి ఆరు నెలల గడుస్తున్నదని అయినా ఇప్పటికీ కొత్త ఏజెన్సీల ఏర్పాటు ప్రక్రియని ప్రభుత్వం ప్రారంభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత టెండర్లలో కొన్ని తప్పిదాల కారణంగా ఏజెన్సీ కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా కార్మికుల శ్రమను దోచుకున్నారని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనం 26 వేలకు పెంచుతూ నూతన టెండర్ల నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీనికోసం రాష్ట్రవ్యాప్తంగా డిసెంబర్ 1 నుండి నాలుగు వరకు వివిధ రూపాలలో ఆందోళన కార్యక్రమాలు కొనసాగించి ఐదున చలో హైదరాబాద్ నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి పెట్టి చాకిరికి గురవుతున్న ఆసుపత్రి కాంట్రాక్ట్ కార్మికుల పెద్ద ఎత్తున తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ ఎం ఓ లు డాక్టర్ గణేష్,డాక్టర్ శిరిష, డాక్టర్ ఇషిన్ ముస్తాక్, ఆసుపత్రి బ్రాంచ్ యూనియన్ నేతలు కార్మికులు రంగన్న, రామకృష్ణ, శ్రీను, అంజి,గంగాధర్, మల్లమ్మ, వరలక్ష్మి,జ్యోతి, నాగలక్ష్మి,సునిత, చంద్రకళ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీసీలను దగా చేసిన పాలకులు

విశాలాంధ్ర-ఎల్.బి.నగర్ : తెలంగాణలోని బీసీ జాతిని పాలకులు నిలువునా దగా చేశారని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు ధ్వజమెత్తారు. గురువారం ఆయన హైదరాబాదులోని నాగోల్ ఎస్.ఏ.దాంగే భవన్‌లో బీసీ ముఖ్య నేతలతో కలిసి మాట్లాడుతూ... స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో హామీ ఇచ్చి మాట తప్పారని కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర శాసన సభ బిల్లును ఆమోదించకుండా బీసీలను మోసం చేశారని, అలాగే ప్రధాని వద్దకు అఖిలపక్ష బృందాన్నితీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు రేవంత్ రెడ్డి చొరవ చేయకపోవడం కూడా బీసీలకు నష్టం వాటిల్లిందని, కేవలం 22 శాతం మాత్రమే రిజర్వేషన్‌తో స్థానిక సంస్థలకు వెళ్లేందుకు ఎన్నికల కమిషన్ ముందుకు రావడంతో ఇటీవల తీసిన రిజర్వేషన్ లలో బీసీలకు కేవలం 17 శాతం మాత్రమే రిజర్వేషన్ దక్కిందని అనుకున్న విధంగా 22% కూడా ఇవ్వలేకపోయారని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బీసీలకు ఒక్క సర్పంచ్ కూడా దక్కలేదని అంటే కొత్తగూడెం జిల్లాలో బీసీలు లేరా అని ఆయన ప్రశ్నించారు. అలాగే ములుగు జిల్లాలో మొత్తం కేవలం ఐదు సర్పంచ్లు మాత్రమే బీసీలకు కేటాయించారని 33% రిజర్వేషన్ల శాతాన్ని 23% తగ్గించిన కేసీఆర్ కంటే రేవంత్ రెడ్డి మరో అడుగు ముందుకు వేసి కేవలం 17 శాతం మాత్రమే బీసీలకు రిజర్వేషన్ కల్పించారని అందువల్ల ప్రజలు అర్థం చేసుకొని ఎవరెవరికి ఏ విధంగా బుద్ధి చెప్పాలో తగు విధంగా గుణపాఠం నేర్పాలని ఆయన కోరారు. జనాభాలో సగభాగమైన బీసీలకు సగం వాటా దక్కాల్సి ఉండగా 12,700 గ్రామపంచాయతీలో 6000 గ్రామపంచాయతీలు బీసీలకు దక్కాల్సి ఉండగా కేవలం 2000 గ్రామ పంచాయతీలు మాత్రమే బీసీలకు దక్కాయని జరిగిన అన్యాయం పట్ల బీసీలు మౌనం విడాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయన వెంట బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ గీత పని వారల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిజి సాయిల్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండ కోటయ్య, పాలకూరి బాబు ఉన్నారు.

జనగణన పూర్తి చేయాలి

విశాలాంధ్ర-హైదరాబాద్ : ఈ నెల 30 వ తేదీ లోగా ప్రీ టెస్ట్ జనగణన - 2027 పూర్తి చేయాలనీ రాష్ట్ర జనగణన సంచాలకురాలు భారతి హెూలికేరి అధికారులకు సూచించారు. బుధవారం రామచంద్రపురం (వార్డు నెం.112) ప్రాంతాన్ని సందర్శించి ప్రీ%-%టెస్ట్ జనగణన 027 జరుగుతున్న తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె హౌసలిస్టింగ్, ఫీల్డ్ వెరిఫికేషన్ పురోగతిని తెలుసుకుని ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్ల తో మాట్లాడారు. డేటా సేకరణలో అనుసరిస్తున్న విధానాలు, క్షేత్ర స్థాయిలో జనగణన జరుగుతున్న తీరును సమీక్షించారు. ఈ నెల 30వ తేదీలోగా అన్ని పనులను మార్గదర్శకాల మేరకు ఖచ్చితత్వంతో, తప్పులేకుండా పూర్తి చేయాలని ఆమె అధికారులకు సూచించారు. జనగణన 2027కు ముందు చేపట్టే ఈ ప్రీ%-%టెస్ట్ ప్రక్రియ భవిష్యత్ వ్యూహాల, ప్రణాళికల రూపకల్పనకు అత్యంత కీలకమని, సమగ్రతతో కూడిన నాణ్యమైన డేటా సేకరణకు ఇది పునాదిగా నిలుస్తుందని ఆమె తెలిపారు. క్షేత్ర పరిశీలనలో సమాచాలకుల వెంట జీహెచ్‌ఎంసీ రామచంద్రపురం డిప్యూటీ కమిషనర్ , ఛార్జ్ ఆఫీసర్ సురేష్, జనగణన శాఖ డిప్యూటీ డైరెక్టర్ వి. శ్రీకాంత్ ఉన్నారు.

ప్రకృతి రక్షణపై మంచి సందేశాన్నిచ్చిన నైనిక..

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి బాధ్యత ఉందనే విషయాన్ని తెలియజేస్తూ జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్‌లో ప్రకృతి హరిత దీక్షకురాలు నైనిక రజువా ఇచ్చిన ప్రదర్శనకుగాను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. సైన్స్ ఫేర్ ముగింపు సందర్భంగా గురువారం జరిగిన సభలో కలెక్టర్ తన ప్రసంగంలో నైనిక రజువా గురించి ప్రస్తావించడం గమనార్హం. పర్యావరణంపై గొప్పగా మాట్లాడే వారికీ జిల్లాలోని అటవీ సంపద ఉన్నప్పటికీ ఆ ప్రాంతంలో పెరిగే పది ఔషధ మొక్కల పేర్లు కూడా తెలియవని అన్నారు. ఆధునిక వర్తమాన పరిస్థితుల్లో రోగాలకు ప్రధాన కారణం వాతావరణ కాలుష్యమే అన్నారు. మొక్కలు నాటడంతోపాటు మొక్కల్లోని ఔషధ గుణాలు కనిపెట్టి వాటిని ఉపయోగించడం వల్ల ఎంతో ఆరోగ్యం ఉందన్నారు. ఔషధ మొక్కలతోపాటు అన్ని రకాల మొక్కల పెంచాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ గుర్తు చేశారు.

అంగన్వాడీకి సీలింగ్ ఫ్యాన్ వితరణ

విశాలాంధ్ర -చర్ల : భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా న్యాయవాది పరిటాల సంతోష్ కుమార్ మండలంలోని అంగన్ వాడి కేంద్రాలను సందర్శించారు. అందులో భాగంగా గ్రామ పంచాయతీ పరిధిలోని లింగాపురం పాడు అంగన్వాడి కేంద్రంలో సీలింగ్ ఫ్యాన్ లేక పోవడంతో ఆయన స్పందించి పిల్లల సౌకర్యం కోసం ఆ కేంద్రం టీచర్ కృష్ణవేణి కు వితరణగా ఫ్యాన్ అందజేశారు. దింతో సంతోష్ కుమార్ ను విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గోగికార్ రామలక్ష్మణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాలనీలో కార్పొరేటర్ పర్యటన

విశాలాంధ్ర, మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని సత్తి రెడ్డి నగర్‌లో స్థానికుల పిలుపు మేరకు కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ అధికారు లతో కలిసి గురువారం పర్యటించారు. స్థానికులు రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సత్తిరెడ్డి నగర్‌లో బాక్స్ డ్రైన్ పనులు పూర్తయ్యాయని రోడ్డు పనులకు రూ.33 లక్షల మంజూరు కావడం జరిగిందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డి.ఈ.ఈ. లౌక్య, వర్క్ ఇన్స్పెక్టర్ రజనీకాంత్, కాలనీ వాసులు బలవంత రెడ్డి, రాజు, దేవేందర్, సిద్దేశ్వర, ఆంటోనీ, చారి, సరోజమ్మ, భాగ్యమ్మ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్ల భాష పై పట్టు అవసరం : దస్తగిరి

విశాలాంధ్ర - కొత్తగూడెం : వర్తమాన పోటీ ప్రపంచంలో విద్య వైజ్ఞానికంగా ఎదగాలంటే ఆంగ్ల భాష పై పట్టు అనివార్యమని జిల్లా ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్కే దస్తగిరి, ప్రధాన కార్యదర్శి, ఆంగ్ల రిసోర్స్ పర్సన్ డాక్టర్ షేక్ మీరా హుస్సేన్ లు అన్నారు. ఆంగ్లంలో భావవ్యక్తీకరణ నైపుణ్యాలను తప్పక పెంచుకోవాలని వారు విద్యార్థులను కోరారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఎద్యుకేస్టు, ఒలింపియాడు పోటీలను ఆంగ్లంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో ఆంగ్ల మధ్యమాన్ని మరింత బలోపేతం చేసేందుకు, విద్యార్థుల నమోదు పెంచటానికి రాష్ట్రవ్యాప్తంగా ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నామన్నారు. ఈ పోటీలలో విద్యార్థులు పాల్గొనడం వల్ల ఆంగ్లంలో సృజనాత్మకత శక్తి పెరిగి భవిష్యత్తులో పోటీ పరీక్షలలో రాణించడానికి చక్కటి తర్ఫీదును ఇస్తున్నామన్నారు. తెలంగాణ నుండి మన విద్యార్థులు గ్లోబల్ విద్యార్థులుగా మారటానికి ఆంగ్ల నైపుణ్యాలు ఎంతో అవసరమన్నారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులను జిల్లా స్థాయిలకు పంపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ జహంగీర్ షరీఫ్, కన్వీనర్ రవికుమార్, రిసోర్స్ పర్సన్ కర్లపూడి సైదులు ఆంగ్ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు తగదు

విశాలాంధ్ర - గుండాల : సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ నేపథ్యంలో సబ్ డివిజన్ పరిధిలోని గ్రామాల్లో ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేస్తామని డిఎస్పీ చంద్రభాను అన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనలు, నియమాల మేరకు ఎన్నికల కోడ్ ను అందరూ అనుసరించాలని స్పష్టం చేసారు. స్థానిక ప్రజలు, రాజకీయ పార్టీలు అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలని డిఎస్పి సూచించారు. శాంతి భద్రతలకు ఎలాంటి ఆటంకం కలిగించవద్దని కోరారు. అనుమానాస్పద కార్యకలాపాలపై పోలీసు నిఘా ఉంటుంది స్పష్టం చేసారు. అందరూ చట్టాన్ని గౌరవిస్తూ శాంతియుత గా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలన్నారు. ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి నిఘా పెడుతున్నామని చెప్పారు. ప్రతి పౌరుడు స్వేచ్ఛగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోషల్ మీడియా పై ప్రత్యేక నిఘా ఉంటుందని తప్పుడు సమాచారాలు, రెచ్చగొట్టే వీడియోలు, రూమర్స్ సృష్టించడం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీఆర్‌ఎస్‌లోకి బీజేపీ, కాంగ్రెస్ నాయకుల చేరిక

విశాలాంధ్ర - హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి ఒక ముఖ్యమంత్రిలా కాకుండా కేవలం రియల్ ఎస్టేట్ ఏజెంట్‌లా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఆధ్వర్యంలో కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన పలువురు బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి కేటీఆర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతి అక్రమాలపై నిప్పులు చెరిగారు. రేవంత్ రెడ్డి హిల్ట్ పాలసీ పేరుతో మరో భారీ కుంభకోణానికి తెరలేపారని కేటీఆర్ ఆరోపించారు. మొదట మూసీ భూములు, ఆ తర్వాత రీజినల్ రింగ్ రోడ్డు, సెంట్రల్ యూనివర్సిటీ భూములపై పడ్డ రేవంత్ దృష్టి.. ఇప్పుడు హైదరాబాద్ నగరంలోని పారిశ్రామిక భూములను దోచుకోవడంపై పడిందని విమర్శించారు. ఒకప్పుడు ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం నుంచి పారిశ్రామికవేత్తలు చవకగా భూములు తీసుకున్నారని, ఇప్పుడు ఆ భూముల్లో అపార్ట్‌మెంట్లు, విల్లాలు కట్టుకునేందుకు రేవంత్ రెడ్డి అతి తక్కువ ధరకే అనుమతులు ఇస్తూ రియల్ దందా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు 9300 ఎకరాల భూమిని ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తూ, ఐదారు వందల మంది కోసం 5 లక్షల కోట్ల రాష్ట్ర ప్రజల ఆస్తిని తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు.

ఛాంపియన్‌షిప్ పోటీల కరపత్రాల ఆవిష్కరణ

విశాలాంధ్ర-షాద్ నగర్, రూరల్: జీవితంలో ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని, శరీర సౌష్టవాన్ని పెంచుకోవాలని తద్వారా దీనిని ఆదర్శంగా తీసుకొని యువత ముందుకు వచ్చేందుకు మిస్టర్ లెజెండ్ పేరిట బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్ లాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్ నగర్ పట్టణ కేంద్రలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్వగృహంలో మిస్టర్ లెజెండ్ టైటిల్ పేరిట రాష్ట్రస్థాయి బాడీ బిల్డర్స్ ఛాంపియన్షిప్ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్ తదితర కరపత్రాలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ బాడీ బిల్డర్లు నేటి యువతీ, యువకులు పెద్ద ఎత్తున ముందుకు వస్తుండడం శుభ పరిణామం అని అన్నారు. ఇలాంటి ప్రాంతంలో ప్రజల ఆరోగ్యం కోసం జిమ్స్ ఏర్పాటు చేసి వాటి ద్వారా యువతీ యువకులను ప్రోత్సహిస్తూ బాడీ బిల్డింగ్ పోటీలను రాష్ట్రస్థాయిలో ఇక్కడ నిర్వహించడం ఎంతో గొప్ప విషయం అని ఈ కార్యక్రమానికి తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే అన్నారు. డిసెంబర్ 21వ తేదీన సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమై ఈ కార్యక్రమానికి తనను ముఖ్యఅతిథిగా జిమ్ ట్రైనర్లు అదేవిధంగా కార్యక్రమాల నిర్వాహకులు అబ్దుల్ ఖాదర్ జిలాని, మహమ్మద్ హబీబుద్దీన్ లు తనను ఆహ్వానించడం సంతోషంగా ఉందని అన్నారు. పహిల్వాన్ల పోటీలు ఎంతో రసవత్తరంగా ఉంటాయని వారి శరీర సౌష్టవాన్ని చూసేందుకు చాలామంది ఆసక్తి కనబరుస్తారని రాష్ట్రస్థాయిలో ఈ పోటీలు స్థానికంగా జరగడం మంచి పరిణామం అని అన్నారు. యువతీ యువకులు కచ్చితంగా తమ ఆరోగ్యాల పై శ్రద్ధ పెట్టాలని జిమ్ ట్రైనర్లు చెప్పే విధంగా నడుచుకొని బాడీ బిల్డింగ్ చేయాలని ఇక్కడి స్థానిక యువతీ యువకులు బాగా కష్టపడి ఈ ప్రాంతానికి మంచి పేరు తేవాలని కోరారు.

డీఆర్‌ఎస్ స్కూల్‌లో 'స్టైల్ స్పెక్ట్రమ్'

విశాలాంధ్ర, హైదరాబాద్ : హైదరాబాద్ గుండ్ల పోచంపల్లి లోని డిఆర్‌ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ గురువారం "స్టైల్ స్పెక్ట్రమ్" ను నిర్వహించింది, ఇది దాని ఫ్యాషన్ స్టడీస్ విద్యార్థుల ఆవిష్కరణ మరియు కళాత్మకతను హైలైట్ చేసే స్ఫూర్తిదాయకమైన ఫ్యాషన్ ఈవెంట్. ఈ ప్రదర్శనలో 11 మరియు 12 తరగతుల వారి ప్రత్యేకమైన డిజైన్ ప్రాజెక్టులు ఉన్నాయి, ప్రతి ఒక్కటి సృజనాత్మకత, స్థిరత్వం మరియు సాంస్కృతిక ప్రేరణను మిళితం చేసే విభిన్న ఇతివృత్తాలను ప్రదర్శించాయి. గ్రేడ్ 11 విద్యార్థులు "ఫ్యాషియోనీర్" అనే పేరుతో వారి సేకరణను ప్రదర్శించారు, ఇక్కడ వారు 70% అసాధారణ మరియు వ్యర్థ పదార్థాలు మరియు 30% ఫాబ్రిక్‌ను మాత్రమే ఉపయోగించి దుస్తులను రూపొందించడానికి సవాలు చేయబడ్డారు. విభిన్న ఇతివృత్తాల నుండి ప్రేరణ పొంది, యువ డిజైనర్లు రోజువారీ మరియు విస్మరించిన వస్తువులను అద్భుతమైన, ధరించగలిగే కళగా మార్చారు, పర్యావరణ స్పృహతో కూడిన ఫ్యాషన్ యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. గ్రేడ్ 12 విద్యార్థులు పురాతన నాగరికతల నుండి ప్రేరణ పొందిన మంత్రముగ్ధులను చేసే సేకరణ "వింటేజ్ వీల్స్" ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఫ్రీలాన్స్ మోడల్, డిఆర్‌ఎస్ 2016 పూర్వ విద్యార్థిని మేధా రెడ్డి పాల్గొని, ఆమె ఫ్యాషన్ పరిశ్రమలో తన వృత్తిపరమైన ప్రయాణం నుండి విలువైన అంతర్దృష్టులను పంచుకుంది, విద్యార్థులు తమ సృజనాత్మకతను నమ్మకంగా మరియు ఉద్దేశ్యంతో అన్వేషించడానికి ప్రేరణనిచ్చింది. ఈ కార్యక్రమం అద్భుతమైన విజయాన్ని సాధించింది, విద్యార్థుల సృజనాత్మకత, ఆవిష్కరణ మరియు ఫ్యాషన్ పట్ల మక్కువకు ప్రేక్షకులు తీవ్రంగా ఆకట్టుకున్నారని డిఆర్‌ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఐ. వేణు గోపాల్ అన్నారు.

స్థానిక పోరులో సత్తాచాటుదాం : సీపీఐ

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : త్వరలో జరగనున్న సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో సీపీఐ సత్తా చాటేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సిపిఐ మద్దతుదారులకు ఘనవిజయాన్ని అందించేందుకు సైనికుల్లా పనిచేయాలని జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యాలయం 'శేషగిరిభవన్'లో గురువారం జరిగిన లక్ష్మీదేవిపల్లి మండల గ్రామపంచాయతి బాధ్యుల సమావేశంలో అయన పాల్గొని మాట్లాడారు. మండల పరిధిలోని గ్రామాలకు కావాల్సిన మౌలిక వసతులు, అభివృద్ధిపై ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా ప్రత్యేక ద్రుష్టి సారించి ఇప్పటికే 80 శాతం మేర పనులు పూర్తి చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మరికొన్ని పనులు నిర్మాణదశలో ఉన్నాయన్నారు. ఈ అభివృద్ధి పనులు ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధిపొందాలని సూచించారు. నిరంతరం ప్రజలతొ వుంటూ సేవలందించే తమ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి దీటి లక్ష్మీపతి, జిల్లా సమితి సభ్యులు కె రత్నకుమారి, గుత్తుల సత్యనారాయణ, దార శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, మంద నిర్మల, నూనావత్ గోవిందు, సపావట్ రవి, బానోత్ నెహ్రు, జర్పుల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ కేంద్రాల పరిశీలన

విశాలాంధ్ర - పినపాక : పినపాక మండల వ్యాప్తంగా గ్రామపంచాయతీ మొదటి విడత ఎలక్షన్ లో భాగంగా సీతంపేట, పినపాక, పాండురంగాపురం, సింగిరెడ్డిపల్లి, కిస్టాపురం, జానంపేట,ఈ బయ్యారం నామినేషన్ దాఖలు కేంద్రాలను గురువారం ఈ బయ్యారం సిఐ వెంకటేశ్వరరావు, ఎస్సై సురేష్ సందర్శించారు. నామినేషన్ కి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. నామినేషన్ కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. స్థానిక ప్రజలు, నాయకులు ఎన్నికల నియమావళిని విధిగా పాటించాలని కోరారు. గుంపులు గుంపులుగా ఉండరాదన్నారు. పోలీసుల అనుమతి లేకుండా ఎలాంటి సభలు, ర్యాలీలు కార్యక్రమాలు నిర్వహించకూడదని స్పష్టం చేసారు.

లక్ష్యంతో శ్రమిస్తే విజయాలు వరిస్తాయి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - హైదరాబాద్ :: మహబూబ్‌నగర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులకు ఉన్నత విద్యలో రాణించే అవకాశాలను మరింత చేరువ చేసేందుకు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కీలక ముందడుగు వేశారు. ఎప్సెట్ మరియు నీట్ వంటి ప్రతిష్ఠాత్మక ఎంట్రెన్స్ పరీక్షలకు ఉపయోగపడే స్టడీ మెటీరియల్స్‌ను విద్యార్థినులకు అందజేసి వారి భవిష్యత్తుకు బలమైన మార్గదర్శనం అందించారు. ఆయన మాట్లాడుతూ "విద్యే ఏ సమాజానికైనా పునాదిగా నిలుస్తుంది. ముఖ్యంగా ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా సరైన మార్గనిర్దేశం, కష్టపడి చదివే తత్వం ఉంటే ఏ ప్రైవేట్ విద్యార్థులకు తీసిపోని స్థాయిలో విజయాలు సాధించగలరు. గత సంవత్సరం ఫలితాల కంటే ఈసారి మరింత మెరుగైన ర్యాంకులు సాధించి మహబూబ్‌నగర్ జిల్లాకు గర్వకారణంగా నిలవాలి" అని పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో పయనీర్ కార్యక్రమం ద్వారా అందిస్తున్న ఈ స్టడీ మెటీరియల్స్ మరియు సౌకర్యాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని, లక్ష్యంపై స్పష్టతతో నిరంతరంగా శ్రమించాలని, క్రమశిక్షణతో చదివితే విజయాలు తప్పనిసరిగా మిమ్మల్ని వరిస్తాయని ఆయన వివరించారు. ఈ స్టడీ మెటీరియల్స్ విద్యార్థినులకు కేవలం పుస్తకాలు కాకుండా, వారి కలలకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. అలాగే, బాలికల విద్యాభివృద్ధే సమాజ అభివృద్ధికి మూలమని పేర్కొంటూ, మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో నిలవాలంటే సరైన విద్య, ఆత్మవిశ్వాసం అవసరమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కౌసర్ జహాన్, అధ్యాపక బృందం, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ఆడిట్ పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

విశాలాంధ్ర, హైదరాబాద్ : జలమండలి ఎండీ అశోక్ రెడ్డి గురువారం రోజున ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో ఈడీ మయాంక్ మిట్టల్ లతో వాటర్ ఆడిట్ పై ట్రాన్స్‌మిషన్ విభాగం అధికారులు, పూణేకు చెందిన అలయన్స్ సొల్యూషన్స్ సంస్థ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో.. పూణే కు చెందిన అలయన్స్ సోల్యూషన్స్ కంపెనీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వాటర్ వర్క్స్ సంస్థలు సరఫరా చేస్తున్న నీటిలో కొంతమేరకు వరకు నాన్ రెవెన్యూ వాటర్ గా లెక్కలోకి రాకుండా పోతుందని, ఇలా లెక్కలోకి రాకుండా పోతున్న నీటిని అరికట్టేందుకు అలయన్స్ సోల్యూషన్స్ సంస్థ డీపీఆర్ రూపొందించిందని ఆ సంస్థ ప్రతినిధులు అన్నారు. ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా లెక్కలోకి రాకుండా పోతున్న నీటిని అరికట్టడంతో పాటు ఆ నీటిని రెవెన్యూగా మార్చవచ్చని తెలిపారు. అలాగే నీటి ఆడిటింగ్ చేయవచ్చు అని చెప్పారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ... జలమండలిలో వాటర్ ఆడిట్ ను ప్రారంభించామని.. రిజర్వాయర్ల నుంచి సరఫరా చేస్తున్న ప్రతి చుక్కనూ లెక్క కట్టేలాగా ఫ్లో మీటర్ ను పెట్టి, చివరి వినియోగదారుని వద్ద కూడా మీటర్ రీడింగ్ సరిపోయేలా లెక్క కడితే ట్రాన్స్ మిషన్ లాస్ తెలుస్తాయని అన్నారు. దాని ద్వారా వృథాగా పోతున్న నీటిని గుర్తించి దాన్ని అరికట్టడానికి చర్యలు తీసుకునే వెసుబాటు ఉంటుందని ఎండీ వివరించారు. స్కాడా ఇంటిగ్రేషన్ చేయడానికి సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయమని ఆదేశించారు. జలమండలి ట్రాన్స్‌మిషన్ డైరెక్టర్ సుదర్శన్, సీజీఎంలు బ్రిజేష్, కిరణ్ కుమార్, పాల్గొన్నారు.

केनरा बैंक Canara Bank
Syndicate
టోలిచౌకి I బ్రాంచ్ (3459)
హెచ్.నం.: 9-4-76/2, సలీం మసూద్ కాంప్లెక్స్ భక్తావర్‌గూడ, హైదరాబాద్ 500008
డిమాండ్ నోటీసు

Ref:3459/SARFAESI/16000198232I/2025 Date: 24-11-2025

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క నిబంధన (3)తో చదివే సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 సెక్షన్ 13 (2) కింద నోటీసు.

బ్యాంకు నుండి పొందిన రుణ సదుపాయానికి సంబంధించిన అసలు మరియు వడ్డీని తిరిగి చెల్లించడంలో ఈ క్రింది రుణగ్రహీతలు, సహ-రుణగ్రహీతలు మరియు హామీదారులు విఫలమయ్యారని మరియు ఈ రుణాలను నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ)గా వర్గీకరించారని ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 సెక్షన్ 13 (2) కింద చివరిగా తెలిసిన వారి చిరునామాలకు ఈ నోటీసులు జారీ చేయబడ్డాయి మరియు ఈ బహిరంగ ప్రకటన ద్వారా వారికి తెలియజేయడమైనది.

రుణగ్రహీతలు/జీపీఏ హోల్డర్ పేరు/ ఎన్‌పీఏ తేదీ	హామీగా పెట్టిన ఆస్తులు స్థిర ఆస్తులు	బకాయి మొత్తం
రుణగ్రహీత: శ్రీ. పెందుర్తి సాయి స్వరూప అలియాస్ బోడేపూడి సాయిస్వరూప భర్త రూపేష్ బోడేపూడి, హెచ్.నెం.3-72/1, 5వ వార్డు, చింతలపూడి మెయిన్ రోడ్, పొన్నూరు మండలం, చింతలపూడి, గుంటూరు-522124, ఆంధ్రప్రదేశ్. జీపీఏ హోల్డర్: శ్రీ.పెందుర్తి విజయ్ సాయి తండ్రి పి.శివ రామ ప్రసాద్, హెచ్.నం: 3-72/1, 5వ వార్డు, చింతలపూడి మెయిన్ రోడ్డు, పొన్నూరు మండలం, చింతలపూడి, గుంటూరు-522124, ఆంధ్రప్రదేశ్. ఎన్‌పీఏ తేదీ: 21.11.2025	ప్రతిపాదిత జీపీఏ టైటిల్ హోల్డర్ పేరు: శ్రీ పెందుర్తి విజయ్ సాయి తండ్రి శివరామప్రసాద్ రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండలం, షాద్ నగర్ మున్సిపాలిటీ, లింగారెడ్డి గూడ,చటాన్‌పల్లి గ్రామం, మూన్‌లైట్ సిటీ సెక్టార్-ఇ పేరుతో సర్వే నం.184/పి & 185/పిలో 413.33 చదరపు గజాలు లేదా 345.68 చదరపు మీటర్లకు సమానమైన కొలత, ప్లాట్ నం.35/ఇ/పి & 36/ఇపై గల జి+1 పై అంతస్తు నివాసిత ఇల్లు మొత్తంగా. ప్లాట్ నం.35/ఇ/పి హద్దులు: ఉత్తరం: 33'-0" వెడల్పు రోడ్డు, దక్షిణం: ప్లాట్ నం.38/ఇ, తూర్పు: రెమ్.ప్లాట్ నెం.35/ఇ/పి, పడమర: ప్లాట్ నెం.36/ఇ. ప్లాట్ నెం.36/ఇ: ఉత్తరం: 33'-0" వెడల్పు రోడ్, దక్షిణం: ప్లాట్ నెం.37/ఇ, తూర్పు: ప్లాట్ నెం.35/ఇ, పడమర: 33'-0" వెడల్పు రోడ్. ఎం.ఓ.డి.టి.డి డాక్.నెం.15159/2023 సిఇఆర్ఎస్ఎఐ అసెట్ ఐడి నం.200077652070 సిఇఆర్ఎస్ఎఐ సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఐడి:400076093380	తదుపరి వడ్డీ మరియు యాదృచ్ఛిక ఖర్చులు మరియు వ్యయాలతో రూ.45,39,412/- (నలభై ఐదు లక్షల ముప్పై తొమ్మిదివేల నాలుగు వందల పన్నెండు రూపాయలు మాత్రమే)

ఈ నోటీసు ప్రచురించబడిన తేదీ నుండి 60 రోజులలోపు బకాయి మొత్తాన్ని చెల్లించాలని పైన పేర్కొన్న రుణగ్రహీత(లు)మరియు/లేదా వారి హామీదారు(లు) (వర్తించేటప్పుడల్లా)లకు ఇందుమూలంగా పిలుపునివ్వడమైనది. లేని పక్షంలో ఈ నోటీసు తేదీ నుండి 60 రోజుల గడువు ముగిసిన తర్వాత సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 సెక్షన్ 13, ఉప సెక్షన్ (4) ప్రకారం తదుపరి చర్యలు తీసుకోబడునని తెలియజేయడమైనది.

తేదీ : 24-11-2025, ప్రదేశం : హైదరాబాద్
సం/-అధీకృత అధికారి, కెనరాబ్యాంక్

కదిలిన ఎర్ర దండు

- నాగపూర్‌లో సీపీఐ భారీ ప్రదర్శన, సభ
- మార్మోగిన 'బీజేపీ హఠావో... దేశ్ బచావో'
- రాజ్యాంగం-దేశ పరిరక్షణకు సంకల్పం

నాగపూర్: సీపీఐ శతాబ్ది వత్సరాన్ని పురస్కరించుకొని దేశం, రాజ్యాంగం పరిరక్షణ సంకల్పంతో ఎర్ర దండు కదిలింది. వేల సంఖ్యలో కార్మికులు, రైతులు, విద్యార్థులు, యువత అరుణ పతాకాలతో కదం తొక్కడంతో మహారాష్ట్రలోని నాగపూర్ ఎర్ర సముద్రాన్ని తలపించింది. 'బీజేపీ హఠావో-ఆర్‌ఎస్‌ఎస్ హఠావో', 'రాజ్యాంగాన్ని పరిరక్షిద్దాం', 'దేశాన్ని పరిరక్షిద్దాం' అన్న నినాదాలతో మార్మోగింది. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సమానత్వం పరిరక్షణకు సీపీఐ మరోమారు సంకల్పించింది. భవిష్యత్ ఉద్యమాలు, పోరాటాలకు సిద్ధం కావాలంటూ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నాగపూర్ వేదికగా సీపీఐ పిలుపునిచ్చింది. నాగపూర్‌లోని చిట్నిస్ పార్కులో నిర్వహించిన భారీ బహిరంగ సభకు సీపీఐ సీనియర్ నాయకుడు తుకారాం భస్మే అధ్యక్షత వహించారు. సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ బాలచంద్ర కాంగో, రాష్ట్ర కార్యదర్శి అడ్వకేట్ సుభాష్ లండె, సహాయ కార్యదర్శి శ్యామ్ కలేతో పాటు నాయకులు రాజు దసేలే, యుగల్ కిశోర్ రాయులు ప్రసంగించారు. ప్రజల పక్షాల పోరాటానికి సీపీఐ ఎల్లప్పుడు కట్టుబడి ఉంటుందని ఉద్ఘాటించారు. పేదలకు, కార్మికులకు, కర్షకులకు, యువతకు వెన్నుదన్నుగా నిలుస్తుందన్నారు. వందేళ్ల త్యాగాల చరిత్ర సీపీఐ సొంతమన్నారు. గతంలో వలే భవిష్యత్‌లోనూ ప్రజా వ్యతిరేక విధానాలపై, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం పోరాటాలకు, ఉద్యమాలకు సీపీఐ నిబద్ధతతో ఉన్నట్లు తెలిపారు. రాజ్యాంగం-దేశ పరిరక్షణ కోసం పోరాటానికి పిలుపునిచ్చారు. కార్మికుల హక్కుల పరిరక్షణ పోరులో కలిసి రావాలని దేశ ప్రజలను కోరారు. బీజేపీని, ఆర్‌ఎస్‌ఎస్‌ను తొలగించేందుకు ఐక్య పోరాటాలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన రెడ్ గార్డ్ పరేడ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కామ్రేడ్ ధమ్మే ఖడ్సే 'షహిరి' ప్రదర్శన ఆకట్టుకున్నది. విదర్భ యువత, ప్రజల ఉమ్మడి సంకల్పానికి అద్దం పట్టే విధంగా ఈ కార్యక్రమం పెద్ద ఎత్తున జరిగింది. డాక్టర్ మహేశ్ కొపూల్‌వాల్, శివకుమార్ గన్వీర్, అశోక్ సోన్కర్, అనిల్ ఘటే, నయన్ గైక్వాడ్, డియోరావ్ చావ్లా, రవీంద్ర ఉమటే, మిలింద్ గన్వీర్, వినోద్ జొడాగే, గంజనన్ ఘొడె తదితర పార్టీ నాయకులు, వామపక్ష మేధావులు పాల్గొన్నారు.

రూ.260 కోట్లతో వేంకటేశ్వర ఆలయ అభివృద్ధి

రెండు దశల్లో పనులు
రెండున్నరేళ్లలో పూర్తి: సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర-సచివాలయం: రాష్ట్ర రాజధాని అమరావతిలో వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని తిరుమల తరహాలో అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆలయ విస్తరణ పనులకు గురువారం శంకుస్థాపన, భూమి పూజ జరిగాయి. రూ.260 కోట్లతో రెండు దశల్లో పనులు రెండున్నరేళ్లలో పూర్తి చేయాలని టీటీడీకి సీఎం సూచించారు. మొదటి దశలో రూ.140 కోట్లతో వివిధ పనుల్ని చేపట్టనున్నారు. రూ.92 కోట్లతో ఆలయం చుట్టూ ప్రాకారం నిర్మించనున్నారు. ఏడంతస్తుల మహా రాజగోపురం, ఆర్జిత సేవా మండపం, అద్దాల మండపం, వాహన మండపం, రథ మండపం, ఆంజనేయ స్వామి ఆలయం, పుష్కరిణి, కట్ స్టోన్ ఫ్లోరింగ్ నిర్మిస్తారు. వీటి కోసం రూ.48 కోట్లు ఖర్చు చేయనున్నారు. అలాగే, రెండో దశ పనులను రూ.120 కోట్లతో చేపట్టనున్నారు. శ్రీవారి ఆలయ మాడ వీధులు, అప్రోచ్ రోడ్లు, అన్నదాన కాంప్లెక్స్, యాత్రికులకు విశ్రాంతి భవనం, అర్చకులు-సిబ్బందికి క్వార్టర్స్, రెస్ట్ హౌస్, పరిపాలనా భవనం, ధ్యాన మందిరం, వాహనాల పార్కింగ్ వంటి పనులను చేపట్టనున్నారు. ఇప్పటికే ఆలయ నిర్మాణం మొదటి విడత పూర్తి కాగా రెండు, మూడవ విడత పనులను చేపట్టబోతున్నారు. నాల్గో విడత పనుల కోసం త్వరలోనే టెండర్లు పిలుస్తారు. ఈ ఆలయ నిర్మాణానికి 2019కి ముందే టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. కృష్ణా నది తీరాన 25.417 ఎకరాలలో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆలయ విస్తీర్ణాన్ని కుదించి, కేటాయించిన భూమిలో కోత పెట్టడంతో పాటు విస్తరణ పనులు రద్దు చేశారు. ఇటీవల కూటమి అధికారంలోకి రావడంతో అమరావతిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం

విస్తరణ పనులు మొదలయ్యాయి. చంద్రబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం విధ్వంసం తప్ప మంచి చేయలేదని విమర్శించారు. దేవుడి సన్నిధిలో ఉన్నప్పుడు పవిత్రంగా, స్వచ్ఛమైన ఆలోచనతో ఉన్నప్పుడే నిజమైన భక్తితో పని చేసినట్లు అవుతుందన్నారు. 'ఎప్పుడు తిరుపతి వెళ్లినా క్యూలైన్‌లోనే భక్తితో దైవ దర్శనానికి వెళతాను. అమరావతినే కాకుండా, ఈ ప్రాంతాన్ని కాపాడే శక్తి ఈ దేవాలయానికి ఉంది. ఎన్టీఆర్ అన్నదానం, ప్రాణదానం, శ్రీవారి సేవకులు, ఆలయాల నిర్మాణాలకు ముందుకు రావాలి. ఆరోగ్యం, సంపద, ఆనందం ప్రతి ఒక్కరికీ ఇవ్వాలి' అని వెంకటేశ్వర స్వామిని కోరుకుంటున్నా' అని చంద్రబాబు అన్నారు. రేమాండ్స్ సంస్థ రూ.100 కోట్లతో ఆలయ నిర్మాణానికి సహకరిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నారాయణ, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, టీటీడీ బోర్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

మద్యం కేసులో మిథున్‌రెడ్డికి ఊరట

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మద్యం కేసులో వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డికి కాస్త ఊరట దక్కింది. రాష్ట్రంలో మద్యం కుంభకోణం కేసు సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ కేసులో అనేక మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో పాటు కొందరు రిమాండ్‌లో ఉన్నారు. తాజాగా ఎంపీ మిథున్ రెడ్డికి పార్లమెంటు సమావేశాలకు వెళ్లేందుకు కోర్టు అనుమతి ఇచ్చింది. డిసెంబరు 1 నుంచి జరిగే పార్లమెంటు సమావేశాల్లో పాల్గొనేందుకు అనుమతి ఇవ్వాలంటూ మిథున్ రెడ్డి ఏసీబీ కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై గురువారం ఏసీబీ కోర్టు విచారణ చేసింది. రెండు వైపులా వాదనలు విన్న కోర్టు... ఎంపీ మిథున్ రెడ్డి పార్లమెంటు సమావేశాల్లో పాల్గొనేందుకు అనుమతి ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది. అటు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వేసిన పిటిషన్‌పైన ఏసీబీ కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. చెవిరెడ్డికి జైలులో సౌకర్యాలు కల్పించాలని సూచించింది. తన అనారోగ్య కారణాల దృష్ట్యా జైలులో దిండు, పరుపు, ఫ్యాన్ వంటివి ఇవ్వాలని ఏసీబీ కోర్టులో పిటిషన్ వేశారు.

మొక్కజొన్న రైతులకు అండగా ఉంటాం

మంత్రి అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర-సచివాలయం: మొక్కజొన్న రైతుల ప్రయోజనాలను రక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు తెలిపారు. మొక్కజొన్న కొనుగోలు అంశంపై వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, ప్రైవేట్ సంస్థల ప్రతినిధులతో మంత్రి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మొక్కజొన్న రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని స్పష్టం చేశారు. పౌల్ట్రీ, ఫార్మా రంగం, ఈతనల, స్టార్చ్, ట్రేడర్లు రేట్లు తగ్గించకుండా, క్వాంటిటీ తగ్గించకుండా కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. పరిశ్రమలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించేందుకు ఇప్పటికే సన్నాహాలు పూర్తి చేసినట్లు మంత్రి తెలిపారు. ఖరీఫ్-2025 కనీస మద్దతు ధర కింద మొక్కజొన్న సేకరణకు అనుమతి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. నంద్యాల జిల్లాలో మార్క్‌ఫెడ్, ఫర్ మార్ట్ అగ్-టెక్ ప్లాట్‌ఫార్మ్ ఐ ఎఫ్పీ మద్దతుతో కొత్త మార్కెట్ అనుసంధాన పైలట్ ప్రాజెక్టు ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పౌల్ట్రీ, పశువుల దాణా తయారీదారులు, స్టార్చ్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, డిస్టిలరీలు, ఎథనాల్ బయోఫ్యూయల్ యూనిట్లు, వాణిజ్య సంస్థలతో పెద్ద స్థాయి సమావేశం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

రబీలో యూరియా సమస్య పరిష్కారం

రబీ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో యూరియా కొరత ఎట్టి పరిస్థితుల్లోనూ తలెత్తకూడదని మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. విజయవాడ క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖలపై మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. రబీ సీజన్‌కు మొత్తం 20.69 లక్షల టన్నుల ఎరువుల అవసరం ఉండగా, ఇప్పటివరకు 2.38 లక్షల టన్నులు రాష్ట్రానికి చేరుకున్నాయని తెలిపారు.

పేదలను కొట్టి... పెద్దలకు పెడతారా?

- అసైన్డ్ చట్ట సవరణ పేదల భూహక్కుపై దాడి
- జల్లి విల్సన్ విమర్శ
- సీసీఎల్ కమిషనర్ కార్యాలయం ఎదుట ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాల భారీ ధర్నా

విశాలాంధ్ర-మంగళగిరి: అసైన్డ్ భూముల అక్రమ బదలాయింపులను తక్షణమే నిలిపేయాలని, రాష్ట్ర ప్రభుత్వం చేసిన అసైన్డ్ చట్ట సవరణను వెంటనే ఉపసంహరించుకోవాలని మాజీ ఎమ్మెల్సీ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జల్లి విల్సన్ డిమాండ్ చేశారు. ముందుగా భూ పరిపాలన కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. గుంటూరు జిల్లా మంగళగిరి నగర పరిధిలో గల సీసీఎల్‌ఏ కార్యాలయం వద్ద ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాల అధ్వర్యంలో గురువారం భారీ ధర్నా జరిగింది. ఉభయ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ కోటేశ్వరరావు, దడాల సుబ్బారావు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. జల్లి విల్సన్ మాట్లాడుతూ 1977 అసైన్‌మెంట్ చట్టాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు పేదల భూహక్కులపై ప్రత్యక్ష దాడులేనని పేర్కొన్నారు. అసైన్డ్ భూములను 99 సంవత్సరాలు లీజుకిచ్చే విధంగా రాష్ట్ర కేబినెట్ సవరణలు తీసుకురావడం వల్ల దళితులు, పేదలకు సంబంధించిన లక్షల ఎకరాల భూములు పెద్దల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని జల్లి విల్సన్ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే లక్షలాది కుటుంబాలు తరతరాలుగా ప్రభుత్వ భూముల్లో సాగు చేస్తూ, నివాసాలు ఏర్పరచుకుని జీవిస్తున్నప్పటికీ... వారికి ఇప్పటికీ పట్టాలు అందకపోవడం వల్ల నిరంతరం బెదిరింపులు, ఖాళీ చేసే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని విమర్శించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సాగు భూమికి పట్టా, గృహనిర్మాణానికి కనీసం ఐదు సెంట్ల స్థలం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కోనేరు రంగారావు కమిటీ సిఫారసు చేసిన విధంగా ప్రతి కుటుంబానికి మూడు ఎకరాల సాగుభూమి, ఐదు సెంట్ల ఇంటిస్థలం ఇప్పటికీ అమలు కాలేదని, గత ప్రభుత్వాలు ఈ సిఫారసులను చెత్తబుట్టలో వేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విశాలంగా ఉన్న బంజరు భూములను వ్యవసాయ కార్మికులకు, గృహరహితులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. గత పదేళ్లుగా భూ పంపిణీ కార్యక్రమం నిలిచిపోయిందని, పేదల భూహక్కులు నిర్లక్ష్యం పాలవుతున్నాయన్నారు. అభివృద్ధి పేరిట కార్పొరేట్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు పేదల భూములను కబళిస్తున్నారని ఆరోపించారు. భవిష్యత్తులో ఆహార భద్రత ప్రమాదంలో పడే అవకాశం ఉందని హెచ్చరించారు. పేదలకు భూములు పంచడమే తమ లక్ష్యమన్నారు. తమ పోరాటానికి పెద్దసంఖ్యలో మద్దతు లభిస్తోందని చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆవుల శేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన ఎసైన్‌మెంట్ చట్ట సవరణ పేదల భూహక్కులను దోపిడీ చేసే నిర్ణయమని తీవ్రంగా విమర్శించారు. భూమిలేని పేదలకు భద్రత కల్పించాల్సిన ప్రభుత్వం ధనిక వర్గాల ప్రయోజనాల కోసం చట్టాలు మార్చడం ఆందోళనకరమన్నారు. రాష్ట్రంలో మొత్తం 33 లక్షల ఎకరాల అసైన్డ్ భూముల్లో దాదాపు 13 లక్షల ఎకరాలు ఇప్పటికే ధనికుల అధీనంలోకి వెళ్లిపోయాయన్నారు. పేదలకు రెండు సెంట్లు ఇవ్వలేని పాలకులు కార్పొరేట్ శక్తుల కోసం వేల ఎకరాలు దోచిపెడుతున్నారని విమర్శించారు. అసైన్డ్ భూముల బదలాయింపులను పూర్తిగా నిలిపివేయాలన్న కోనేరు రంగారావు కమిటీ సిఫారసులను ప్రభుత్వం విస్మరించడం బాధాకరమన్నారు. పేదల భూహక్కుల పరిరక్షణ కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, ప్రభుత్వం చట్ట సవరణను ఉపసంహరించుకోకపోతే ఆందోళనలు తప్పవని ఆవుల శేఖర్ హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అసైన్‌మెంట్ చట్ట సవరణను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దళితులు-పేదలు దశాబ్దాలుగా సాగుచేస్తున్న లక్షల ఎకరాలను పరిశ్రమలకు కట్టబెట్టేందుకే ప్రభుత్వం కుట్రపూరితంగా సవరణ తెచ్చిందని ఆయన ఆరోపించారు. ఈ నిర్ణయం వల్ల లక్షల మంది పేదలు నష్టపోతారని హెచ్చరించారు. పట్టాలు లేవనే పేరుతో భూములు వెనక్కి తీసుకొని... పెట్టుబడిదారులకు ఇవ్వడం దారుణమని పేర్కొన్నారు. అసైన్డ్ చట్ట సవరణను ఉపసంహరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ముమ్మరం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వర్లు, బి.కేశవరెడ్డి, సహాయ కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, కదిరప్ప, బాలస్వామి, గుర్రంకొండ సత్యానందం, షేక్ గౌస్, పంతగాని మరియదాసు, కె.దేవునిదయ, తోకల అనురాధ, భూక్యా దేశాయ్, రామారావు, ఉప్పెన నరసింహారావు, సీపీఐ గుంటూరు జిల్లా సహాయకార్యదర్శి చిన్ని తిరుపతయ్య, మంగళగిరి పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఈమని అప్పారావు, కె.కల్యాణ్, వి.రాణి, బి.కోటేశ్వరి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకూ ఎస్సీ, ఎస్టీ తరహా చట్టం: సుప్రీం

న్యూఢిల్లీ: దివ్యాంగులను కించపరిచే వారిపై చర్యలు తీసుకునేందుకు వీలుగా ఎస్సీ/ఎస్టీ చట్టం లాంటి కఠినమైన చట్టాలు అవసరమని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. ఈ దిశగా ఆలోచన చేయాలని కేంద్రానికి సూచించింది. యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియా, సమయ్ రైనాకు సంబంధించి పిటిషన్ల విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. కండరాల క్షీణత సమస్యపై అవగాహన కల్పిస్తూ బాధితులతో కలిసి ఓ ప్రదర్శన నిర్వహించాలని సమయ్ రైనాకు సుప్రీం కోర్టు సూచించింది. ఓ ఆన్‌లైన్ షోలో వెన్నెముక కండరాల క్షీణత(ఎస్ఎంఏ)తో బాధపడుతున్న ఓ చిన్నారికి అవసరమైన ఔషధాల గురించి ప్రస్తావిస్తూ వారిని కించపరిచే విధంగా సమయ్ రైనా మాట్లాడాడు. ఈ షోలో పాల్గొన్న వారిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ అరుదైన వ్యాధిపై పోరాడుతున్న స్వచ్ఛంద సంస్థ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దీన్ని తీవ్రంగా పరిగణించిన న్యాయస్థానం... ఆ షోలో పాల్గొన్న వారు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆదేశించింది. దీంతో సమయ్ రైనా క్షమాపణలు చెప్పాడు. రణ్‌వీర్ అలహాబాదియా, సమయ్ రైనాకు సంబంధించిన పిటిషన్లను సుప్రీం కోర్టు గురువారం విచారించింది. బాధితుల తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది అపరాజితా సింగ్.. కమెడియన్ వ్యాఖ్యలు చిన్నారులను కించపరిచేలా ఉన్నాయని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. వారు ఎంతో ప్రతిభావంతులని, ఇలాంటి వ్యాఖ్యలు క్రౌడ్ ఫండింగ్‌కు ఇబ్బందిగా మారుతాయన్నారు. వీటితో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఏకీభవించింది. దివ్యాంగులపై ఎవరైనా కించపరిచే వ్యాఖ్యలు చేస్తే... ఎస్సీ/ఎస్టీ చట్టం మాదిరిగా కఠిన చట్టాన్ని తీసుకువచ్చే విషయంపై ఎందుకు ఆలోచించరని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను సుప్రీం ధర్మాసనం అడిగింది. దివ్యాంగులకు రక్షణ కల్పించేందుకు కఠిన చట్టాలు తీసుకువచ్చే విషయంపై ఆలోచించాలని సూచించింది. వారికి కావాల్సింది గౌరవ, మర్యాదలని, వారి విజయాలను చాటిచెప్పేందుకు మీ వేదికను (ఆన్‌లైన్ షో) ఉపయోగించాలని యూట్యూబర్‌లకు సూచించింది.

తమిళనాడులో బీజేపీ కుట్ర రాజకీయాలు

సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

న్యూఢిల్లీ: 2026 అసెంబ్లీ ఎన్నికలకు ముందు తమిళనాడులో బీజేపీ 'మోసపూరిత రాజకీయాలకు' ప్రయత్నిస్తోందని, రాష్ట్రంలో ఆ పార్టీ జోక్యం పెరుగుతోందని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. తమిళనాడు మాజీ మంత్రి కె.ఎ.సెంగొట్టయన్ తమిళగ వెట్రి కజగం (టీవీకే)లో చేరాలని తీసుకున్న నిర్ణయంపై స్పందిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గురువారం ఆయన ఏఎన్ఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ 2026 మొదటి త్రైమాసికంలో ఎన్నికలు జరగనున్నందున, సాంప్రదాయకంగా ద్రవిడ పార్టీల ఆధిపత్యం ఉన్న రాష్ట్రంలో పట్టు సాధించడానికి బీజేపీ వ్యూహాత్మక ఎత్తుగడలు వేస్తోందని రాజా అన్నారు. అన్నాడీఎంకే ప్రస్తుత స్థితిని ప్రస్తావిస్తూ, 'ఆ పార్టీ అంతర్గత విభేదాలతో 'గందరగోళ' దశలో ఉంది. పార్టీలో చీలిక ఉంది. ఒక చివర ఈపీఎస్, మరొక చివర పన్నీర్ సెల్వంతో... ఇతర చిన్న వర్గాలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం పరిస్థితులు అంత స్పష్టంగా లేవు' అని అన్నారు. అయితే పొత్తులు, రాజకీయ పునరేకీకరణలు మారినప్పటికీ, డీఎంకే నేతృత్వంలోని సంకీర్ణం బలంగా ఉందని రాజా నొక్కి చెప్పారు. 'ఒక విషయం స్పష్టంగా ఉంది. డీఎంకే నేతృత్వంలోని సంకీర్ణం బలంగా ఉంది. బీజేపీ, దాని మిత్రపక్షాలకు వ్యతిరేకంగా పోరాడుతోంది' అని చెప్పారు.

ప్రజాస్వామ్యంపై దాడి

విద్యార్థులపై యూఏపీఏ కేసులు ఆక్షేపణీయం:నారాయణ

హైదరాబాద్: విద్యార్థులపై చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ) కేసులను ఢిల్లీ పోలీసులు పెడుతుండటం ఆక్షేపణీయమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు డాక్టర్ కె.నారాయణ అన్నారు. ఇది ప్రజాస్వామ్యంపై దాడి అని దుయ్యబట్టారు. ఆయన గురువారం సామాజిక మాధ్యమంలో ఓ పోస్టు పెట్టారు. విద్యార్థులపై పెట్టిన యూఏపీఏ కేసులను తక్షణమే కొట్టివేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఎన్‌కౌంటర్ జరిగిన మావోయిస్టు అగ్ర నాయకుడు హిడ్మా అభిమానాన్ని అణచివేయలేరని ఢిల్లీ పోలీసులకు నారాయణ తేల్చి చెప్పారు. దేశ-విదేశాల్లో ఆయనకు అభిమానులు ఉన్నారని తెలిపారు. అభిమానాన్ని నియంత్రించాలనే ఢిల్లీ పోలీసుల ప్రయత్నం ఖండనార్హమని పేర్కొన్నారు. విద్యార్థులపై యూఏపీఏ కేసులు పెట్టడం ప్రజాస్వామిక హక్కులు, భావ ప్రకటన స్వేచ్ఛ, విద్యార్థి క్రియాశీలతకు విరుద్ధమైన చర్యగా నారాయణ నొక్కిచెప్పారు.

ప్రైవేట్ వర్సిటీల పాలన, పర్యవేక్షణపై దర్యాప్తు

న్యూఢిల్లీ: ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటు, పరిపాలన, నిధులకు సంబంధించి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) పర్యవేక్షణపై దర్యాప్తు చేపట్టాలని సుప్రీంకోర్టు గురువారం ఆదేశించింది. అన్ని ప్రైవేట్, ప్రభుత్వేతర, డీమ్డ్-టు బి యూనివర్సిటీల స్థాపనకు దారితీసిన చట్టాలు, నిబంధనలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివరాలు అందించాల్సిందిగా జస్టిస్ అహ్సనుద్దీన్ అమానుల్లా నేతృత్వంలోని ధర్మాసనం కోరింది. ప్రైవేట్ యూనివర్సిటీలు 'లాభనష్టాలతో సంబంధం లేదు' అనే ప్రాతిపదికన పనిచేస్తామనే హామీ నెరవేర్చడానికి తీసుకున్న చర్యలను బహిర్గతం చేయాలని కేంద్రం, రాష్ట్రాలు, యూజీసీలను ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను వచ్చే ఏడాది జనవరి 8కి వాయిదా వేసింది. అయేషా జైన్ అనే విద్యార్థి అమిటీ యూనివర్సిటీపై దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది.

డిజిటల్ దోపిడీ గుట్టు రట్టు

- కంబోడియా కేంద్రంగా సైబర్ వల
- భీమవరంలో రిటైర్డ్ ప్రొఫెసర్ 'డిజిటల్ అరెస్ట్'
- రూ.78 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు
- ఏడు బృందాలతో పోలీసుల వేట- 13 మంది అరెస్ట్
- రికార్డు స్థాయిలో రూ.42 లక్షలు రికవరీ

విశాలాంధ్ర-భీమవరం టౌన్: కంబోడియా కేంద్రంగా అంతర్జాతీయ స్థాయిలో సాగుతున్న సైబర్ నేరాలకు పాల్పడుతున్న ముఠా గుట్టును భీమవరం పోలీసులు రట్టు చేశారు. నేరగాళ్లను పట్టుకోవడమే కాకుండా... భీమవరానికి చెందిన రిటైర్డు ప్రొఫెసర్ పోగొట్టున్న సొమ్ములో చాలా వరకు తిరిగి రాబట్టి రికార్డు సృష్టించారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి మీడియాకు కేసు వివరాలు వెల్లడించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన విశ్రాంత ప్రొఫెసర్ శర్మకు ఇటీవల గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఫోన్ వచ్చింది. తమను తాము సీబీఐ, ఇతర కేంద్ర దర్యాప్తు సంస్థల అధికారులమని పరిచయం చేసుకున్నారు. 'మీ పేరు మీద జారీ అయిన సిమ్ కార్డులో తేడా ఉంది. దాని ద్వారా చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరుగుతున్నాయి' అని బెదిరించారు. ఆ సమస్యను తామే సరి చేస్తామని నమ్మబలికారు. అంతటితో ఆగకుండా, మిమ్మల్ని 'డిజిటల్ అరెస్టు' చేస్తున్నామంటూ ఆ వృద్ధుడిని భయపెట్టారు. కంగారుపడిన బాధితుడు తన ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలను వారికి వెల్లడించారు. ఆయన చేత నిందితులు ఏకంగా ఆరుసార్లు బ్యాంకుకు వెళ్లేలా చేసి, విడతల వారీగా రూ. 78 లక్షలను తమ ఖాతాల్లోకి బదిలీ చేయించుకున్నారు. కేవలం 13 రోజుల వ్యవధిలోనే ఆయన జీవిత కాలపు సంపాదన కరిగిపోయింది. మోసపోయానని గ్రహించిన బాధితుడు భీమవరం టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా... పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి ఈ కేసును సవాలుగా తీసుకున్నారు. భీమవరం పోలీసులు 7 ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గత పది రోజులుగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితుల కోసం వేట ప్రారంభించారు. నిందితులు కార్డ్ డీల్ అనే కొత్త పద్ధతి ద్వారా నగదును మళ్లించారని, ఈ ముఠాకు కంబోడియా దేశంతో సంబంధాలున్నట్లు తేల్చారు. మొత్తం 14 మందిని నిందితులుగా గుర్తించగా, వారిలో 13 మందిని పోలీసులు గన్నవరం, విజయవాడ సమీపంలో అరెస్టు చేశారు. అయితే అసలు సూత్రధారి ముంబైకి చెందిన రహాతే జె నయన్ అనే పరారీలో ఉన్నాడు. అరెస్టయిన వారిలో ఏడుగురు గతంలో కంబోడియా దేశంలో ఉండి వచ్చినవారేనని తేలింది. వీరిలో కొందరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు (టెకీలు) కూడా ఉన్నారు. ఒకరు ప్రముఖ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేసినట్లు విచారణలో తేలింది. వీరంతా తెలుగు రాష్ట్రాలతో పాటు కర్నాటకలో మకాం వేసి ఈ దందాను నడిపిస్తున్నారు. కాగా, ఇంత పెద్ద మొత్తంలో నగదు రికవరీ చేయడం ఇదే మొదటిసారి అని ఎస్పీ తెలిపారు. బాధితుడు కోల్పోయిన రూ. 78 లక్షల్లో, ఏకంగా రూ. 42 లక్షల నగదును నిందితుల నుంచి రాబట్టగలిగారు. మరో రూ. 19 లక్షలను వివిధ బ్యాంకు ఖాతాల్లో స్తంభింప చేశారు. నిందితుల నుంచి 15 సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు. భారత చట్టాల్లో 'డిజిటల్ అరెస్టు' అనే పదమే లేదని ఎస్పీ తెలిపారు. ఏ పోలీస్ అధికారికీ స్కైప్ లేదా వాట్సాప్ వీడియో కాల్ ద్వారా అరెస్టు చేసే అధికారం లేదన్నారు. ఈ ముఠాలు ప్రధానంగా విశ్రాంత ఉద్యోగులు, ఒంటరిగా ఉండేవారిని టార్గెట్ చేస్తున్నాయని... ఎవరైనా ఫోన్ చేసి డిజిటల్ అరెస్టు అని బెదిరిస్తే భయపడవద్దని తెలిపారు. వెంటనే 1930 నంబరుకు కాల్ చేయడం లేదా దగ్గర్లోని పోలీస్ స్టేషన్‌ను సంప్రదించడం చేయాలని సూచించారు. అత్యంత చాకచక్యంగా ఈ సంక్లిష్టమైన సైబర్ నేరాన్ని అతి స్వల్ప కాలంలో ఛేదించేందుకు విశేష కృషి చేసిన భీమవరం టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ జి. కాళీ చరణ్, టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఎం.నాగరాజు గారు, రూరల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు, ఆకివీడు ఇన్‌స్పెక్టర్ వి. జగదీశ్వరరావు సహా ఎస్సైలు రెహమాన్, వంశీ, శ్రీనివాసరావు, రవి వర్మ, నాగరాజు వారి సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందిస్తూ, నగదు రివార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు, ఇతర పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.